తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 21.08.2025 | సంపుటి : 12 సంచిక : 33 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






నేడు ఘోష్ కమిషన్‌పై

## హైకోర్టులో విచారణ

హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై కెసిఆర్ పిటిషన్‌ను హైకోర్టు విచారణక స్వీకరించింది. కమిషన్ నివేదికను రద్దు చేయాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరగనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలపై న్యాయ విచారణకు జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న ప్రభుత్వం జారీ చేసిన జీవో 6ను కూడా అందులో సవాలు చేశారు. ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, జస్టిస్ ఘోష్ కమిషన్‌ను పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు

మిగతా 2లో..



# అభివృద్ధిని అడ్డుకుంటే ద్రోహులే..

## హైదరాబాద్ పురోగతికి ఎందరో కృషి చేశారు



- నాడు హైటెక్ సిటీ కడతామన్నా వ్యతిరేకించారు
- అభివృద్ధిని కొనసాగించాలన్నదే మా ప్రభుత్వ పట్టుదల
- మూసీ ప్రక్షాళనతో ముందుకు సాగుతాం
- మరింత సుందర నగరంగా తీర్చిదిద్దుతాం
- గచ్చిబౌలిలో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ ఇంటిగ్రేటెడ్ ఆఫీసులకు సీఎం శంకుస్థాపన

హైదరాబాద్,శేరిలింగంపల్లి(జనంసాక్షి): రాజీవ్ గాంధీ వల్లే ఐటీ రంగంలో చాలా మంది రాణిస్తున్నా రని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆనాడు రాజీవ్ గాంధీ కంప్యూటర్ ను దేశానికి పరిచయం చేశారు.. పీవీ నర్సింహారావు స్పెషల్ ఎకనామిక్ జోన్ ను మంజూరు చేశారు.. నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హైటెక్ సిటీకి శంకుస్థాపన చేశారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఉమ్మడి రాష్ట్రంలో సీఎంలుగా వ్యవహరించిన చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్ర ఉందని వెల్లడించారు. 1994 నుంచి 2014 వరకు హైదరాబాద్‌ను అప్పటి సీఎంలు అభివృద్ధి చేసినట్లు- పేర్కొన్నారు. గూగుల్‌లాంటి ప్రముఖ సంస్థల్లో తెలుగువారు పెద్ద పదవుల్లో ఉన్నారని తెలిపారు. మన ప్రాంత విద్యార్థులు ఇక్కడే చదువు కోవాలని పలుసంస్థలు నిర్మించారని గుర్తు చేశారు. గచ్చిబౌలిలో డిస్ట్రిక్ట్‌రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ ఇంటిగ్రేటెడ్ ఆఫీసులకు సీఎం శంకుస్థాపన చేశారు.

మిగతా 2లో..

## రాజీవ్ ఆశయాలను ముందుకు తీసుకెళతాం

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం

రాజీవ్‌కు సీఎం రేవంత్ తదితరుల నివాళి



3లో..



# అరెస్టైతే పదవీచ్యుతుల్ని చేస్తారా?

**ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే మూడు కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన అమిత్ షా**

**బిల్లు ప్రతులను చించి విపక్షాల నిరసన.. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని ఆందోళన**

- ప్రతిపాదిత బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీకి సిఫారసు
- ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ(జనంసాక్షి): తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లుతో సహా మూడు బిల్లులను కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. బిల్లుల కాపీలను చింపి అమిత్ షాపైకి విసిరారు. ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగం, సమాఖ్యవాదానికి వ్యతిరేకంగా ఉన్నట్లు విపక్షాలు ఆరోపించాయి. అయితే ఈ బిల్లులను హడావుడిగా తీసుకొచ్చారనే విమర్శలను కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపనున్నట్లు ప్రకటించారు. నేరం చేస్తే ప్రధాని,

మిగతా 2లో..

## ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నేడు జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్



హాజరుకానున్న జాతీయ స్థాయి నేతలు, సీఎంలు, ప్రజాప్రతినిధులు

న్యూఢిల్లీ, (జనంసాక్షి) : ఇండియా కూటమి తరపున ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నేడు జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. అందుకు సంబంధించిన కార్యక్రమాలన్నీ సిద్ధమయ్యాయి. దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారిన ఉప రాష్ట్రపతి ఎన్నిక దరిమిలా ఇండియా కూటమి

మిగతా 2లో..

## ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్ నామినేషన్

ప్రధాని మోడీ, అమిత్ షా, రాజ్‌నాథ్ తదితరుల హాజరు

9లో..

## ఢిల్లీ సీఎంపై దుండగుడి అనూహ్యదాడి

- వినతిపత్రం ఇస్తూ రేఖాగుప్తా చెంపపై కొట్టిన వ్యక్తి
- నిందితుడు రాజ్‌కోట్‌కుచెందిన వాడిగా గుర్తింపు
- దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ సీఎం అతిషి



న్యూఢిల్లీ(జనంసాక్షి): ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై ఓ యువకుడు దాడి చేశాడు. బుధవారం ఉదయం సివిల్ లైన్స్‌లోని సిఎం అధికారిక నివాసంలో జరిగిన జన్ సున్వై కార్యక్రమంలో ఈ ఘటన జరిగినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వర్గాలు తెలిపాయి. నిందితుడిని సంఘటనా స్థలం నుండి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడు మొదట ముఖ్యమంత్రికి ఫిర్యాదుగా ఒక పత్రాన్ని అందజేసి, ఆపై ఆమెపై దాడి చేసినట్లు- బిజెపి నాయకుడు ఒకరు తెలిపారు. సిఎం రేఖ గుప్తాపై జరిగిన దాడిని ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా తీవ్రంగా ఖండించారు. ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ దేవేందర్ యాదవ్ కూడా ఈ దాడిని ఖండించారు.



మిగతా 2లో..



# సాదాబైనామాలకు పచ్చజెండా

**స్టే ఎత్తివేసిన హైకోర్టు ధర్మాసనం**

**త్వరలోనే 4 లక్షల దరఖాస్తులపై నిర్ణయం : మంత్రి పొంగులేటి**



హైదరాబాద్(జనంసాక్షి): సాదా బైనామాలపై తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సాదా బైనామాలపై గతంలో విధించిన స్టే ఎత్తేస్తూ నిర్ణయం తీసుకుంది కోర్టు. హైకోర్టు తాజా నిర్ణయంతో ఇప్పటికే పెండింగ్ లో ఉన్న తొమ్మిదిన్నర లక్షల దరఖాస్తులకు ఊరట లభించనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 నవంబర్ 10 వరకు ఆన్ లైన్‌లో

మిగతా 2లో..

50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు

## కేంద్రం ఆమోదం

**తెలంగాణ ఎంపీలను అభినందించిన మంత్రి తుమ్మల**

**వారంలోగా సరఫరా చేస్తామని కేంద్రం హామీ**



హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలోరైతులకు తగినంత యూరియా సరఫరా చేయాలంటూ కేంద్రంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. తెలంగాణ రాష్ట్రానికి 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసేందుకు కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మొత్తం ఈ వారంలో తెలంగాణకు సంఫరా చేస్తామని సదరు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దీంతో కర్ణాటక నుంచి 10,800 మెట్రిక్ టన్నుల యూరియా షిప్‌మెంట్ ప్రారంభం కానుంది. ఈ వారంలో మరో మూడు షిప్‌మెంట్‌ల ద్వారా యూరియా సరఫరాకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు ఆదేశాలు జారి చేసింది. రాష్ట్రంలో యూరియా కొరతపై పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ ఎంపీలు ఆందోళనలకు దిగారు. దీంతో తెలంగాణ రైతాంగం యూరియా కోసం పడుతున్న కష్టాలు దేశానికి తెలిసింది. దీంతో కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రిత్వ శాఖ స్పందించింది. కేంద్రం తెలంగాణకు భారీగా యూరియా సరఫరా చేయడంపై రాష్ట్ర ఎంపీలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. ప్రతి పక్ష పార్టీలు రాజకీయ స్వార్థం కోసం చేసే కుట్రలపై ఆలోచన చేయాలంటూ రైతాంగానికి ఆయన కీలక సూచన చేశారు. తెలంగాణకు కేటాయించిన యూరియా సకాలంలో సరఫరా చేయకుండా కేంద్ర

మిగతా 2లో..



## కాంగ్రెస్ పాలనలో అన్నదాతల అరిగోస

- ఎరువుల కోసం మళ్లీ క్యూలు కడుతున్నారు
- కాంగ్రెస్ చరిత్రలో రైతులను ఆదుకున్న దాఖలా లేదు
- ఈ దుస్థితిపై రైతన్నలు బాగా ఆలోచించాలి
- కేసీఆర్ పాలనలో ఇంతటి దైన్యం ఏనాడూ రాలే: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): పోలీసులను పెట్టి ఎరువులు పంచే దుస్థితి ఎన్నడూ లేదని.. మరి ఈ పరిస్థితి రాష్ట్రంలో ఎందుకు వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో రాష్ట్రంలోని రైతన్నలు ఆలోచించాలని కోరుతున్నానన్నారు. హైదరాబాద్ నందినగర్‌లోని నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. గత రెండునెలలుగా తెలంగాణలో ఊరు, ఏ పల్లె చూసినా తండోపతండాలుగా రైతులు, వారి కుటుంబ సభ్యులు ఎక్కడికక్కడ అవస్థలు పడుతున్న

మిగతా 2లో..

## ఉపరాష్ట్రపతి ఎన్నికపై ఎవరూ సంప్రదించలేదు

- మేం ఏ పార్టీ కూటమిలోనూ లేము
- పార్టీలో ఆలోచించి నిర్ణయిస్తాం: కేటీఆర్

2లో..

## అంగన్వాడీల్లో చిన్నారులకు అల్పాహారం

పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం : మంత్రి సీతక్క



హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ చిన్నారులకు త్వరలో అల్పాహారం పథకం ప్రారంభించనున్నట్లు తెలంగాణ మహిళ, శిశు సంక్షేమశాఖల మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్‌లోని 139 అంగన్వాడీ కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశామని.. దీంతో 30 శాతం హాజరు పెరిగిందని చెప్పారు. ప్రతి చిన్నారికీ ఉదయం 100మి.లీ పాలు సరఫరా చేసే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. అంగన్వాడీల్లోని వసతులపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. చిన్నారులకు వారంలో కనీసం ఒక రోజు ఎగ్ బిర్యానీ, వెజిటబుల్ బిర్యానీ వడ్డించాలన్నారు. "అంగన్వాడీ భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి. ఇందిరమ్మ ఇళ్ల తరహాలో ఉచితంగా ఇసుక సరఫరా చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి అంగన్వాడీ భవనాలకు అనుమతులు మంజూరు చేస్తే ఇప్పటివరకు కేవలం 625 ప్రాంతాల్లోనే స్థలాలు గుర్తించారు. ఒక్కో అంగన్వాడీ భవన నిర్మాణానికి రూ. 12లక్షలు మంజూరు చేశాం. నిర్మాణాలు పూర్తయిన 22 భవనాలను స్థానిక ఎమ్మెల్యేలతో

మిగతా 2లో..



## రష్యాతో చమురు వాణిజ్యంలో భారత సంపన్నులే లాభపడుతున్నారు

- కొనుగోళ్ల వ్యవహారంపై మరోసారి స్పందించిన అమెరికా
- రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకే భారత్‌పై ఆంక్షలు
- వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కీలక వ్యాఖ్యలు

వాషింగ్టన్(జనంసాక్షి): రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్ల అంశంపై అమెరికా మరోసారి స్పందించింది. ఈ క్రమంలో భారతీయ బిలియనీర్లపై అక్కసు వెల్లగక్కింది. ఈ మేరకు యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ తాజాగా ఎన్‌బీసీ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేయగా.. వైట్ హౌస్ ట్రేడ్ అడ్వైజర్ పీటర్ నవారో ఏకంగా ఓ పత్రికలో వ్యాసం రాశారు. యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ ఆ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అంతర్జాతీయ వ్యాపార ఒప్పందాల్లో భారతదేశంలోని అత్యంత సంపన్న కుటుంబాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. రష్యాతో కొనసాగుతున్న చమురు వాణిజ్యం.. ఈ కుటుంబాలకే భారీ లాభాలను తెచ్చిపెడుతున్నాయి. ఈ క్రమంలో.. ఆంక్షలనూ లాభార్జనగా మార్చుకున్నారు అని ఆరోపించారాయన. 2022 కంటే ముందు.. ఉక్రెయిన్ సంక్షోభం కంటే ముందు రష్యా నుంచి భారత్ 1 శాతం కంటే తక్కువ చమురును కొనుగోలు చేసేది. ఇప్పుడది 42 శాతానికి చేరి ఉండొచ్చు.

మిగతా 2లో..

## భారత్‌పై సుంకాల విషయంలో అమెరికా తీరు అన్యాయం:రష్యా

2లో..

## సాదాబైనామాలకు పచ్చజెండా

దరఖాస్తులు స్వీకరించింది. ఆ తర్వాత సాదా బైనామాలపై స్టే విధించింది హైకోర్టు. సాదా బైనామాల అంశంపై బుధవారం విచారణ జరిపిన హైకోర్టు స్టే ఎత్తేస్తూ తీర్పు వెల్లడించింది. ఆర్ ఓ ఆర్ చట్టంలో సాదా బైనామా అంశాన్ని పొందుపర్చక పోవడంతో.. సుమారు తొమ్మిదిన్నర లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగులో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పుడు సాదాబైనామాలపై ఉన్న స్టే ఎత్తేస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకోవడంతో గత కొన్నేళ్లుగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులకు మోక్షం లభించనుంది. ఇదిలా ఉండగా.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సాదాబైనామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే 4 లక్షల సాదాబైనామాలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల సమయంలో సాదాబైనామాలు క్లియర్ చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే సాదాబైనామాలపై హైకోర్టు స్టే ఉండటంతో ఈ అంశం పరిష్కారానికి ప్రభుత్వానికి ఇబ్బంది ఉండేది. ఇప్పుడు కోర్టు తీర్పుతో సాదాబైనామాలను క్లియర్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందని చెప్పాలి.

# కాంగ్రెస్ పాలనలో అన్నదాతల అరిగోస

పరిస్థితి, దయనీయమైన పరిస్థితి దేశం, రాష్ట్రం మొత్తం చూస్తున్నది. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చిల్ల రాజకీయాలు చేయడం తెలుసు. బురదజల్లడం తెలుసు. కానీ, పనికివచ్చే ఒక్క పని చేతకాదని స్పష్టంగా తేలిపోయింది. చాతకాని కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన వల్ల రైతులు ఒక బస్తా ఎరువు దొరక్క ఆగమాగమవుతున్న పరిస్థితి రాష్ట్రంలో కనిపి స్తున్నది. చివరికి పంట అమ్ముకోవాలి.. పంట కొనాలే ప్రభుత్వం అంటే రైతులు అధికారుల కాళ్లపై పడే దుస్థితి ఉందన్నారు. నేడు ఎరువుల బస్తాల కోసం కూడా ఎక్కడికక్కడ రైతులు కాళ్లావేళ్లపడి అధికారులను బతిమిలాడుకునే పరిస్థితి కనిపిస్తున్నది. అధికారుల కాళ్లు పట్టుకునే దౌర్భాగ్యమైన పరిస్థితి కనిపిస్తున్నదని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చరిత్ర ఎన్నడూ కూడా రైతుల విషయంలో సానుకూలమైన చరిత్ర కాదు. రైతులకు మేలు చేసే చరిత్ర కాదు. ఇవాళ మళ్లీ ఒకసారి ఆనాటి రోజులు తెస్తామని హామీ ఇచ్చిందో కాంగ్రెస్ పార్టీ.. దానికి అనుగుణంగానే.. ఆనాడు అర్ధరాత్రి బాయికాడ పండుకునే దుస్థితి ఉండెనో.. ఇవాళ మరోసారి చివరి మహిళా రైతు ఎరువుల దుకాణం వద్ద పడుకునే దుస్థితి కూడా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పతనం మూలాన కనిపిస్తున్నది. కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వంలో ఆరు నెలల ముందే బఫర్ స్టాక్ తెప్పించి ఎక్కడికక్కడ గోదాములను సీజన్ మొదలుకాక ముందే నింపి పెట్టేది. భారత్‌లో ఎక్కడ యూరియా దొరికినా అక్కడి నుంచి తెప్పించి.. రైతుల కడుపులో చల్లకదలకుండా కూర్చునే విధంగా.. ఇంటికే ఎరువుల బస్తాలు పంపిన పరిస్థితిని కేసీఆర్ పాలనలో చూశాం. 4లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల సామర్థం ఉన్నది మేం బాధ్యతలు చేపట్టిననాడు. రైతులకు మేలు జరగాలని 24లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి సంవత్సరం, సంవత్సరన్నర లోపే తీసుకెళ్లిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని కెటిఆర్ గుర్తు చేశారు. గోదాములు ఉన్నా, రైతువేదికలున్నా, కష్టపడే రైతులు ఉన్నా.. కేసీఆర్ కష్టపడి చేయించిన మిషన్ కాకతీయ చెరువులు, అద్భుతంగా కట్టిన కాళేశ్వరంతో సహా ప్రాజెక్టులు కళకళలాడుతున్నా.. కానీ, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం వానాకాలం సీజన్ మొదలైనా దున్నపోతుపై వానపడ్డట్లుగా ఉన్నది. కనీసం ప్లానింగ్ లేదు. సమీక్ష లేదు, సన్నద్ధ లేదు. ఎక్కడ ఆలోచన, ప్రణాళిక లేదు. ప్రణాళిక, అనుభవ రాహిత్యం, పరిపాలన చేతగానితనం, ఇతర అంశాలపై దృష్టిపెట్టడం వల్ల ఇవాళ రాష్ట్రంలో రైతులు అవస్థలు పడుతున్నరు. ఒక్కటంటే ఒక్కరోజు ముఖ్యమంత్రి వ్యవసాయంపై, ఎరువులపై సమీక్ష చేయలేదు. కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి విజ్ఞప్తి చేసింది లేదు. పేరుకు రాహుల్ గాంధీనికి కలిసేందుకు వెళ్లి.. ఏదో కాగితం ఇచ్చి రావడం కాదు. సీనియస్‌గా, సిన్సియర్‌గా ఇక్కడ ఏ పరిస్థితి ఉంది? ఎట్లా వ్యవసాయ విస్తరణ కేసీఆర్ హయాంలో జరిగింది? దానికి అనుగుణంగా ఎంత ఎరువు కావాలనే ఇండెంట్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి వెళ్లలేదు. ముందస్తు ప్రణాళిక తయారు చేయలేదు. దాని ఫలితంగానే రాష్ట్రంలో ఎరువుల కొరత కనిపిస్తుంది. కేసీఆర్ ఉన్న పదేళ్లు ఎన్నడూ లైన్లు లేవు. ఎరువుల కోసం కొట్లాడుకునే పరిస్థితి లేదు. పోలీసులను పెట్టి ఎరువులు పంచే దుస్థితి ఎన్నడూ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో రాష్ట్రంలోని రైతన్నలు ఆలోచించాలని కేటీఆర్ కోరారు.

### ఉపరాష్ట్రపతి ఎన్నికపై
# ఎవరూ సంప్రదించలేదు

**మేం ఏ పార్టీ కూటమిలోనూ లేము**
**పార్టీలో ఆలోచించిన నిర్ణయిస్తాం: కేటీఆర్**



**హైదరాబాద్(జనంసాక్షి):**ఉప రాష్ట్రపతి ఎన్నిక విషయంలో ఇప్పటి వరకు తమను ఎవరూ సంప్రదించలేదని, అలాగే తాము ఏ కూటమిలోనూ లేనందు వల్ల ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ సమాధానం ఇచ్చారు. సెప్టెంబర్ 9లోపు తెలంగాణకు ఎవరు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇస్తే వారికే తమ మద్దతు ఉంటుందని కూడా కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ రైతులకు యూరియా మోదీ ఇస్తే ఎన్డీఏకు, రాహుల్ ఇస్తే ఇండి కూటమికి మద్దతు ఇస్తామన్నారు. బీఆర్ఎస్ అనేది సర్వస్వతంత్రమైన పార్టీ. మాకు ఢిల్లీలో ఎవరూ బాస్‌లు లేరు. మాకు ఢిల్లీలో మాకు ఏ బాస్ లేదు. మాకు ఢిల్లీలో ఆజ్ఞపించే, ఆదేశించేవారు ఎవరూ లేరు. మా పార్టీని ఇప్పటి వరకు సంప్రదించలేదు. సెప్టెంబర్ 9న ఎన్నిక కాబట్టి.. కూర్చొని ఆలోచించి.. ఎన్నికల తేదీ నాటికి మా వైఖరిని ప్రకటిస్తాం అన్నారు. మేం తెలంగాణ ప్రజలకు మూడ్‌కు అనుగుణంగా, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు, ప్రయోజనాలకు అనుగుణంగా ఏ నిర్ణయమైనా తీసుకుంటాం. ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రేవంత్‌రెడ్డి పెట్టిన వ్యక్తి అయితే తాము వ్యతిరేకిస్తాం. కాంగ్రెస్ అనే చిల్లర పార్టీ, థర్డ్ క్లాస్ పార్టీ ఇవాళ రాష్ట్రంలో ప్రజలను ఎంత అరిగోస పుచ్చుకుంటున్నదో రాష్ట్ర ప్రజలకు తెలుసు. అలాంటి థర్డ్ క్లాస్ ముఖ్యమంత్రి.. థర్డ్ క్లాస్ పార్టీ పెట్టిన అభ్యర్థిని మేం సమర్థిస్తామని మీరెలా అనుకుంటారని అంటూ పరోక్షంగా ఇండియా కూటమి అభ్యర్థిని వ్యతిరేకిస్తామని సూచన చేశారు. బీసీల విషయంలో మా పార్టీ చిత్తశుద్ధితో ఉన్నది. బలహీన వర్గాల విషయంలో ఢిల్లీ వరకు కొట్లాడుతాం. మరి బీసీని అభ్యర్థిగా ఎందుకు పెట్టలేదు. అంత ప్రేమ ఉన్నప్పుడు బీసీ అభ్యర్థిని పెట్టలేదు. తెలంగాణ నుంచి బీసీ అభ్యర్థి దొరకలేదా? కంచ ఐలయ్యను పెట్టాల్సిందని అన్నారు. బీసీలపై ప్రేమ మాత్రం నోట్లోనే ఉంటది. ఎన్నికల్లో నిలబెట్టే సరికి బీసీలు కనిపించరు మీకు. మీ మాటలు మేం నమ్మాలి.. మీ వెనుకలా నిలబడాలి. మీరేమైనా మెర్బాని చేస్తున్నారా మాకు. మాది స్వతంత్రమైనా పార్టీ. ఎన్‌డీఏ, ఇండియాలో లేము. మోదీ మా బాస్ కాదు.. రాహుల్ మా బాస్ కాదు. తెలంగాణ ప్రజలు మా బాస్‌లు. వారి ఆలోచన, అభిప్రాయానికి అనుగుణంగా మా నిర్ణయం ఉంటుంది. కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే. తెలంగాణను ఇద్దరూ ముంచినవారే. 11 ఏళ్లు బీజేపీ ఏం చేయలేదు. 20 నెలలుగా కాంగ్రెస్ ఏమీ చేయలేదు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదు. ఆ ఇద్దరు అభ్యర్థులను సీరియస్‌గా తీసుకోవాల్సిన ఆలోచన ఉంటుందని వ్యక్తిగతంగా నేను అనుకోను. కానీ, నా అభిప్రాయం పార్టీ అభిప్రాయం కాదు. పార్టీగా కూర్చొని ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇన్‌చార్జీలు, రాష్ట్ర కమిటీ-.. అవసరమైతే కేసీఆర్‌తో అభిప్రాయాలు చెప్పి పార్టీగా ఒక నిర్ణయం తీసుకుంటాం. వ్యక్తిగతంగా మాత్రం కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే. రెండు తెలంగాణకు పనికివచ్చే పార్టీలు కాదు. రెండు ఢిల్లీ పార్టీలే, వాటిని పట్టించుకోవాల్సిన, వాటి రాజకీయం కోసం ఆలోచించాల్సిన అవసరం లేదనేది వ్యక్తిగతంగా నా అభిప్రాయం అన్నారు.

# అభివృద్ధిని అడ్డుకుంటే ద్రోహులే..



కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. హైటెక్ సిటీ కట్టినప్పుడు అవహేళన చేశారు. హైదరాబాద్ నగరం సింగపూర్, టోక్యోతో పోటీ పడుతోంది. మన వద్ద అన్ని ఉన్నప్పుడు చిత్తశుద్ధితో పనిచేయడం కావాలి. అమెరికాలో మన ఐటీ- నిపుణులు పని చేయడం ఆపేస్తే స్తంభించిపోతుంది. రాష్ట్రంలో శాంతి భద్రతలతో కూడిన ఉద్యోగ భద్రత ఇచ్చాం. రాబోయే పదేళ్లలో వన్ బిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతాం అన్నారు. ఇప్పుడు మూసీ ప్రక్షాళన ఎందుకు అడ్డుకుంటున్నారు. మూసీ మురికిలో బతకాలని పేదలు ఎందుకు అనుకుంటారు? తెలంగాణ రైజింగ్ 2047తో అభివృద్ధి చేసుకుందాం. మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన జరగాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సరైన సౌకర్యాలు లేవు. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పిస్తుందోని రేవంత్ వెల్లడించారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా పరిపాలనకు ఇబ్బంది లేకుండా నిర్మాణం చేపట్టనున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీలో భాగంగా 30 కోట్లు- ఈ భవన నిర్మాణానికి అపర్ణ కన్స్ట్రక్షన్ కేటాయించిందన్నారు. నిజాం నవాబులు 400 ఏళ్ల చరిత్ర ఉన్న నగరంలో నిర్మించారు.. మాదాపూర్, కొండాపూర్, వట్టి నాగులపల్లి వరకు అభివృద్ధి చేసేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డితో పాటు- పలువురు ముఖ్యమంత్రులు కృషి చేశారు.. ప్రపంచంలోని 500కు పైగా కంపెనీలు ఇక్కడే ఉన్నాయి.. మరోవైపు, చిన్న చిన్న వర్షాలకే హైదరాబాద్ నగరం మునిగిపోతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన చేస్తామంటే కొందరు వద్దని అంటున్నారు.. ఈ నగరాన్ని ఇలాగే వదిలేద్దామా.. ప్రపంచానికి ఆదర్శంగా హైదరాబాద్ ను నిలుపుకుందామా? అని ప్రశ్నించారు. ప్రపంచం ఆశిస్తున్న స్థాయిలో హైదరాబాద్ కు ఇంకా డెవలప్‌మెంట్ చేయాల్సి ఉంది.. మనం న్యూయార్క్, టోక్యో లాంటి నగరాలతో పోటీ- పడాలి.. చిత్తశుద్ధితో సాధిస్తే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. కాబట్టి, వరిజిబాల్ సిటీ-ని గోల్డెన్ సిటీ- చేయాలంటే మూసీ ప్రక్షాళన చేసి తీరాలి.. మనకు నదుల ప్రక్షాళన అవసరం.. గంగా, యమున, సబర్మతి నదులను ఆయా రాష్టాలు ప్రక్షాళన చేశాయి.. మనం కూడా మూసీని ప్రక్షాళన చేసుకోవాలన్నారు. పేదల కోసం స్థలాలు వెతకమని మంత్రులకు చెబుతున్నా.. వారికి ఇల్లు కట్టి ఇద్దాం.. సొంత ఇల్లు కళ నెరవేరాలంటే నగరం విస్తరించాలి.. మూసీ విస్తరించాలి.. రాత్రుళ్ళు అక్కడ బిజినెస్ నడవాలి.. నైట్ ఎకానమిని మూసీలో సృష్టించాలని రేవంత్ రెడ్డి సూచించారు. అయితే, గత ముఖ్యమంత్రుల దూరదృష్టితో హైదరాబాద్ కి అనేక అంతర్జాతీయ కంపెనీలు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. ఇప్పుడు అమెరికాలోని సిలికాన్ వ్యాలీని శాసిస్తున్నాం.. మన వాళ్ళు ఒక్క రోజు పని చేయకపోతే అమెరికా కుప్పకూలిపోతుంది. కాగా, తెలంగాణ రైజింగ్ 2047 అంటు-న్నాం.. 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తెలంగాణ ఎదగాలని చెప్పుకొచ్చారు. ఇక, సంవత్సరానికి 15 వేల కోట్ల ఆదాయం ఇచ్చే రిజిస్ట్రేషన్ శాఖ బంగారు గుడ్డు పెట్టె- బాతు.. లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టి రాష్ట్రానికి ఆదాయం తెచ్చి పెడుతున్న వారిని దొంగలుగా చూస్తున్నారు.. నేరం చేసే వాళ్ళ మాదిరిగా రిజిస్ట్రేషన్ కు వచ్చే వాళ్ళను చూసే పరిస్థితి మారాలని సీఎం సూచించారు. అన్ని వసతులు ఈ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉంటాయని రేవంత్ రెడ్డి సూచించారు. ఈ ప్రభుత్వం మీది.. మీకు వసతులు కల్పించడం వల్ల మంచి పేరు వస్తుంది.. 144 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సంవత్సరానికి 19 లక్షల డాక్యుమెంట్లు- చేస్తున్నాం.. విదేశాల్లో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు మంచి పేరు ఉంది.. అన్ని ప్రభుత్వ శాఖలను ప్రక్షాళన చేయాలి.. 2034లో ప్రపంచం హైదరాబాద్ ను ఫ్యూచర్ సిటీగా చూడడానికి రావాలి.. అన్ని విభాగాలు అక్కడి నుంచే పని చేయాలని వెల్లడించారు. ఇక, జూన్ 2వ తేదీ లోపు 11 ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు పూర్తి చేయాలి.. కేవలం 8 నెలల్లోనే అపర్ణ కన్స్ట్రక్షన్ వారు ఇంటిగ్రే-టె-డ్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసు నిర్మాణం పూర్తి చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు.

## ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నేడు జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్

అనూహ్యంగా బి సుదర్శన్‌రెడ్డిని తమ అభ్యర్థిగా ప్రకటించిన విషయం విదితమే. అందులోభాగంగా నేడు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు చెందిన జాతీయ స్థాయి నేతలు, ముఖ్యమంత్రులు హాజరు కానున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సుదర్శన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో పాల్గొననున్నారు. నేడు ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి ఢిల్లీకి పయనమవుతారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగనుంది.

## ఢిల్లీ సీఎంపై దుండగుడి అనూహ్యదాడి

ఈ సంఘటనను దురదృష్టకరం అని అభివర్ణించారు. ముఖ్యమంత్రి మొత్తం ఢిల్లీకి నాయకత్వం వహిస్తున్నారని ఆయన అన్నారు. ఢిల్లీ సిఎం భద్రతను కూడా యాదవ్ ప్రశ్నించారు. ఈ సంఘటన మహిళల భద్రతను కూడా బహిర్గతం చేస్తుంది. ఢిల్లీ సిఎం సురక్షితంగా లేకపోతే, ఒక సామాన్యుడు లేదా సాధారణ మహిళ ఎలా సురక్షితంగా ఉంటారు? అని దేవేందర్ యాదవ్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలు అతిషి బుధవారం ముఖ్యమంత్రి రేఖ గుప్తాపై జరిగిన దాడిని ఖండించారు. ఈ మేరకు ఆమె ఎక్స్ లో పోస్టు చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు- లేదని అతిషి అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తాపై జరిగిన దాడి అత్యంత ఖండించదగినది. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు, నిరసనలకు చోటు ఉంటుంది. కానీ హింసకు చోటు లేదు. నిందితులపై ఢిల్లీ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాము. ముఖ్యమంత్రి పూర్తిగా సురక్షితంగా ఉన్నారని ఆశిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతడిని గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన రాజేశ్ భాయ్ ఖిమ్జి భాయ్ సకారియాగా (41) గుర్తించారు. గుజరాత్‌లోనూ అతడిపై దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు దాడికి గల కారణాలు తెలుసుకొనే పనిలో పడ్డారు. ఈసందర్భంగా అతడి కుటుంబసభ్యులను విచారిస్తున్నారు. ముఖ్యమంత్రిపై సకారియా ఎందుకు దాడి చేశాడనే విషయంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. నిందితుడి బంధువు జైల్లో ఉన్నాడని, అతడిని విడుదల చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేసేందుకు ముఖ్యమంత్రి అధికారిక నివాసానికి వచ్చినట్లు- వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం కోర్టులో పెండింగులో ఉందని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే, వీటిని పోలీసులు ధ్రువీకరించాల్సి ఉంది. మరోవైపు గుజరాత్‌లో నిందితుడి తల్లిని ప్రశ్నించిన అధికారులు, ఆమె నుంచి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. కుమారుడు దిల్లీ సీఎంను కలిసేందుకు వెళ్లిన విషయం తనకు తెలియదని ఆమె చెప్పినట్లు- సమాచా రం. అతడు జంతు ప్రేమికుడని, ఇటీవల వీధి శునకాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో అసంతృప్తిగా ఉన్నాడని పేర్కొన్నట్లు- తెలుస్తోంది. అయితే, అతడి మానసిక పరిస్థితి బాగా లేదని, గతంలోనూ ఓసారి దిల్లీకి వెళ్లి వచ్చాడని పోలీసులకు వివరించినట్లు సమాచారం.

## మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ఎక్కడ దాక్కున్నారు?
### ఎందుకు మౌనంగా ఉన్నారు? : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేసిన తరువాత ప్రజలకు మళ్లీ కనిపించలేదు. దీనితో ఆయన ఎక్కడ దాక్కున్నారు? ఎందుకు పూర్తిగా మౌనంగా ఉన్నారు? అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ప్రతిపక్షాల ఉమ్మడి ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి.సుదర్శన్? రెడ్డిని బుధవారం సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్?లో సత్కరించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "ధన్?ఖడ్ రాజీనామా వెనుక ఒక 'కథ' ఉంది. కానీ దాని గురించి 'ఒక్క మాట కూడా చెప్పలేని', 'దాక్కోవాల్సిన' పరిస్థితుల్లో ఆయన ఎందుకు ఉన్నారో? ఇదంతా ఆశ్చర్యంగా ఉంది" అని అన్నారు. 'రాజ్యసభలో విరుచుకుపడే మనిషి, అకస్మాత్తుగా పూర్తిగా మౌనంగా మారిపోయారు. అంటే, మనం ఎలాంటి కాలంలో జీవిస్తున్నామో ఆలోచించండి' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్? వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. ధన్‌ఖడ్ జులై 21న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే అకస్మాత్తుగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. ఆరోగ్య కారణాల వల్లనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన రాష్ట్రపతికి పంపించిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. అయితే అధికార బీజేపీతో ఆయనకున్న సంబంధాలు దెబ్బతినడమే రాజీనామాకు కారణమనే వార్తలు బయటకువచ్చాయి. ఈ నేపథ్యంలో ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు చేశారు.

## అంగన్వాడీల్లో చిన్నారులకు త్వరలో అల్పాహారం

ప్రారంభోత్సవం చేయించాలి. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు యూనిఫాం చీరల పంపిణీ ప్రారంభించాలి"అని మంత్రి సీతక్క ఆదేశించారు.

## నేడు ఘోష్ కమిషన్‌పై హైకోర్టులో విచారణ

లేకుండా నాటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాల్జేసే రాజకీయ వ్యూహంలో భాగంగా కమిషన్ నియామకం జరిగిం దని, నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ నివేదిక రూపొందించిందని పిటిషన్లలో పేర్కొన్నారు.

## 50 వేల మెట్రిక్ టన్నుల యూరియాకు సరఫరాకు కేంద్రం ఆమోదం

ప్రభుత్వం వివక్ష కారణంగానే రైతులకు ఇబ్బందులు ఏర్పాడ్డాయని తెలిపారు. తెలంగాణ రైతుల శ్రేయస్సు కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటు-ందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. తెలంగాణలో రైతులకు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు యూరియా సరఫరా చేయకుండా కేంద్రంలోని మోదీ సర్కార్ మీనమేషాలు లెక్కిస్తుందని రాష్ట్ర ప్రభుత్వంలోని అగ్రనేతలు ఆరోపించారు. అంతేకాకుండా.. బీజేపీ యేతర పాలిత రాష్ట్రలపై మోదీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందంటూ వారు మండిపడ్డారు. యూరియా కొరతపై దేశ రాజధాని ఢిల్లీ సాక్షిగా నిలదీయాలంటూ పార్టీ ఎంపీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం సూచించిన సంగతి తెలిసిందే.

# అరెస్టైతే పదవీచ్యుతుల్ని చేస్తారా!?

సీఎంలు, మంత్రులకు సైతం ఉద్వాసన పలికేలా కేంద్రం ఈ మూడు కీలక బిల్లులను తీసుకువచ్చింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే బిల్లులను కేంద్ర హెూం మంత్రి అమిత్ షా లోక్ సభలో ప్రవేశపెట్టారు. గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్ సవరణ బిల్లు, 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లులుగా వాటిని పేర్కొన్నారు. ఈ సమయంలో అధికార విపక్షాల మధ్య వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ సహా విపక్ష పార్టీల ఎంపీలు బిల్లు కాపీలు చింపి సభలో విసిరారు. వెల్ దగ్గరికి వెళ్లి చింపిన బిల్లు ప్రతులను టీఎంసీ ఎంపీలు విసిరారు. హెూం మంత్రి అమిత్‌షా స్థానం వైపు కూడా విసిరారు. గుజరాత్ హెూంమంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షా అరెస్టయిన అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ లేవనెత్తారు. దీన్ని అమిత్ షా ఖండిస్తూ అరెస్టుకు ముందే నైతిక కారణాలతో తాను రాజీనామా చేశానని, కోర్టు నిర్దోషిగా ప్రకటించాకే ప్రభుత్వంలో చేరానని స్పష్టంచేశారు. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ, రాజ్యాంగ పదవుల్లో కొనసాగడం తగదని హితవు పలికారు. ఇక ఈ బిల్లులు ప్రకారం, ఐదేళ్ల జైలు శిక్ష పడే కేసుల్లో వరుసగా 30 రోజులు అరెస్ట్ లేదా నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు 31వ రోజున తమ పదవిని కోల్పోతారు. ఒకవేళ ఎవరైనా మంత్రి పదవిలో ఉండి అరెస్టైతే వారిని తొలిగించేందుకు 30 రోజుల్లోపు రాష్ట్రపతికి ప్రధాని సిఫారసు చేయకపోయినా 31వ రోజు సదరు మంత్రి పదవిని కోల్పోతారు. ఒక వేళ ప్రధాని 30 రోజుల పాటు అరెస్టైతే ఆయన 30 రోజుల్లోపు రాజీనామా చేయకున్నా 31వ రోజున పదవి కోల్పోతారు.

**జేపీసీకి సిఫార్సు**

ప్రతిపాదిత బిల్లులను అమిత్‌షా, సంయుక్త పార్లమెంటరీ కమిటీకి సిఫారసు చేశారు. ఈ బిల్లులపై విపక్ష సభ్యులకు అభ్యంతరాలుంటే జేపీసీకి వెల్లడించాలని సూచించారు. ఈ క్రమంలో ప్రతిపక్షాల నిరసనలు తెలిపాయి. ఈ గందరగోళం మధ్యలోనే అమిత్ షా మూడు బిల్లుల కోసం ప్రవేశపెట్టిన తీర్మానానికి లోక్‌సభ ఆమోదం తెలిపింది. దీంతో విపక్షాలు వెల్‌లోకి దూసుకురాగా, సభ వాయిదా పడింది. అయినప్పటికీ ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనలు చేశారు.

**ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ఆగడాలు పెచ్చు మీరిన వేళ 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు - 2025'ను కేంద్ర ఐటీ-, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రధాన లక్ష్యం.. ఈ - స్పోర్ట్స్, సోషల్ గేమ్స్‌కు ప్రోత్సాహం, ఆన్‌లైన్ మనీ గేమ్స్‌పై నిషేధం విధిస్తారు. అలాగే యువత, కుటుంబాలను ఆర్థిక, మానసిక, సామాజిక ముప్పుల నుంచి రక్షించడమే లక్ష్యంగా ఈ బిల్లును తీసుకు వస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, ఫాంటసీ స్పోర్ట్స్, రమ్మీ, పోకర్ వంటి గేమ్స్‌పై నిషేధం విధిస్తారు. ఈ - స్పోర్ట్స్‌కి అధికారిక గుర్తింపు, అలాగే శిక్షణా కేంద్రాలు, అకాడమీలు, పరిశోధన కేంద్రాల ఏర్పాటు-కు మార్గం సుగమం అవుతుంది. సోషల్, విద్యా గేమ్స్ అభివృద్ధికి కేంద్రం మద్దతు తెలుపుతోంది. తద్వారా భారతీయ విలువలతో గేమ్స్ ప్రోత్సాహం అందిస్తుంది. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ప్రకటనలు, లావాదేవీలు నిషేధం - బ్యాంకులు, పేమెంట్ సిస్టమ్స్ బ్లాక్ చేస్తారు. కేంద్ర స్థాయిలో ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ- ఏర్పాటు-కు సంసిద్ధత. నిబంధనల ఉల్లంఘనకు జైలు శిక్షలు, రూ. కోట్లాది జరిమాన విధిస్తారు. డిజిటల్ ఇండియాలో సమతుల్యత, వినూత్నతకు ప్రోత్సాహం, సమాజ రక్షణకు ఈ బిల్లు పాటు-పడుతుందని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ స్పష్టం చేశారు.

## తెలంగాణలో మద్యం దుకాణాలకు నోటిఫికేషన్

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో మద్యం దుకాణాల ఆశావాహులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తుకు ఆబ్కారీ శాఖ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అలాగే, దరఖాస్తుల ఫీజు కూడా భారీగా పెంచేసింది. దరఖాస్తు పీజు రూ. 2లక్షల నుంచి రూ. 3లక్షలకు పెంచినట్లు- పేర్కొంది. వచ్చే రెండేండ్ల కాల పరిమితి 2025 డిసెంబర్ నుంచి 27 నవంబర్ వరకుకి కి సంబంధించి లాటరీ పద్దతి ద్వారా మద్యం దుకాణాల లైసెన్సులను ఎంపిక చేయనుంది. మద్యం దుకాణాల కేటాయింపులో గౌడ్‌లకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం కల్పించనుంది. మద్యం దుకాణాలకు 6 శ్లాబ్‌లలో ఎ-కై-÷-సజ్‌శాఖ లైసెన్స్‌లు జారీ చేయనుంది.

## రష్యా చమురుతో వాణిజ్యంలో భారత్‌లో సంపన్నులే లాభపడుతున్నారు

భారత దేశంలోని అత్యంత సంపన్న కుటుంబాలు రష్యా ఆయిల్‌ను రీసెల్లింగ్ చేసుకుంటున్నాయి. తద్వారా.. 16 బిలియన్ డాలర్ల అదనపు లాభాలను(ఒక లక్షా ముప్పై వేల కోట్ల రూపాయలు) పొందుతున్నాయి. అందుకే భారత్‌పై సుంకాలను పెంచే ప్రణాళిక రూపొందించాం. ఇవి సెకండరీ టారిఫ్‌లుగా ఉండొచ్చు అని బెసెంట్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. వైట్ హౌస్ ట్రేడ్ అడ్వైజర్ పీటర్ నవారో గతవారం ఓ ప్రముఖ పత్రిక కాలమ్‌లో భారతదేశంలోని చమురు వ్యాపారులపై తీవ్ర విమర్శలు చేశారు. రష్యా నుండి చమురు కొనుగోళ్లు భారతదేశపు "బిగ్ ఆయిల్" లాబీ లాభాపేక్ష వల్ల జరిగాయని.. దేశీయ అవసరాల కోసం కాదని అందులో పేర్కొన్నారు. ఆ కథనంలో.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత ఎగుమతులపై 50% టారిఫ్‌లు విధించారు. ఇందులో సగం శిక్ష రష్యా చమురు కొనుగోళ్ల కారణంగా విధించబడనుంది. భారత్ మాత్రం తక్కువ ధర ఉన్న చోట నుంచి చమురు కొనుగోలు చేయడం తమ హక్కు అని పేర్కొంటూ, ఈ అదనపు టారిఫ్‌లను అసమంజసమైనవిగా చెబుతోంది. కానీ..చరిత్రపరంగా చూస్తే.. భారత్ రష్యా చమురును ఎక్కువగా దిగుమతి చేసుకోలేదు. ప్రధానంగా మధ్యప్రాచ్య దేశాలపై ఆధారపడేది. కానీ 2022లో ఉక్రెయిన్ యుద్ధం తర్వాత, దేశాలు రష్యా చమురుపై 60-పెర బ్యారెల్ ధర పరిమితి విధించడంతో.. భారత్ తక్కువ ధరకు చమురు కొనుగోలు చేసే అవకాశం పొందింది. ఇది అమెరికాకూ తెలుసు...ఇక చైనాపై సెకండరీ టారిఫ్‌లు విధించకపోవడానికి ఓ కారణం ఉంది. అది భారత్ కంటే ఎక్కువగా రష్యా చమురును దిగుమతి చేసుకుంటోంది. అయితే 2022 ముందు 13% ఉండగా, ఇప్పుడు 16%కి పెరిగింది. పైగా చైనా వివిధ దేశాల నుంచి చమురును దిగుమతి చేసుకోవడమే కాకుండా.. విక్రయిస్తోంది కూడా. అందుకే అమెరికా చైనాపై అదనపు టారిఫ్‌లు విధించలేదు అని అన్నారాయన.

రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకే భారత్‌పై ఆంక్షలు: అమెరికా

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ భారీగా సుంకాల భారాన్ని మోపిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు రష్యాపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు న్యూదిల్లీపై ట్రంప్ సుంకాలు విధించారన్నారు మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించాలని అధ్యక్షుడు నిశ్చయించుకున్నారని లీవిట్ పేర్కొన్నారు. రష్యాతో వాణిజ్యం కొనసాగించే దేశాలను లక్ష్యంగా చేసుకొని దానిపై ఒత్తిడి తీసుకురావాలనుకున్నారని తెలిపారు. అది ట్రంప్ పరిపాలన వ్యూహమని వ్యాఖ్యానించారు. ఇందులోభాగంగా భారత్‌పై 50 శాతం సుంకాలను విధించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. నాటో సెక్రటరీ జనరల్‌తో సహా యూరోపియన్ నాయకులతో జరిగిన చర్చలే యుద్ధం ముగింపునకు తొలి అడుగుగా అభివర్ణించారు. ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీల మధ్య సానుకూలంగా చర్చలు జరిగాయన్నారు. ఈసందర్భంగా ట్రంప్ అధికారంలో ఉండి ఉంటే అసలు రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ప్రారంభం అయ్యుండేది కాదని ఉద్ఘాటించారు. పుతిన్ కూడా ఇదే పేర్కొనడాన్ని ఆమె గుర్తు చేశారు.

## భారత్‌పై సుంకాల విషయంలో అమెరికా తీరు అన్యాయం:రష్యా

**మాస్కో(జనంసాక్షి):**తమ దేశం నుంచి చమురు కొనుగోలు అంశంలో భారత్‌పై అమెరికా వైఖరి అన్యాయంగా ఉందని రష్యా ఆరోపించింది. ఈమేరకు ఆ దేశ దౌత్యవేత్త రోమన్ బబుష్కిన్ పేర్కొన్నారు. భారత్-రష్యా మధ్య ఇంధన సహకారం భవిష్యత్తులోను కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుతం న్యూదిల్లీ సవాళ్లతో కూడిన పరిస్థితిని ఎదుర్కొంటోందన్నారు. భారత్‌తో సంబంధాలపై పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థలను ఆయుధంలా వాడుతోందని విమర్శించారు. వాస్తవానికి మిత్రులు ఎప్పుడూ ఆంక్షలు విధించరని వాషింగ్టన్‌ను దెప్పిపొడిచారు. రష్యా భవిష్యత్తులోను భారత్ అలాంటి చర్యలు తీసుకోదన్నారు. భారత్‌కు ఎటువంటి ఇబ్బందిలేకుండా చమురు సరఫరా చేసేందుకు మాస్కో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసిందన్నారు. ప్రస్తుతం సగటున 5 శాతం డిస్కౌంట్‌తో భారత్ అవసరాల్లో 40శాతం సరఫరా చేస్తున్నామన్నారు. అమెరికా మార్కెట్లకు ఎగుమతి చేసేందుకు భారత్ ఇబ్బంది పడుతుంటే.. రష్యా మార్కెట్లు స్వాగతం పలుకుతాయని చెప్పారు. భారత్ ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారంలో అండగా ఉండటానికి తమ దేశం కట్టుబడి ఉందని రోమన్ వెల్లడించారు. చిన్న, మాడ్యులర్ అణు రియాక్టర్లపై చర్చలు పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. భారత్‌లో ఉత్పత్తులు చేయడానికి న్యూదిల్లీకి సరైన భాగస్వామి రష్యానే అని పేర్కొన్నారు.

# గిరిజన తండాల్లో రోడ్లు, మౌళిక వసతులకు పెద్దపీట

- గిరిజన శాఖ ద్వారా 700 కోట్లకు ప్రతిపాదనలు
- ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో అభివృద్ధికి ప్రత్యేక దృష్టి
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడి




హైదరాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి) : రాష్ట్రంలో అన్ని గిరిజన తాండాలు, గుడాలల్లో రోడ్లు, ఇతర మౌళిక సదుపాయాలు అభివృద్ధికై- రాష్ట్ర గిరిజన శాఖ ద్వారా 700 కోట్ల రూపాయాలను ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేయండం జరిగిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ-, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం నాడు సచివాలయంలో విలేఖరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గిరిజన తాండాలను, గుడాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేసెందుకు ఎస్టీ సబ్ ప్లాన్ అమలు చేస్తుందని తెలిపారు. ఈ శాఖల అభివృద్ధికై- కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కూడా ప్రత్యేక దృష్టిసారించి రాబట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే తాను కేంద్ర గిరిజన శాఖ మంత్రి ఢిల్లీలో పలుమార్లు కలసి నిధులను విడుదల చేయాలని కోరడమైనదని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అన్ని గురుకుల పాఠశాలలో నాణ్యమైన బోజన సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో హాస్టల్ లలో అల్యూమినియం వంట పాత్రలు వాడకం వలన పలు సమస్యలు వచ్చేవని, వీటి స్థానంలో స్టెయిన్లెస్ స్టీల్ పాత్రలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా జిల్లా, మండల స్థాయిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ- ఏర్పాటు- చేసి బోజన నాణ్యతపై ఎప్పటికప్పడు పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో ఃక్ష, ఃఉక్ష, ఉఃఐక్ష ఇతర శాఖల అధికారులతో తప్పనిసరిగా వసతి గృహాలను సందర్శించి ఎక్కడా సమస్య రాకుండా చూసెందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వసతి గృహాలలో కామన్ డైట్ ను అమలు చేస్తున్నట్లు-, అందుకు అవసరమైన కూరగాయలు, గుడ్లు, చికెన్ ఇతర వస్తువుల కోనుగోలు జిల్లా స్థాయిలో టెండర్ల ద్వారా పారదర్శకంగా కోనుగోలు చేసెందుకు ఏర్పాట్లు- చేస్తున్నామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు అందేచేస్తున్న నెలకు రూ.300 పించన్ ను 3000 రూపాయాలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగిందని మంత్రి వెల్లడించారు. ఈ విలేఖరుల సమావేశంలో సాంఘిక సంక్షేమ, గురుకుల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిని పాల్గొన్నారు.

# మేడారం మహాజాతర నిర్వహణకు
# రూ. 150 కోట్లు మంజూరు

- ఉత్తర్వులు జారీ చేసిన గిరిజన సంక్షేమ శాఖ
- కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సీతక్క
- జాతరను మరింత గొప్పగా నిర్వహిస్తామన్న మంత్రి సీతక్క



హైదరాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి) : మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. గిరిజనుల ఆధ్యాత్మిక కుంభమేళాగా పిలిచే ఈ మహోత్సవం విజయవంతంగా సాగేందుకు, మేడారం లో శాశ్వత నిర్మాణాలు, రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించబోయే మేడారం మహా జాతర ఎన్నడూ లేని రీతిలో వైభవోపేతంగా జరగనుందని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంజూరు చేసిన నిధుల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లూ భట్టి విక్రమార్క,గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ లకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ "ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఆదివాసీల గౌరవానికి ప్రతీక. మేడారం మహా జాతర కోసం రూ. 150 కోట్లు మంజూరు చేయడం, ఆదివాసీ గిరిజనుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి, ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం. ఈ సారి జాతర మరింత గొప్పగా, చారిత్రాత్మకంగా జరుగనుంది" అని పేర్కొన్నారు.

## రాజీవ్ ఆశయాలను ముందుకు తీసుకెళతాం

- రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం
- రాజీవ్‌కు సీఎం రేవంత్ తదితరుల నివాళి

హైదరాబాద్(జనంసాక్షి): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్బంగా... సెక్రటేరియట్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితరులు ఘనంగా నివాళి అర్పించారు. రాజీవ్ ఆశయాలను ముందుకు తీసుకుని వెళతామని, రాహుల్‌ను ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీలు వీహెచ్, అంజన్ కుమార్ యాదవ్, మండలి ఛీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## రాకపోకలకు అంతరాయం

నూగూర్ వెంకటాపురం ఆగస్టు 20(జనం సాక్షి): బోదాపురం, కొండాపురం గ్రామాల మధ్యలో ఉన్న జిన్నెల వాగు గోదావరి ఉధృతి వలన ఉప్పొంగి బ్రిడ్జి పైకి వరద నీరు చేరడం వలన జిన్నెలవాగు ఉదృతం గా ప్రవహిస్తోంది. పోలీసులు బారికేడ్ లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు నిలిపి వేశారు. దింతో పరిసర ప్రాంతాల ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. వాహన దారులు వెంకటాపురం నుండి భద్రాచలం వెళ్లే ప్రయాణికులు మణుగూరు మీదుగా వెళ్లవలసిందిగా స్థానిక ఎస్సై కె తిరుపతి రావు తెలిపారు. మండలంలో ఎడతెరపు లేకుండా వర్షాలు కురుస్తున్నాయని,లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అన్నారు.

# మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని చేస్తాం

- పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్



హైదరాబాద్ (జనంసాక్షి) : మూఢనమ్మకాల నిర్మూలన చట్టం చేస్తామని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మూఢనమ్మకాల నిర్మూలన చట్ట సాధన సమితి కన్వీనర్ రమేష్, విజ్ఞానదర్శిని అధ్యక్షతన మూఢనమ్మకాల నిర్మూలన చట్ట సాధనపై చర్చావేదిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో మూఢనమ్మకాల నిర్మూలన చట్టం చట్టం చేస్తామని పిసిసి అధ్యక్షుడు,యం ఎల్ సి బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. హేతువాది నరేంద్ర దబ్బోల్కర్ వర్ధంతి, జాతీయ సైంటిఫిక్ టెంపర్ డే పునస్కరించుకొని మూఢనమ్మకాల నిర్మూలన చట్ట సాధన సమితి అధ్వర్యంలో మూఢనమ్మకాలు నిర్మూలన చట్ట సాధన స పై చర్చా గోష్టి ని బుధవారంనాడు సుందరయ్య విజ్ఞాన కేంద్రం బలమ్మ హల్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అధిగాగా హజరైన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణ మూఢనమ్మకాల నిర్మూలన ముసాయిదా చట్టాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో మూఢనమ్మకాల నిర్మూలన చట్టం ఎంతో అవసరం వుందన్నారు. నిరక్షరాస్యులే కాకుండా ఉన్నత చదువులు చదివిన వారే మూఢనమ్మకాల భ్రమలో వున్నారన్నారు.ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాజ్యసభలో జాతీయ స్థాయి లో చట్టం చేయాలని డిమాండ్ చెసినందున అది మాకు ఆదేశం అయినందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి చట్టం చెస్తామని అన్ని పార్టీలు కూడ మద్దతు ఇస్తారని ఆశించారు.కాంగ్రెస్, కమ్యూనిస్టు లు కలిసి మతోన్మాదాన్ని అడ్డుకొవాల్సిన అవసరం వుందన్నారు.ఎన్నికల సమయంలో నే రాజకీయాలు అని తర్వాత అభివృద్ధి పై కలిసి పనిచేయాలన్నారు.విద్య,ఆరోగ్యం పై ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ మూఢనమ్మకాలు సమాజాన్ని పట్టిపిడిస్తుందన్నారు. సమాజంలో చైతన్యం పెరిగేకొద్ది మూఢనమ్మకాలు పెరుగుతున్నాయన్నారు. బాణమతి,మంత్రాల పేరుతో ఎస్సీ, బిసిలను సజీవ దహనం చేస్తున్నారన్నారు. తొమ్మిది రాష్ట్రాలలో మూఢనమ్మకాల నిర్మూలన చట్టాలు చేసినందున తెలంగాణ లో కూడ చట్టం చేయాలని ముఖ్యమంత్రి, డిప్యూటీ సియం లకు నివేదిక సమర్పిస్తామన్నారు.

రాష్ట్ర గ్రంధాలయ సంస్ధ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ దేశంలో సైంటిఫిక్ టెంపర్‌ను మొదటి ప్రధాని నెహ్రు పెంపొందించారన్నారు. కాంగ్రెస్ సోషలిష్టు దేశంగా మార్చేందుకు పని చెస్తుందన్నారు. బిఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్సి కర్నే ప్రభాకర్ మాట్లాడుతు ప్రభుత్వం చట్టం తీసుకరావాలని మా పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. ప్రజల విశ్వాసాన్ని గౌరవిస్తునె మూఢనమ్మకాలను వ్యతిరేకించాలన్నారు. సిపియం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు అబ్బాస్ మాట్లాడుతూ ఎఐ సాంకేతిక పరిజ్ఞానం తో మూఢ విశ్వాసాలను ప్రచారం చెస్తున్నారన్నారు.మూఢనమ్మకాల నిర్మూలన చట్టం కొసం పొరాడుతమన్నారు.ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమక్రసి రాష్ట్ర నాయకులు ఝాన్సీ, సిపిఐ యం ఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు సదానందం, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలకర శ్రీ నివాస్,మూఢనమ్మకాల నిర్మూలన చట్ట సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ రమేష్ , మానవ వికాస సమితి కేంద్ర నాయకులు సాంబశివరావు,దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, కులనిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వహిద్,జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షురాలు స్వరాజ్య లక్ష్మీ, విజ్ఞానదర్శిని రాష్ట్ర అధ్యక్షుడు అదామ్ రాజ్,వివిధ సంఘాల నాయకులు గుత్తా జొస్నా, స్కైలాబ్,అనసూయ, స్వరూప, అనురాధ, జ్యోతి, కృష్ణ చంద్ ,రవి తేజ,జాన్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ప్రొవిజనల్ లిస్టు విడుదల

హైదరాబాద్ (జనంసాక్షి) : నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ప్రొవిజనల్ లిస్టను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం విడుదల చేసింది. ప్రతి అభ్యర్థి వివరాలను, ఎగ్జామ్‌లో వచ్చిన మార్కులను, వెయిటేజీ ద్వారా పొందిన మార్కులను లిస్ట్‌లో పొందుపర్చింది. ప్రతి అభ్యర్థి తాము పొందిన మార్కులు, ఇతర అంశాలను సరి చూసుకోవాలని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 26 నుంచి సెప్టెంబర్2వ తేదీ లోపల తెలియజేయాలని సూచించింది.అభ్యంతరాల నమోదుకు ఈ నెల 26 నుంచి బోర్డు వెబ్‌సైట్‌లో సదుపాయం కల్పిస్తామని పేర్కొంది. 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి గతేడాది నవంబర్ 23వ తేదీన పరీక్ష నిర్వహించగా... 40,243 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

## కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమం ఉధృతి

భూపాలపల్లి, ఆగస్ట్20 (జనంసాక్షి) : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద వరద పోటెత్తింది. ఇక్కడ 12.41 మీటర్ల మేర ప్రవాహం కొనసాగుతోంది. జ్ఞాన సరస్వతి, సాధారణ పుష్కర ఘాట్ల మెట్లపై నుంచి వరద ప్రవహిస్తోంది. త్రివేణి సంగమం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిలో వరద ప్రవాహం ఉండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఖమ్మం, ఆగస్ట్20 (జనంసాక్షి) : వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి చిన వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు రెవెన్యూలో నర్సింహాపురంలో నీట మునిగిన పత్తి చేలను ఆయన రైతులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూరల్ మండలంలో వర్షాల కారణంగా నల్లరేగడి నేలలు ఊట పెట్టి నీరు నిలిచాయన్నారు. రైతులు సాగు చేసిన పెసర, మొక్కజొన్న, పత్తి , మిరప పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. పంటల బీమా లేకపోవడంతో ఒక్కో ఎకరానికి రూ.50 వేలు రైతులు నష్టపోయారని అన్నారు.

## నిజాంసాగర్ 16 గేట్లు ఎత్తివేత

కామారెడ్డి, ఆగస్టు20 (జనంసాక్షి) : కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో 16 గేట్లను పైకి ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ ఈఈ సాలోమన్ తెలిపారు. బుధవారం సాయంత్రానికి ఎగువ ప్రాంతాల నుంచి సాగర్‌లోకి 71,200 క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో 12, 16, 20 గేట్లు, 7, 8, 1 గేట్లను ఎత్తి 1,00600 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి వదులుతున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1403 అడుగులు (15.612 టీఎంసీలు)గా నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ శంకర్‌కు జాతీయ సమైక్యత పురస్కారం




హైదరాబాద్ (జనం సాక్షి) : తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బొగ్గులకుంట లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో అంతర్జాతీయ యువజన ఉత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం కామర్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఈ. శంకర్ కి సామాజిక సేవా విభాగంలో జాతీయ సమైక్యత పురస్కారం అందజేశారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధిక మాట్లాడుతూ విద్యా మరియు సామాజిక రంగంలో విశేషమైన కృషి చేస్తున్న కామర్స్ అధ్యాపకుడు డాక్టర్ శంకర్ కు ఈ పురస్కారం లభించడం కళాశాలకు గర్వకారణమని, భవిష్యత్తులో ఇంకా ఎన్నో అత్యున్నత పురస్కారాలు అందుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి సురేష్, అధ్యాపకులు డివి రావు, శ్రీకృష్ణ, హృదయరాజు, వీరారెడ్డి, కృష్ణ, నరేందర్ రెడ్డి, మరియు విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

# చెరువులకు జలకళ

అలుగు పోస్తున్న పలు జలాశయాలు



కామారెడ్డి, ఆగస్ట్20 (జనంసాక్షి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కామారెడ్డి జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు నిండుకుండలా మారాయి. జిల్లాలోని 414 చెరువులు అలుగు పారుతున్నాయి. 15 రోజుల కిందటివరకు జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువుల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో నీటి నిల్వలు లేవు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలాశయాల్లోకి భారీగా నీళ్లు చేరాయి. ఎగువన ఉన్న సింగూర్, పోచారం ప్రాజెక్టుల నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 3 రోజులుగా భారీగా వరద వస్తోంది. నిజాంసాగర్ లో దాదాపు పూర్తిస్థాయిలో నీరు చేరింది. నిజాంసాగర్ ఫుల్ కెపాసిటీ- 17.8 టీ-ఎంసీలుకాగా ప్రస్తుతం 15.943 టీఎంసీల నీరు ఉంది. మంగళవారం సాయంత్రం వరకు ఇన్ ఫ్లో 80వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. మంగళవారం 16 గేట్లు- ఎత్తి 85 వేల క్యూసెక్కుల నీటిని మంజీరానదిలోకి వదిలారు. కౌలాస్ నాలా ప్రాజెక్టు కెపాసిటీ- 1.237 టీ-ఎంసీలకు గాను ప్రస్తుతం 1.164 టీ-ఎంసీల నీరు నిల్వ ఉంది. 5 గేట్లు- ఎత్తి వరద నీటిని బయటకు వదిలారు. కళ్యాణి ప్రాజెక్ట్ లో పూర్తి నీటిమట్టం 409 మీటర్లు కాగా 408 మీటర్ల వరకు నీరుంది. సింగీతం రిజర్వాయర్ పూర్తిగా నిండింది. దీని పూర్తి మట్టం 416 మీటర్లు కాగా 416 మీటర్ల వరకు నీరు నిల్వ ఉంది. పోచారం, కళ్యాణి, కౌలాస్ సింగీతం రిజర్వాయర్ లు నిండాయి. వానకాలం, యాసంగి పంటలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందనుంది. జిల్లాలో మొత్తం 1,515 చెరువులు ఉండగా దాదాపు సగం చెరువులు నిండాయి. 173 చెరువుల్లో 25 శాతం వరకు నీరుండగా, 262 చెరువులు 25 నుంచి 50 శాతం వరకు వరకు నిండాయి. 356 చెరువుల్లో 50 నుంచి 70 శాతం వరకు, 260 చెరువుల్లో 75 నుంచి 100 శాతం వరకు నీళు ఉన్నాయని ఇరిగేషన్ ఆఫీసర్లు చెప్తున్నారు.

## ఎసిబికి పట్టుబడ్డ అటవీశాఖ ఉద్యోగి

సూర్యాపేట, ఆగష్టు20 (జనంసాక్షి) : కోదాడలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అటవీశాఖ ఉద్యోగి లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. బుధవారం జరిగిన ఈ దాడులకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. కోదాడలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గా పని చేస్తున్న వెంకన్న చెట్ల వ్యాపారి నుంచి రూ. 20 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఏసీబీని ఆశ్రయించాడు బాధితుడు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు రూ. 20 వేలు లంచం తీసుకుంటు-ండగా వెంకన్నను రెడ్ హ్యాండెడ్ గా పట్టు-కున్నారు. వెంకన్నను అదుపులోకి తీసుకున్న అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నల్గొండ రేంజ్ ఏసీబీ డీఎస్పీ జగదీష్ చంద్ర ఆధ్వర్యంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసులో సోదాలు నిర్వహించారు అధికారులు.

## జాతీయ రక్తవీర్ పురస్కారాలు తెలంగాణకు
# 4 అవార్డులు రావడం సంతోషకరం

- అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త
- అవార్డులను అందజేసిన లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్త ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త..



న్యూఢిల్లీ (జనంసాక్షి) : అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఐవిఎఫ్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని అశోక హెూటల్ లో నిర్వహించిన జాతీయ రక్తవీర్ పురస్కారాల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ నుండి నలుగురికి అవార్డ్ అందజేశారు.

డాక్టర్ బాలు , గంప ప్రసాద్,పర్శ , వెంకటరమణ, శివ కుమార్ లు ఈ అవార్డులను పొందడం జరిగింది. ఈ సందర్భగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ తలసేమియా చిన్నారుల కోసం నాలుగు వేలకు పైగా రక్తాన్ని సేకరించి అందజేసినందుకు గాను జాతీయ రక్తవీర్ పురస్కారాన్ని లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్త,ఐవిఎఫ్ అంతర్జాతీయ అధ్యకులు అశోక్ అగర్వాల్, గారి చేతుల మీదుగా 4 గురికి అందజేయడం జరిగింది అని ఆయన అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైశ్యులు అందరిని ఏకం చేయడం కోసం ఐవిఎఫ్ పనిచేస్తున్నదని,ఉత్తరప్రదేశ్ లోని వారణాసిలో ఆనంద నిలయం ఏర్పాటు చేయడం జరుగుతుందని దానికి ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు నరేష్ బన్సాల్, దామోదర్ అగర్వాల్ (రాజస్తాన్), సుధీర్ గుప్తా (మధ్యప్రదేశ్), డాక్టర్ సంజయ్ జైస్వాల్ (బీహార్), అతుల్ గార్గ్ (ఉత్తరప్రదేశ్), బ్రిజ్‌మోహన్ అగర్వాల్ (చత్తీస్‌ఘడ్) సుదామా ప్రసాద్, మన్నలాల్ రావత్ (ఉదయ్‌పూర్), మాజీ ఎంపీ అనిల్ అగర్వాల్, ఐవిఎఫ్ జాతీయ కమిటీ మరియు రాష్ట్ర కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో మావోయిస్ట్ నేతలు

రాష్ట్ర కమిటీ సభ్యురాలు సునీత ఒకరు

హైదరాబాద్, ఆగష్టు20 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర పోలీసులు మావోయిస్టులకు గట్టి షాక్ ఇచ్చారు. మావోయిస్టు ఉద్యమంలో కీలక స్థానంలో ఉన్న ఇద్దరు ముఖ్య వ్యక్తులు తాజాగా పోలీసుల వలలో చిక్కారు. అందులో రాష్ట్ర కమిటీ- సభ్యురాలు సునీత ఒకరు. ఆమె మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ భార్యగా గుర్తించారు. సుదీర్ఘకాలంగా అజ్ఞాతంలో ఉంటూ పార్టీ కార్యక్రమాలను నడిపిస్తున్న సునీత అరెస్టు మావోయిస్టు నేతృత్వానికి పెద్ద దెబ్బగా పోలీసులు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా మరో మావోయిస్టు నాయకుడు చెన్నూరి హరీష్ కూడా స్వచ్ఛందంగా లొంగిపోయాడు. మావోయిస్టు కదలికలు ఎక్కువగా ఉన్న తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో ఈ పరిణామం పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. ఆయన లొంగిపోవడమే కాకుండా, ఇప్పటి వరకు మావోయిస్టుల కార్యకలాపాలపై తనకు తెలిసిన విషయాలను అధికారులకు వెల్లడిస్తున్నట్లు- సమాచారం. ఇక ఈ తాజా పరిణామాలు మావోయిస్టుల భవిష్యత్ వ్యూహాలకు గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు బలగాలను సమీకరించే ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, అగ్రనేతల అరెస్టులు, లొంగిపోవడం వారిలో ఆందోళనను పెంచుతున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర పోలీసులు ఇప్పటికే మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లను మరింత వేగవంతం చేశారు. అడవీ ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్లను కట్టు-దిట్టం చేస్తూ, భూగర్భంలో దాక్కున్న ఇతర నేతలపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో సునీత అరెస్టు, హరీష్ లొంగిపోవడం మావోయిస్టు కదలికలను బలహీనపరిచే అవకాశం ఉందని అధికారులు విశ్వసిస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
21 ఆగస్టు 2025

# వానాకాలం ప్రయాణాల్లో జాగ్రత్తలు



మానవ జీవితంలో మనుగడ సాగించడం అంటే శీతాకాలం, ఎండా కాలం, వర్షాకాలం అనే మూడు ఋతువుల్లో వాతావరణ పరిస్థితులు, ప్రకృతి విపత్తులను అధిగమించి ముందుకు సాగడమే. ఈ ఋతువుల్లో ఆకస్మిక వాతావరణ మార్పులు, ప్రకృతి విపత్తులు ఎదురవుతాయి, వీటిని ఎదుర్కోక తప్పదు. వర్షాకాలం ప్రత్యేకమైన సవాళ్లతో కూడినది, ఎందుకంటే వెంటవెంటనే మారే వాతావరణం, తుఫానులు, విపత్తులు మానవులు, సరుకులు, రవాణా వ్యవస్థలను ఇబ్బందులకు గురిచేస్తాయి. రవాణా మార్గాలు ప్రధానంగా మూడు: జలమార్గం, వాయుమార్గం, భూమార్గం. వర్షాకాలంలో జలమార్గంలో నౌకలు, వాయుమార్గంలో విమానాలు తీవ్ర అడ్డంకులను ఎదుర్కొంటాయి. వాతావరణ సూచనలు, హెచ్చరికలను ఖచ్చితంగా పాటించి ప్రయాణాలు చేయాలి, లేకపోతే నిర్లక్ష్యం ప్రమాదాలకు దారితీస్తుంది. భూమార్గంలో రైళ్లు, బస్సులు, కార్లు, వ్యక్తిగత వాహనాలు భారీ వర్షాల వల్ల రోడ్లు, బ్రిడ్జిలు, రైల్వే ట్రాక్‌లు దెబ్బతినడంతో ప్రయాణాలు కష్టతరమవుతాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని ఆకస్మిక పరిస్థితుల్లో ప్రయాణాలు ఇబ్బందులను ఎదుర్కొంటాయి. అందుకే తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం. జోరు వానలో రోడ్డు మార్గాల్లో బస్సులు, కార్లు, వ్యక్తిగత వాహనాలతో ప్రయాణం హాయిగా, ఆహ్లాదకరంగా అనిపించినా, ముఖ్యంగా కారు డ్రైవింగ్ ప్రతి క్షణం ఒక పరీక్షే. ఒక్క క్షణం ఏమరపాటు ప్రమాదానికి దారితీస్తుంది. డ్రైవింగ్‌లో నిరంతర అప్రమత్తత, జాగ్రత్తలు అవసరం. దేశంలో రోడ్డు ప్రమాదాల్లో 75% ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో, అందులో 47% వర్షాకాలంలో జరుగుతున్నాయని, 5-10% హైవే బ్లైండ్‌నెస్ వల్ల సంభవిస్తున్నాయని వాహన రంగ నిపుణులు గుర్తించారు. జాతీయ రహదారులపై ఈ హైవే బ్లైండ్‌నెస్డ్రైవర్ కళ్లు చూసినా మెదడు వాస్తవికతను విశ్లేషించలేని ప్రమాదకర మానసిక స్థితిప్రధాన కారణంగా నిలుస్తుంది. ఈ స్థితిలో ముందు, వెనుక వాహనాలు, వాటి వేగం, రోడ్డుపై జంతువులు, ట్రాఫిక్ హెచ్చరికలను గుర్తించలేరు, దీనివల్ల తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. రాత్రి వేళల్లో, అవిశ్రాంత డ్రైవింగ్‌లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. అధిక పనిగంటలు, విశ్రాంతి లేమి ఈ హైవే బ్లైండ్‌నెస్‌కు కారణాలుగా నిలుస్తాయి. రోజుకు 6 గంటలకు మించి డ్రైవింగ్ చేయకూడదు, ప్రతి 3 గంటలకు కనీసం 10 నిమిషాల విశ్రాంతి తీసుకోవాలి. డ్రైవింగ్‌లో అసౌకర్యం అనిపిస్తే వాహనాన్ని సురక్షితంగా పక్కకు తీసి కాసేపు విశ్రాంతి తీసుకోవడం మంచిది. వర్షాకాలంలో రోడ్లు జారుడుగా మారతాయి, కాబట్టి వేగం తగ్గించి, ముందు వాహనంతో సురక్షిత దూరం పాటించాలి. వైపర్ ట్యాంక్‌లో లిక్విడ్ కలిపి విండ్‌షీల్డ్ శుభ్రం చేయడం ద్వారా దృశ్యమానత మెరుగవుతుంది. కారు అద్దాలపై చెమ్మ ఏర్పడితే ఎయిర్ కండిషనర్‌లోని ఆప్షన్ల ద్వారా తొలగించాలి. టైర్లను 4 ఏళ్లకు లేదా 35-40 వేల కిలోమీటర్లకు మార్చడం సురక్షితం. వర్షం ప్రారంభంలో రోడ్డుపై పొగ, ఆయిల్ మరకలు, టైర్ ఒత్తిడి వల్ల జారుడు పొర ఏర్పడుతుంది, కాబట్టి వర్షం మొదలైన వెంటనే వేగంగా డ్రైవ్ చేయడం మానాలి. రోడ్లు, బ్రిడ్జిలు, వంతెనలు ఎక్కడ దెబ్బతిని ఉన్నాయో తెలియనందున జాగ్రత్తగా నడపాలి. వరద ప్రవహించే మార్గాల్లో ప్రయాణం నివారించాలి, తప్పనిసరి అయితే వాహనం యొక్క వేడింగ్ డెప్త్ (సురక్షితంగా దాటగలిగే నీటి లోతు) తెలుసుకోవాలి, ఇది కారు మాన్యువల్ లేదా కంపెనీ వెబ్‌సైట్‌లో లభిస్తుంది. నీటి లోతు ఎక్కువైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలి. నీటిలో ప్రయాణం తప్పనిసరి అయితే మొదటి గేరులో స్థిరంగా నడపాలి, ఆకస్మికంగా వేగం పెంచడం లేదా బ్రేక్ వేయడం చేయకూడదు, ఇది వాహన నియంత్రణ కోల్పోయే ప్రమాదాన్ని పెంచుతుంది. నీటిలో వాహనం ఆగిపోతే ఆందోళన చెందకుండా వెంటనే స్టార్ట్ చేయడానికి ప్రయత్నించకూడదు, ఇంజన్ హైడ్రోలాక్ అయ్యే అవకాశం ఉంది.

ఇంజన్‌పై ఒత్తిడి తగ్గించేందుకు ఎయిర్ కండిషనర్ ఆపి, హజార్డ్ లైట్లు, ఫాగ్ లైట్లు ఉపయోగించాలి. దారి సరిగా కనిపించకపోతే ఈ లైట్లు సహాయపడతాయి. వరద నీటి నుండి బయటకు వచ్చాక బ్రేకులను సున్నితంగా ఉపయోగించాలి, వీలైతే ఎత్తైన ప్రదేశంలో వాహనాన్ని ఆపి బ్యాటరీ డిస్‌కనెక్ట్ చేయాలి. మెకానిక్‌ను సంప్రదించి, బీమా సంస్థకు సమాచారం ఇవ్వాలి. అత్యవసర పరిస్థితుల్లో జాతీయ రహదారుల సహాయ కేంద్రాల టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేసి సహాయం కోరాలి. భారీ వర్షంలో వైపర్లు ఉపయోగించినా ముందు వాహనాలు సరిగా కనిపించకపోతే కొద్దిసేపు ఆగడం ఉత్తమం, కానీ రోడ్డు పక్కన వాహనాన్ని నిలపకూడదు, ఎందుకంటే అధిక వేగంతో వచ్చే వాహనాలు అదుపు తప్పితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ముందు వాహనం ఆకస్మికంగా బ్రేక్ వేస్తే, వెనుక వచ్చే వాహనాలు గమనించేలోగా ప్రమాదం సంభవించవచ్చు, కాబట్టి ఆకస్మిక బ్రేకింగ్ మానాలి. జారుడు రోడ్లపై సాధారణం కంటే తక్కువ వేగంతో ప్రయాణించాలి. ముందు వాహనంతో సురక్షిత దూరం పాటించాలి, ఒకే లేన్‌లో, ఎక్స్‌ప్రెస్ రోడ్లపై మధ్యలో ప్రయాణించాలి, ఓవర్‌టేక్ చేయడం పూర్తిగా నివారించాలి. మొబైల్ ఫోన్ వాడకం, భారీ సంగీతం వినడం ఏకాగ్రతను దెబ్బతీస్తాయి కాబట్టి వీటిని పూర్తిగా మానాలి. డిఫాగర్, ఎయిర్ కండిషనింగ్ ఉపయోగిస్తే అద్దాలపై మంచు ఏర్పడకుండా నిరోధించవచ్చు, ఉష్ణోగ్రతను సౌకర్యవంతమైన స్థాయిలో ఉంచాలి. ప్రయాణానికి ముందు టైర్ల మన్నిక, గాలి ఒత్తిడి, బ్రేకులు, హెడ్‌లైట్లు, టెయిల్ లైట్లు, బ్రేక్ లైట్లు, టర్న్ ఇండికేటర్లు, అత్యవసర పార్కింగ్ లైట్లు, వైపర్లు, బ్యాటరీని తప్పనిసరిగా తనిఖీ చేయాలి. వైపర్ బ్లేడ్లు దెబ్బతిన్నట్లైతే వెంటనే మార్చాలి. వైపర్ ట్యాంక్‌లో నీరు సరిపడా ఉందా, నాజిల్స్, కనెక్షన్లు సరిగ్గా పనిచేస్తున్నాయా అని చూడాలి. వర్షాకాలంలో ఈ జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. వాతావరణ శాఖ ముందస్తు సూచనలు, హెచ్చరికలు ఎంతో కీలకం, కానీ కొన్నిసార్లు ఈ సూచనలు తప్పినా, వ్యక్తిగత జాగ్రత్తలు అనివార్యం. ప్రయాణాలు ఎంత ముఖ్యమైనవైనా, సురక్షితమైన ప్రయాణం అంతకంటే ముఖ్యమని ప్రతి డ్రైవర్ గుర్తుంచు కోవాలి. సురక్షిత డ్రైవింగ్ అనేది వాహనం నడిపే ప్రతి వ్యక్తి యొక్క కనీస బాధ్యతగా భావించాలి.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

# చట్టాలతోనే మూఢనమ్మకాలు అంతం

భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తున్నప్పటికీ సమాజంలో నెలకొన్న “మూఢ నమ్మకాలు” ఆందోళన కలిగిస్తున్నాయి. ఇవి ఆచరణలో నిరూపితం కాని అశాస్త్రీయమైన విశ్వాసాలు. సైన్స్ కు సమాంతరంగా పురోగామించిన సూడో సైన్స్ మానవ ప్రగతికి అవరోధంగా మారుతున్నాయి. మానవాతీత శక్తులను నమ్మి శూద్ర పూజలకు పూనుకోనే సంస్కృతి విజృంభిస్తుంది. భానమతి, చేతబడి, దయ్యాలు, భూతాలు,,మంత్రాలు ఇలా రకరకాల అందవిశ్వాసాలు చాప కింద నీరులా ప్రవహిస్తున్నాయి. ఇలాంటి వాటికి విరుగుడు చర్యలుగా నర బలులు, జంతు బలులు చేయడం జరుగుతుంది. వీటి నిర్వహణకై మధ్యవర్తులుగా భూత వైద్యులు రాజ్యమేలుతూ, తమకు అతీంద్రియ శక్తులున్నట్లు ప్రచారం చేసుకుని అమాయక ప్రజలను దోచుకొవడం జరుగుతుంది. మెజారిటి గ్రామీణ,పట్టణ పేద కుటుంబాలతో పాటు విద్యావంతులు సైతం వీటి బారిన పడుతున్నారు. ఇవి రోజు రోజుకు ఒక తంతుగా మారి ప్రజల మానసిక రుగ్మతలకు దారితీస్తున్నాయి. ఈ క్రమంలో అందవిశ్వాసాలపై అవిశ్రాంతంగా పోరాడిన గొప్ప వ్యక్తి నరేంద్ర అచ్యుత్ దభోల్కర్.

**మంత్రాల నేపంతో దాడులు.**

నేటి వైజ్ఞానిక సమాజంలో సైతం అందవిశ్వాసాల తీవ్రత తగ్గలేదు. ప్రస్తుత సమాజం సైన్స్ ఫలాలను అనుభవిస్తూనే మూఢనమ్మకాలను విశ్వసించే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ విశ్వాసాలకు ప్రధాన కారణాలు పరిశీలిస్తే ... విద్యావంతులలో శాస్త్రీయ వైఖరి లోపించడం, మితిమీరిన మత విశ్వాసాలు, అశాస్త్రీయ బోధనలు. మరోవైపు ప్రభుత్వాల పరిపాలన విధానాలు, పద్ధతులు, మీడియా ప్రకటనలు ప్రజల్ని మూఢత్వ దిశగా ప్రేరేపిస్తున్నాయి. దీంతో రంగురాళ్లు ధరించడం, సంఖ్యా శాస్త్రం ఆధారంగా పేర్లు మార్చుకోనే వారి సంఖ్య పెరిగింది. అంతేకాకుండా తాయత్తు మెడకు చుట్టుకుంటే అన్నీ శుభాలే జరుగుతాయని, మంత్రించిన అష్ట లక్ష్మి యంత్రాలతో అష్టైశ్వర్యాలు చేకూరుతాయని నమ్మేవారి సంఖ్య పెరుగుతోంది. ఇవన్నీ అమాయక ప్రజలను దోచుకోవడానికి, మోసగించడానికి కీలక భూమిక పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటిని ప్రసారం చేసే టీవీలు, సెలబ్రిటీల పైన, వస్తువులను అమ్మేవారి పైన మూఢనమ్మకాలు నిర్మూలన చట్టం కింద కేసు నమోదు చేయమని మహారాష్ట్ర హైకోర్టు ఇటీవల ప్రభుత్వాన్ని ఆదేశించడం గొప్ప ముందడుగు. కొన్ని సందర్భంలో వ్యక్తి గత కక్ష్యలను కూడా ఇందులోకి లాగుతున్నారు. బాణామతి లేదా చేత బడి చేశారనే ఆరోపణలతో ఆదివాసీ, దళిత, వెనకబడిన వర్గాలకు చెందినవారిని, ముఖ్యంగా మహిళలను హత మార్చడం కొన్ని రాష్ట్రాల్లో పరిపాటిగా మారింది. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్సీఆర్బీ) లెక్కల ప్రకారం ఒక్క 2022లోనే దేశవ్యాప్తంగా 85 బాణామతి హత్యలు జరిగాయి. గడిచిన దశాబ్ద కాలంలో 1,184 మంది అలా ప్రాణాలు కోల్పోయారు. బాణామ తి పేరుతో ఝారండ్ లో ఎక్కువ మంది కడతేరిపోతే, తరవాతి స్థానాల్లో ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశాలు నిలుస్తున్నాయి. 2000 సంవత్సరం నుంచి ఏకంగా రెండున్నర వేల మంది చేతబడి ఆరోపణలతో హతులయ్యారు. ఇవి శాంతి భద్రతలు, ప్రజారోగ్యానికి పెను సవాలుగా నిలుస్తున్నాయి.

**మూఢనమ్మకాల నిరోధక చట్టం రావాలి**

ఈనాడు అనేక మంది శాస్త్రవేత్తలు తమ విధులు దాటి బయటకు వస్తే, సైన్స్‌ను పూర్తిగా మర్చిపోతున్నారు. శాస్త్రీయ దృక్పథం అన్నది జీవితంలో ఒక భాగం కావాలి. తోటి వారితో మన ప్రవర్తన, ఆలోచన, చేరిక శాస్త్రీయంగా ఉండాలి. ఇలా మన వంతు ప్రయత్నిస్తే ఎంతో కొంత అభివృద్ధి సాధ్యమవుతుంది. మన మీదున్న మతం ప్రభావం కొంతైనా తగ్గే అవకాశం ఉంది. సైంటిఫిక్ టెంపర్ మనిషి తప్పక ప్రయాణం చేయవలసిన మార్గం. స్వాతంత్ర్యం వచ్చి 79వ సంవత్సరంలోకి అడుగెట్టిన ఈ సందర్భంలో కూడా అశాస్త్రీయత గురించి మూఢనమ్మకాల గురించి మాట్లాడుకోవడం అత్యంత శోచనీయం. దేశవ్యాప్తంగా సైన్స్ ఆవిష్కరణలను వాడుకుంటూ అశాస్త్రీయ భావాల ప్రచారం చేస్తున్నారు. సూడో సైన్స్ భావాలు పెరుగుతున్నాయి. ఈ ప్రచారాలు ఆపాలన్నా... నిజమైన సైన్సు బోధన జరగాలన్నా...ఒక్కటే మార్గం. మూఢనమ్మకాల వ్యతిరేక చట్టం తీసుకు రావాలి. మూఢనమ్మకాలను కట్టడి చేసేందుకు నిరంతరం శ్రమించిన నరేంద్ర దబోల్కర్ హత్యానంతరం మహారాష్ట్రలో మూఢనమ్మకాల చట్టం వచ్చింది. కర్ణాటకలో కూడా మూఢనమ్మకాల వ్యతిరేక చట్టం అమలులో ఉంది. మహారాష్ట్రలో రంగు రాళ్ళు, ఇతర అశాస్త్రీయ ప్రకటనలు టీవీలో రాకుండా చట్టం చేసింది అక్కడి ప్రభుత్వం. ఈ సమయంలో మన తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా చట్టం తీసుకురావాలని అనేక సైన్స్ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పాఠశాల దశలోని విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథంపై అవగాహన పెంచాలి. ఉపాధ్యాయుల ఆచరణ కూడా ఆ విధంగా ఉండాలి. ఇదే నరేంద్రదబోల్కర్ కు మనమిచ్చే ఘనమైన నివాళి.

సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు, 7989579428.

# తెలుగు రాష్ట్రాల్లో మార్వాడీ ఆధిపత్యం

**ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సవాళ్లు**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ద్వారా స్వతంత్ర గుర్తింపు సాధించిన యువత ఇప్పుడు మరో సమస్యతో పోరాడుతోంది. “మార్వాడీ గో బ్యాక్” నినాదంతో మొదలైన ఈ ఉద్యమం, రాజస్థాన్, గుజరాత్ నుంచి వచ్చిన మార్వాడీ వ్యాపారుల ఆర్థిక ఆధిపత్యం, సామాజిక అసమానతలు, సాంస్కృతిక ఆక్రమణలపై స్థానికుల అసంతృప్తిని ప్రతిబింబిస్తోంది. ఈ వ్యాసం ఈ సమస్యలను విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా పరిశీలిస్తూ, స్థానికుల ఆందోళనలను, సమస్యల మూలాలను, పరిష్కార మార్గాలను చర్చిస్తుంది.

**మార్వాడీల ఆర్థిక ఆధిపత్యం: స్థానికులకు నష్టం:**

మార్వాడీ వ్యాపారులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వ్యాపార రంగంలో గణనీయమైన ఆధిపత్యం సాధించారు. చిన్న సూది నుంచి బంగారు నగల వరకు, పానీపూరీ నుంచి ఖరీదైన స్వీట్ల వరకు, వారి వ్యాపార సామ్రాజ్యం గ్రామీణ, పట్టణ ప్రాంతాలను ఆక్రమించింది. స్థానిక వ్యాపారులు, ముఖ్యంగా కోమటి సమాజం, ఈ ఆధిపత్యం వల్ల తమ వ్యాపార అవకాశాలను కోల్పోతున్నారు. ఉదాహరణకు, నిర్మాణ రంగంలో 50 శాతం లాభాలు మార్వాడీ వ్యాపారులకు వెళ్తున్నాయని అంచనా. ఈ లాభాలు స్థానిక ఆర్థిక వ్యవస్థలో పునర్పెట్టుబడి కాకుండా, గుజరాత్, రాజస్థాన్‌లో పెట్టుబడులుగా మారుతున్నాయి, దీనివల్ల స్థానిక ఆర్థిక వృద్ధి స్తబ్దుగా ఉంటోంది.

అదనంగా, మార్వాడీ వ్యాపారులు నకిలీ, కల్తీ ఉత్పత్తుల విక్రయంలో పాల్గొంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. మహబూబాబాద్‌లో నాసిరకం వస్తువుల అమ్మకంపై ఫిర్యాదు చేసినప్పుడు, షాపు సీజ్ చేసినా ఒక్క రోజులోనే తిరిగి తెరవడం వారి రాజకీయ ప్రభావాన్ని సూచిస్తుంది. హవాలా దందా, పన్ను ఎగవేత వంటి ఆరోపణలు కూడా స్థానిక వ్యాపారుల ఆగ్రహాన్ని రెట్టింపు చేస్తున్నాయి. ఈ పరిస్థితులు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను తగ్గిస్తూ, ఆర్థిక అసమానతలను పెంచుతున్నాయి.

**సామాజిక, సాంస్కృతిక ఆక్రమణ:**

మార్వాడీల ఆధిపత్యం కేవలం ఆర్థిక రంగంతో ఆగలేదుబీ ఇది సామాజిక, సాంస్కృతిక రంగాలను కూడా ప్రభావితం చేస్తోంది. తెలంగాణ బతుకమ్మ వంటి సాంప్రదాయ వేడుకలు ఉత్తర భారత సంస్కృతి ప్రభావంతో డీజేలు, కోలాటాలతో మార్పు చెందుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది స్థానిక సంస్కృతి క్షీణతకు దారితీస్తోందని వారి ఆరోపణ. అంతేకాక, మార్వాడీలు స్థానికులతో సామాజిక సంబంధాలను పెంచుకోకుండా, కేవలం వ్యాపార లాభాలపై దృష్టి సారించడం సామాజిక విభజనను పెంచుతోంది.

మోండా మార్కెట్‌లో జరిగిన ఒక ఘటన ఈ సమస్య తీవ్రతను వెల్లడిస్తుంది. ఒక దళితుడు కారు పార్కింగ్‌పై ప్రశ్నించినందుకు, మార్వాడీలు అతనిని కులం పేరుతో అవమానించి, రాళ్లు, కుర్చీలతో దాడి చేశారు. ఇలాంటి ఘటనలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ, సామాజిక ఉద్రిక్తతలను రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులు కేవలం వ్యక్తిగత ఘర్షణలుగా కాక, స్థానిక సమాజం యొక్క గుర్తింపుపై దాడిగా పరిగణించబడుతున్నాయి.

**రాజకీయ నాయకుల నిర్లక్ష్యం, స్థానిక ప్రజల అసంతృప్తి:**

రాజకీయ పార్టీలు ఈ సమస్యను పట్టించుకోవడంలో విఫలమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రాజకీయ నేతలకు, వారి పార్టీలకు ఈ మార్వాడీలు తమ అక్రమ సంపాదనలో ఎన్నికల్లో లంచాలు, పార్టీ ఫండ్ లక్షల్లో, కోట్లలో ఇస్తున్నారు. అందుకే వారు చట్టం అన్నా, పోలీసులు అన్నా, రాష్ట్ర ప్రభుత్వం అన్నా వారికి భయం లేదు. ఈ గుజరాతీ, మార్వాడీ, రాజస్థానీ వ్యాపారులే బ్యాంకుల నుండి రుణాలు లక్షల కోట్లు తీసుకుని అసలు, వడ్డీ ఎగ్గొట్టి,విదేశాలకు పారిపోయారు. ఇప్పుడు బీజేపీ నాయకుడు కేంద్ర పోలీసు శాఖ మంత్రి బండి సంజయ్ వంటి వారు, రాజా సింగ్ ఎం.ఎల్.ఏ., మాధవీలత వంటి బీజేపీ నేతలు ఈ మార్వాడీ దోపిడీ దార్లకు మద్దతుగా నిలిచి, ఈ ఉద్యమాన్ని “కమ్యూనిస్ట్ దుష్ప్రచారం”గా అభివర్ణించడం స్థానిక యువతలో అసంతృప్తిని పెంచింది. అదే సమయంలో, అధికార కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు “మార్వాడీలకు వ్యతిరేకం కాదు” అని స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ దోపిడీ దొంగలకు వత్తాసు పలికిన వారికీ రేపు రాబోయే ఎన్నికల్లో దారుణమైన ఓటమిని బహుమతి గా ప్రజలు ఇవ్వాలని పిలుపు ఇచ్చారు. ఈ రాజకీయ నాయకులు పార్టీలకు అతీతంగా రాజస్థానీ, అలాగే మార్వాడీలకు అండగా నిలిచారు.




వారు స్థానిక యువత ఆందోళనలను పరిష్కరించడంలో చర్యలు తీసుకోలేదు. ఈ రాజకీయ నిర్లక్ష్యం, స్థానికులలో వారిపై విశ్వాసం సన్నగిల్లింది.

**ప్రపంచీకరణతో కూడా, స్థానిక నష్టం:**

1991లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణ వల్ల అమెజాన్, వాల్మార్ట్ వంటి బహుళజాతి సంస్థలు స్థానిక మార్కెట్లను ఆక్రమిస్తున్నాయి. ఈ సంస్థలు చవకైన శ్రమ, రోబోలు, ఏఐ సాంకేతికతలను ఉపయోగిస్తూ స్థానిక ఉపాధి అవకాశాలను తగ్గిస్తున్నాయి. ఇదే సమయంలో, మార్వాడీలు గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల వరకు వ్యాపారాలను విస్తరించడం వల్ల స్థానిక వ్యాపారులు పోటీలో వెనుకబడుతున్నారు. ఉదాహరణకు, స్థానిక వ్యాపారులు ఉదయం 10 గంటలకు షాపులు తెరిస్తే, మార్వాడీలు 4:30 గంటలకే తెరుస్తూ పోటీలో ముందుంటున్నారు.

**పరిష్కార మార్గాలు:**

ఈ సమస్యలను పరిష్కరించడానికి కొన్ని నిర్దిష్ట చర్యలు అవసరం:

1. **స్థానిక ఉద్యమం:** దళితులు, రైతులు, చిన్న వ్యాపారులను ఐక్యం చేసే “తెలంగాణ భూమిపుత్రుల సేన” వంటి ఉద్యమం ఏర్పాటు చేయాలి. ఇది గ్రామ, జిల్లా స్థాయిలో పనిచేసి, స్థానిక హక్కులను కాపాడాలి.
2. **చట్టపరమైన చర్యలు:** స్థానిక ఉపాధి కోసం 80-85 శాతం కోటా నిర్దేశించే చట్టాన్ని డిమాండ్ చేయాలి. నకిలీ ఉత్పత్తులు, కల్తీ ఆహారాలపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఫుడ్ ఇన్స్పెక్టర్ల సంఖ్యను పెంచాలి.
3. **ప్రజా చైతన్యం:** సోషల్ మీడియా,మేయిన్ మీడియా ద్వారా స్థానిక సమస్యలపై అవగాహన కల్పించాలి.మార్వాడీ షాపుల్లో వారు విక్రయించే సరుకులు కొనరాదు. స్థానిక తెలుగు వ్యాపారులను మాత్రమే ప్రోత్సాహించాలి.ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహించాలి.
4. **రాజకీయ ఒత్తిడి:** రాజకీయ పార్టీలు స్థానిక సమస్యలపై స్పష్టమైన వైఖరి తీసుకునేలా ఒత్తిడి తీసుకురావాలి.వారు మారక పోతే వారి రాజకీయ భవిష్యత్తుని ప్రజా చైతన్యంతో గల్లంతు చేయాలి.
5. **సామాజిక ఐక్యత:** తెలుగు రాష్ట్రాల్లో కుల విభజనను అధిగమించి, స్థానిక సమాజం ఐక్యంగా నిలబడాలి.
6. **ఆర్థిక స్వావలంబన:** స్థానిక వ్యాపారులకు నైపుణ్య శిక్షణ, బ్యాంకు ల ద్వారా ఆర్థిక రుణ సహాయం అందించాలి. చిన్న వ్యాపారాలకు లైసెన్సులను సులభతరం చేయాలి.

మార్వాడీల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ఆధిపత్యం తెలుగు రాష్ట్రాల్లో స్థానిక గుర్తింపు, ఉపాధి, సంస్కృతిని దెబ్బతీస్తోంది. ఈ సమస్య కేవలం ఆర్థికమైనది కాదు, సమాజ ఆత్మగౌరవానికి సంబంధించినది. స్థానిక యువత, వ్యాపారులు, రాజకీయ నాయకులు ఐక్యంగా నిలబడి, చట్టపరమైన, సామాజిక చర్యల ద్వారా ఈ సవాళ్లను అధిగమించాలి. ఇది తెలంగాణ సమాజ ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ఒక కీలక ఉద్యమం.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## నోబెల్ పిచ్చి!

వ్యక్తిలాభాల వ్యవస్థ!
సమాజనష్టాల అవస్త!
వ్యవస్థ మారకుండా
అవస్తలు తీరవు!
దేశాలన్నీ మార్కెట్లైతే
మార్కెట్లన్నీ కార్పొరేట్ల
లాభాల వ్యూహాలు!
అవిపద్మవ్యూహాలు!
దరిద్రమంతా ప్రజలకి
లాభాలు కార్పొరేట్లకి
ఈ అవస్తల కారణం
అంతా సామ్రాజ్య వాదం!
యుద్ధాలు లాభాలకోసం
లాభలన్నీకార్పొరేట్లవిజి
కార్పొరేట్లనుఒప్పించాలి!
‘ట్రంప్’ చెయ్యగలడా?
వాళ్లు ఒప్పుకుంటారా?
‘సూక్ష్మం’ పట్టించు కోరు!
‘ట్రంప్’మాటవినేదెవ్వరు
ఆయన’నోబెల్ ‘సంగతి!
శాంతిశ్వరూపుడు’ట్రంప్’
అదేంటో ‘నోబెల్ పిచ్చి’!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

బిఎస్ రాములు

# తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్య శిల్పి

**(బిఎస్ రాములు 75 - అమృతోత్సవం)**



బీసీల సంస్కృతి, ఆలోచనలు, పెళ్ళిచూపులు, పెట్టుబడులు మొదలగు ఎన్నో విషయాలుంటాయి. విశాలాంధ్ర వారి ‘నూరేళ్ళ తెలంగాణ కథ’ పుస్తకంలో బిఎస్ కథ ‘దక్షయజ్ఞం’ చోటు పొందింది. దీని ఎంపిక చేసుకోవడానికి కారణం బిఎస్ ఈ కథలో లేవనెత్తిన విప్లవ విమర్శనే అనుకోవాలి. ఇందులో పీడితుల జీవన పరిస్థితులున్నాయి. అంటే పై రెండు భిన్నధృవాలున్న కథలు. ఒకటి ఎదిగివచ్చి అందుకున్న గెలుపును చూపిస్తే మరోటి ఏమి సాధించలేని ఓటమిని సూచిస్తుంది. గొల్లపూడి మారుతీరావు రచయిత ఇంటికే వచ్చి ఇంటర్వ్యూ చేసి దాన్ని ప్రసారం చేశారు.

అలాగే ఎన్నో కథా సంకలనాల్లో బిఎస్ రాములు కథలకు స్థానం లభించింది. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో 1990 నుండి వెలువరించిన కథా వార్షికలను తిరిగి రెండు సంపుటాలుగా పునర్ముద్రించారు. అందులో ‘మెరుగు’ అనే కథ చేర్చుకున్నారు. చీకోలు సుందరయ్య ‘మెచ్చిన కథ’ సంకలనంలో ‘పాలు’ కథ తీసుకున్నారు. దళిత కథలు ఎనిమిది సంకలనాలు తెచ్చిన డా. కె. లక్ష్మీనారాయణ ‘బంది’ కథ మొదలుకొని అనేక కథలను సంకలనంలో చేర్చారు. బిఎస్ రాములు, వనమాల చంద్రశేఖర్ సంపాదకత్వంలో వెలువరించిన కరీంనగర్ జిల్లా కథలు నాలుగు సంపుటాల్లోను, ‘భారతీయ సాహిత్యం- తెలుగు కథలు’ అనే సంకలనంలోను మరికొన్ని కథలు వచ్చాయి. ‘కథాసాగర్’ సంకలనంలో ‘సదువు’ కథను చేర్చారు. కేంద్ర సాహిత్య అకాడమీ వారి సంకలనంలో ‘అడవిలో వెన్నెల’ కథ చేర్చారు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్ అచ్చువేసిన కథా సంకలనాల్లో ‘అడవిలో వెన్నెల’ కథ మొదటిసారిగా అచ్చు వేశారు. తర్వాత అనేక సంకలనాల్లో దీన్ని చేర్చారు. కేంద్ర సాహిత్య అకాడమీ తరఫున ప్రచురించే ఇండియన్ లిటరేచర్ అనే పత్రికలో ‘రియల్ ఎస్టేట్’ అనే కథను ఎంపిక చేసి ప్రచురించారు. ఇలా ఆయా సంకలనాల్లో సామాజిక చరిత్ర పరిణామాలను విస్తృతంగా ప్రతిఫలించే కథలను తీసుకోవడం జరిగింది.

కాలక్రమంలో బిఎస్ రాములు కథలు వస్తు ప్రాధాన్యతతో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. వస్తువు రీత్యా బి ఎస్ కథల్లో వచ్చిన వైవిధ్యాన్ని ఇలా విడదీయవచ్చు. 1) 1977 నుండి ప్రారంభదశ, 2) 1980-1990 విప్లవ సాహిత్యం, 3)1990-1995 బహుజన సాహిత్యం, 4) 1996-2000 మానవ సమాజ పరిణామం, 5) 2001-2005 తెలంగాణ ఉద్యమ ప్రాధాన్యత. 2006నుండి పై అన్ని దశల పరిణామాలు, వాటి విశ్లేషణ, సామాజిక పరివర్తన చిత్రణ ఈ కథల్లో చూడవచ్చు. వస్తువుల్లోనే కాకుండా శైలీ, శిల్పంలోను అనేక మార్పులు జరిగాయి. మొదటగా తన జీవితంలో అనుభవించిన కష్టాలు, కన్నీళ్ళ గురించి రాశారు. 1980-90 వరకు రాసిన కథలన్నీ విప్లవానికి సంబంధించినవి. అన్యాయానికి, అణచివేతకు గురవుతున్న వారి గురించి వాటిలో ఉంది. విప్లవ సంఘాలు, నక్సలైట్లు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యమకారులు, పౌరహక్కుల సంఘాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఇలా అనేక విభాగాలకు సంబంధించిన వారి జీవన చిత్రణ వీటిలో ఉంది. విప్లవ కథలతో 1991లో ‘పాలు’ కథల సంపుటి వెలువడింది. ఇది ఆంధ్ర యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీలలో ఎంఏ విద్యార్థులకు పాఠ్య గ్రంథంగా ఉంది. అలాగే విప్లవ కథలతో 2004 లో ‘తేనెటీగలు’ కథల సంపుటి వేశారు. ఆ తర్వాత 2013లో అంతదాకా దొరకని కథలు సేకరించి ‘అడవిలో వెన్నెల’ కథా సంపుటి వేయడం జరిగింది. ఇందులో మారుతున్న విప్లవంపట్ల మారిన తన అభిప్రాయాలను జోడించి ముందుమాట రూపొందించారు. ‘ఉద్యమం ఉద్యమం కోసం కాదు. జీవితం గెలవడం కోసం’ అనే మాటకు బలమిచ్చే కథలు ఇందులో ఉన్నాయి.

కథల్లో జీవితంలో గెలుచుకున్న తీరును చూపించాలి కానీ ఓడినట్లు చూపించొద్దనే సూత్రాన్ని బిఎస్ తన కథల్లో పాటించారు. మొదటినుండీ వివక్ష ఎలా ఉంది? దానిని ఏ విధంగా దూరం చేయాలి? సమసమాజ నిర్మాణానికి ఏం చేయాలి? ఇదీ కథల్లో చూపించాల్సింది అని నమ్మారు. ఇదే ‘సోషలిస్టు వాస్తవికత’. అనగా జీవితం ఎలా వుందో చెప్పడంతో పాటు, ఎలా ఉంటే బాగుంటుందో కూడా చిత్రించాలి. ఏం జరిగింది? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? ఎక్కడ జరిగింది? ఆ పరిణామం ఎందుకు అనివార్యమైంది? అనే విషయాలు అన్ని కథల్లో చిత్రించగలిగితే ఆ కథా వస్తువు శైలీ శిల్పం ప్రారంభం, ముగింపు చక్కగా కుదిరితే అది గొప్ప కథ అవుతుంది అని అభిప్రాయపడ్డారు. విద్య యొక్క ప్రాధాన్యత, విద్యావ్యవస్థ తీరు, కుటుంబ వ్యవస్థ పరిణామాలు, ప్రాజెక్టులు తెచ్చిన పరిణామాలు, అభివృద్ధి తెచ్చిన పరిణామాలు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, వాటి పరిణామాలు మొదలైనవి కథల్లో, నవలల్లో చిత్రించారు.

ఈ దృక్పథంతో బిఎస్ రాసిన కథలు ఆధునిక సమాజాన్ని ప్రతిఫలించాయి. ఇలాంటి కథలు క్లాసిక్స్ గా ప్రతిభాషలో ప్రపంచ సాహిత్యం లో కలకాలం నిలిచిపోతాయి అనే విషయాన్ని ‘కథలబడి’ కథా సాహిత్య అలంకార శాస్త్రంలో విశ్లేషించారు. ఆపిల్‌ను కోసి ఎంత చిన్న ముక్క చేసినా దాని రుచి మారదు. అలాగే జీవితంలోంచి ఏ చిన్న అంశం తీసుకున్నా మొత్తం సామాజిక స్వరూప స్వభావాలు ఆపిల్ ముక్కలో ఉండే రుచిని చెప్పగలిగేటట్లు ఉండాలి అనే విషయాన్ని నిర్వచించడానికి ఆధునిక కథకు ‘సమగ్ర సామాజిక కథ’ అని పేరు పెట్టడం జరిగింది. ‘సమగ్ర సామాజిక కథ 50 ఏళ్ల తెలుగు కథ తీరుతెన్నులు’ పుస్తకాన్ని 2003లో వెలువరించారు. 2004లో ‘సాహిత్య చరిత్రను కొత్తచూపుతో తిరగ రాయాలి’ అనే పుస్తకాన్ని ప్రచురించారు. కథల్లో, నవల అంత కథావస్తువును ఒక శైలీ శిల్పంతో కథలుగా మలిచారు. కథ వస్తువు ఇతివృత్తం ఎంత విశాలమైనదైనప్పటికీ కథలుగా, కథానికలుగా మలిచారు. ఇదే ఇతని కథలోని కథా వస్తువు, శైలీ శిల్పం, ప్రెజెంటేషన్ ప్రత్యేకత. 1968లో అచ్చయిన ‘జగిత్యాల కథ’ కూడా మొత్తం సమాజ పరిణామాన్ని కుటుంబ సంబంధాలను ఉమ్మడి కుటుంబం, వ్యక్తి కుటుంబాలుగా విడిపోతున్న తీరును చిత్రించిన కథే. అలాంటి మార్పుకోసం తన కథలను కూడా దశలవారీగా, పరిస్థితులకు అనుగుణంగా మార్పు చేసుకుంటూ చైతన్యాన్ని కలిగించేలా రాశారు.

కథా సాహిత్య నిర్మాణం గురించి బిఎస్ ఎన్నో రచనలు, కార్యక్రమాలు చేపట్టారు. అదే క్రమంలో కథా వస్తువు ఎవరిది? ఆ పాత్రలు, సంఘటనలు ఎవరివి? ఎవరి జీవితం గురించి రాశారు? అనే అంశాలను వివరిస్తూ సాహితీవేత్త విహారి ‘నవ్య కథా శిల్పి-బిఎస్ రాములు’ అని పుస్తకం రాశారు. కాలం తెచ్చినమార్పు, గెలుచుకున్న జీవితం, చికాగోలో నానమ్మ అనే మూడు కథా సంపుటాలను ఆయన తమ పరిశీలనకు తీసుకున్నారు. ఆ కథల్లో ఏ ఏ వృత్తులున్నాయో వాటిని చిత్రించారు. మహిళలపట్ల, విద్యార్థులపట్ల, బీసీలపట్ల, చేతివృత్తులపట్ల సహానుభూతితో జీవితాలను, సంస్కృతిని చిత్రించారని ప్రతి కథ గురించి చక్కగా అందులో విశ్లేషించారు. అది ఒక రకంగా ఎమ్‌ఫిల్, పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథంతో సమానమైనది.

కథా సాహిత్య విశ్లేషణ పుస్తకంపై బిఎస్ రాములు రాసిన పుస్తకం ‘కథలబడి - కథా సాహిత్య అలంకార శాస్త్రం’. దీనిని సి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. రావూరి భరద్వాజ గారు ముందుమాట రాశారు. ఇద్దరు జ్ఞానపీఠ అవార్డు గ్రహీతల ప్రశంసలు పొందిన పుస్తకం ఇది. ఆధునిక ప్రక్రియలలో నవరసాలతోపాటు అనంత రసాలు, స్థాయి భావాలతో రససృష్టిని సాధించడం, సమర్థవంతంగా, ప్రతిభావంతంగా చిత్రించడం కోసం ‘కథలబడి’ సాహిత్య అలంకార గ్రంథం ఉపయోగపడుతుంది.

రచయితగానే కాకుండా ప్రచురణకర్తగా, సాహితీ సంస్థ నిర్వాహకుడిగా బిఎస్ గణనీయపాత్ర నిర్వహిస్తున్నారు. విరసంలో కొనసాగుతున్న కాలంలో తమ పుస్తకాలను అచ్చు వేసుకోవడం కోసం నిజాం వెంకటేశం సహకారంతో ‘కరీంనగర్ బుక్ ట్రస్ట్’ ఏర్పాటు చేశారు. ‘బతుకు పోరు’ నవల, అల్లం రాజయ్య ‘భూమి’ కథల సంపుటి, సింగరేణి కార్మికుల ‘సింగరేణి కథలు’, ‘అడవిలో వెన్నెల’ పేరుతో గిరిజనుల కథలను కె బి టి అచ్చు వేసింది. తాను అజ్ఞాతంనుంచి వచ్చాక 1990లో ‘విశాల సాహిత్య అకాడెమీ’ పేరుతో తిరిగి ప్రచురణలు ప్రారంభించారు. ఆ సంస్థ బిఎస్ పుస్తకాలతోపాటు 75 ఇతరుల పుస్తకాలు కూడా వేసింది. ప్రతీ ఏటా విశాల సాహితీ పురస్కారాలు కూడా అందిస్తోంది. విశాల సాహితి వేదికగా 1995 నుండి సాహిత్య

తరువాయి రేపటి సంచికలో

- బద్రి నర్సన్
ఫోన్: 9440128169

# మూగజీవుల లెక్కల్లో పోలీసుల లెక్కే వేరు..

- అక్రమ గోవుల పట్టివేతలో ఒక్కో అధికారి ఒక్కో విధంగా
- ఊపిరాడక వాహనంలోనే చనిపోయి పురుగులు పడిన వైనం
- అసలు గోవులే చనిపోలేదని తేల్చిచెప్పిన పోలీసులు
- ఎఫ్ఐఆర్ ఓ విధంగా
- మీడియాకు సమాచారం మరో విధంగా
- ఎఫ్ఐఆర్‌తో పాటు పక్కా సాక్ష్యాధారాలు జనంసాక్షి చేతికి



ఆమానవీయంగా మూగజీవులకు ఊపిరి ఆడకుండా చేసి వాటిని తరలిస్తున్న వాహనాల డ్రైవర్లు క్లీనర్లు సునీల్ ఆతీఫ్ ఖాన్ శంకర్ మహమ్మద్ ఇదేశామోద్దీన్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (జనంసాక్షి) :** చట్టానికి న్యాయానికి ధర్మానికి కనిపించే మూడు సింహాలైతే కనిపించని నాలుగో సింహమే ఈ పోలీస్ అనే డైలాగ్ ఓ సినిమాలోది అయితే ఇక్కడ మాత్రం పోలీసులు కచ్చితంగా ధర్మం తప్పారు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మూగజీవులను రహస్యంగా హైదరాబాద్ బహదరపూర్‌కు రెండు కంటైనర్లలో తరలిస్తున్నారన్న పక్క సమాచారంతో సైబరాబాద్ పరిధిలోని కొందుర్గ్ మండలం రాంచంద్రపూర్ శివారు వద్ద పోలీసులు రెండు కంటైనర్లను ఆపి తనిఖీలు చేసి అత్యంత మూగ జీవులను హైదరాబాదు జియాగూడలోని శ్రీ సమరీత్ కామదేను గోషాలకు తరలించినట్లు మీడియాకు సమాచారం ఇచ్చారు కానీ తర్వాత పరిణామాలు మొత్తం మరోరకంగా మారాయి ఇదే పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఓ పోలీస్ అధికారి ఫిర్యాదుతో ఈ నెల 15వ తేదీన పలు సెక్షన్లు 325, బిఎన్ఎస్,5, 6, 9, 10 రెడ్ విత్ 11 రెడ్ విత్ 38, 47, 48, 49, 50, 51, 52, 53, 54, 55, 56, సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు ఏలాంటి అనుమతులు లేకుండా రెండు వాహనాల్లో ఊపిరాడకుండా ఇరుకుగా బంధించి తరలిస్తూ ఫలితంగా పశువులు ఊపిరాడకుండా చనిపోవుటకు కారకులైన సదరు వ్యక్తులపై ఫిర్యాదుతో రెండు వాహనాల్లో కలిపి మొత్తం మూగజీవులు 115 ఉన్నట్టు ఎఫ్ఐఆర్ లో నమోదు చేసి కోర్టుకు ఛార్జ్ షీట్ వేశారు పోలీసులు కానీ స్థానిక మీడియా ప్రతినిధులు సమాచారం అడిగితే మాత్రం 90 మాత్రమే మూగజీవులు ఉన్నాయని అందులో ఏమి చనిపోలేదని పదేపదే తేల్చి చెప్పారు కానీ ఇదే పోలీసు అధికారులు ఎఫ్ఐఆర్‌లో మాత్రం 115 ఉన్నట్టు అందులో 34 గోవులు చనిపోయినట్టు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు కానీ వాహనాలలో మూగజీవులు మృత్యువాత పడి పురుగులు పడి మృతి చెంది ఉన్నాయి ఇదేమిటని కొందుర్గ్ మండల ఎస్సై రవీందర్ నాయక్ ను వివరణ కోరగా ఆయన సమాచారం ఇవ్వడానికి వెనుకముందు అయ్యారు. తర్వాత మరో రకంగా చెప్పుకొచ్చారు కేవలం 90 గోవులు మాత్రమే ఉన్నాయని అందులో ఏవి చనిపోలేదని చెప్పారు ఈ విషయమై రూరల్ సీఐ నర్సయ్య ను వివరణ కోరగా ఏవి చనిపోలేదని ఇలా ఒక్కో పోలీస్ అధికారి ఒక్కో రంగంగా చెప్పుకొచ్చారు ఇదే విషయం గోశాల నిర్వాహకులను సమాచారం అడిగితే మాత్రం మొత్తం 151 మూగజీవాలు ఉన్నాయని అందులో 34 చనిపోయాయని 117 బ్రతికి ఉన్నాయని చెప్పుకొచ్చారు మరి ఇలాంటి వారిపై పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే..

## బోడుప్పల్‌లో పక్కాగా వందరోజుల ప్రణాళిక..

- ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసిన కమీషనర్ శైలజ



**బోడుప్పల్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఒక మార్పు అభివృద్ధికి మలుపు అను నినాదంతో ప్రారంభమైన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శైలజ అమలు చేస్తున్నారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్‌లో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించి, ఇంటింటికి పూల, పండ్ల మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో నగరాలు పరిశుభ్రతతో పాటు పచ్చదనంతో నిలవాలని నిర్వహించిన కార్యక్రమమని ఎల్లప్పుడూ అలాగే ఉండేలా చూడాలని ప్రజలను కోరారు. మన ఇంటి చుట్టు పరిశుభ్రంగా ఉంచుకుంటే నగరం మొత్తం శుభ్రంగా ఉన్నట్లేనని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ నారాయణ రెడ్డి,వార్డ్ ఆఫీసర్ వినయ్ కుమార్,కాలనీ వాసులు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం



**మల్కాజిగిరి,ఆగస్టు 20 (జనంసాక్షి) :** భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. భారతదేశ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలు మౌలాలి చౌరస్తాలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు, అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఆశ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్,జితేంద్ర నాథ్, వెంకటేష్ యాదవ్,లక్ష్మీ కాంత్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, పోతుల వినోద్ యాదవ్, బిక్ష పతి,ఆశ, చంద్రశేఖర్,వెంకటేశ్వర్ రావు, మదర్ బాయ్,సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్,యూసుఫ్ బాయ్, యాది, అమిత్ భాయ్, నర్సింగ్ రావు, గద్దం సత్తి, చంటి శ్రీనివాస్,రాఘవన్ సంతోష్ ముదిరాజ్, సలీం, షకీల్,ప్రభ, చందు, భాగ్యరాణి, జాన్ బీ,పద్మ ,ఇంద్ర ప్రియదర్శిని, అఫ్రోజ్, భీమ్ రాజ్,రఘు యాదవ్,సందీప్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్‌లో ఆగని భూ కబ్జాలు..

- కింది స్థాయి అధికారుల అండదండలు పుష్కలం
- చక్రం తిప్పుతున్న జూనియర్ అసిస్టెంట్
- త్వరలో ఆ ఇరవై ఎకరాలు మాయం



**బోడుప్పల్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** మేడిపల్లి మండల పరిధిలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ సర్వేనంబర్ 63/28,39లో భూ కబ్జాలు జోరుగా సాగుతున్నాయి.రాష్ట్రంలోని ప్రభుత్వ భూములను రక్షించి భవిష్యత్తుకు అవసరం అయ్యే విధంగా చూడాలని ప్రభుత్వం చెబుతుంటే రక్షించాల్సిన కొందరు అధికారులు మాకెందుకు అనేవిధంగా విధులు నిర్వర్తించడం పలు అనుమానాలకు తావిస్తుంది.

**కబ్జాపాలు కానున్న ఆ ఇరవై ఎకరాలు**

బోడుప్పల్ సర్వేనంబర్ 63/1 నుండి 63/39 లోని ప్రభుత్వ భూమిలో పట్టాలు పంచగ,కబ్జాలు చేయగ మిగిలింది ఇరవై ఎకరాల భూమి.దానిని కాపాడి నగర ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పిల్లలకు ఆడుకోవడానికి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామని మాజీ మంత్రి మల్లారెడ్డి, స్థానిక మాజీ కార్పొరేటర్ దానగళ్ల అనిత యాదగిరిలు హామీఇచ్చి అందులో ఎలాంటి కబ్జాలు చేపట్టవద్దని కొంతభాగంలో చెట్లు నాటడంతో పాటు ఇరవై ఎకరాలకు మున్సిపల్ నిధుల నుండి చుట్టూరా ఫెన్సింగ్ వేయాలని తీర్మానించడం జరిగింది. కానీ నేటి వరకు ఆ ఇరవై ఎకరాలకు ఎలాంటి ఫెన్సింగ్ వేయలేదు కదా నాటిన ఒక్క మొక్కకూడ మిగలేకపోవడం గమనార్హం. కాపాడుతామన్న స్థలంలో దర్గా పాత ఇండ్లను కూల్చిన వేస్టేజ్‌ను పోసి రోడ్లు నిర్మిస్తూ లే అవుట్‌ను తయారు చేస్తున్నారు. ఇదంతా గత సంవత్సరం నుండి నడుస్తున్న రెవిన్యూ అధికారులు చూడడమే తప్పా ఆపకపోవడం అక్కడి ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తుంది.ఇలాగే కొనసాగితే అతి కొద్ది రోజులలోనే ఇరవై ఎకరాలు మాయం అయ్యే పరిస్థితి నెలకొంటది.

**చక్రం తిప్పుతున్న జూనియర్ అసిస్టెంట్**

ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఇండ్లను నిర్మిస్తున్నారని సంబంధిత అధికారులకు స్థానికుల ఫిర్యాదులు,వార్త పత్రికలలో వచ్చిన వార్తల ఆధారంగ ఉన్నత అధికారులు స్పందించి కింది స్థాయి అధికారులను ఫీల్డ్ కు పంపిస్తే ఒకటి రెండు తూతూ మంత్రంగా కూల్చడం లేకుంటే కొత్త నిర్మాణాలు నిర్మించరాదని ఉన్నత అధికారులకు చెప్పడం జరుగుతుంది.దీనిలో ముఖ్యంగా ఒక జూనియర్ అసిస్టెంట్ చేతి వాటం ఎక్కువైందని దీనిని కూల్చాలన్నా ఉంచాలన్న చెప్పిందే వేదంగా మారిందని స్థానికులు చెబుతున్నారు.ఇకనైనా అలాంటి వారిని దూరం పెట్టి కబ్జాలను అరికట్టాలని కోరుతున్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**అల్లాదుర్గం ఆగస్టు 20 (జనంసాక్షి) :** జిల్లా ఇంకా ఆరెంజ్ అలర్ట్ లో ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ తెలిపారు. బుధవారం కలెక్టర్ అల్లాదుర్గం మండలంలో పర్యటించి అల్లాదుర్గం లోని తెగిపోయిన బట్టి కుంట కట్టను పరిశీలించారు, అనంతరం మండలంలోని చిల్వర్ గ్రామంలోని చెరువుకట్టను తహశీల్దార్ , ఇరిగేషన్ అధికారులతో పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో భారీ వరద ప్రవాహ ఉధృతి వలన నష్టం వాటిల్లిన వాటిపై తాత్కాలిక మరమ్మత్తులు దిశగా జిల్లా యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసాయని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం జరిగింది అన్నారు. వర్షాలు వరద నీటితో లోతట్టు నీరు చేరిందని, మండలంలో నమోదైన వర్షపాత వివరాలు, వరద ప్రవాహ ఉధృతికి కోతకు గురైన రోడ్లు, చిల్వర్ చెరువు కట్టకు సంబంధించి అధికారులను అడిగితెలుసుకుని.పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా ఇంకా ఆరెంజ్ అలర్ట్‌లో ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. చెరువులు నిండి అలుగు పారి ఇండ్లల్లో ప్రవేశించే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకున్నామన్నారు. రోడ్లు కోతకు గురైన దగ్గర,ఇసుక బస్తాలు సిద్ధం చేసుకుని అవసరమైన దగ్గర ఉపయోగించుకొని పునరుద్ధరించాలని ఆదేశించారు.లో లైన్ కాజ్ వేలు పూర్తిగా నీరు తగ్గే వరకు ప్రజలను ప్రయాణాలు చేయకుండా భారీ కేడింగ్ కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో చంద్ర శేఖర్, తహశీల్దార్ మల్లయ్య, ఎంపిఓ లింగ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనారిటీలపై ఎందుకంత చిన్నచూపు..



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (జనంసాక్షి) :** ముస్లిం మైనార్టీలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు అంత చిన్న చూపని తెలంగాణ జాగృతి ముస్లిం మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ ఎండి ముస్తఫా అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ లో విద్యార్థులకు సరైన భోజన వసతి లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని విద్యా బోధన కూడా సరిగ్గా నిర్వహించడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఇప్పటికైనా ఈ ప్రభుత్వం ముస్లిం మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలకు నిధులు కేటాయించాలని కోరారు అదేవిధంగా మైనార్టీలకు గత ప్రభుత్వాలు దూరవిద్య కొరకై స్కాలర్ షిప్ మంజూరు చేయడం జరిగిందని కానీ ఇప్పటి ప్రభుత్వం ఇప్పటివరకు ఏటువంటి స్కాలర్షిప్ లోను మంజూరు చేయడం లేదని వెంటనే ముస్లిం మైనార్టీ విద్యార్థులకు స్కాలర్షిప్ లోను విడుదల చేయాలని అదేవిధంగా ఇమామ్‌లకు జీతభత్యాలు పెంచి చెల్లిస్తామని ఎన్నికల హామీల్లో ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఆ హామీలను పట్టించుకోవడం లేదని కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వచ్చే మిలాద్ ఉన్ నబి పండుగలోపు పెండింగ్ లో ఉన్న పెంచిన జీతభత్యాలను చెల్లించాలని తెలంగాణ జాగృతి ముస్లిం మైనార్టీ శాఖ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఇబ్రహీం సలీం అబ్దుల్ రెహమాన్ బాలాజీ ఉదయ్ పాండు నాయక్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో నూతన షెడ్ నిర్మాణం



**కాప్రా, ఆగస్టు 20 (జనం సాక్షి) :** కాప్రా డివిజన్లోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ ప్రాంగణంలో నూతన షెడ్ నిర్మాణ భూమి భూమి పూజ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై షెడ్డు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి ఏర్పడిన మూడునెలల కాలంలోనే ఆలయంలో ఉన్న నీటి సమస్యను రూ. 1,50,000/–ల వ్యయంతో పవర్ బోరు వేయించి పరిష్కరించారు. ఆలయంలో విద్యుత్ వైరింగ్ చేసి విద్యుత్ దీపాల వెలుగులు ఏర్పాటుచేశారు. చేయించారు. ఆలయ ప్రాంగణంలో ఫాబ్రికేటెడ్ షెడ్ నిర్మాణానికి సంకల్పించి ఈరోజు శంకుస్థాపన చేయడం జరిగినదని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఈ షెడ్ నిర్మాణం ద్వారా బ్రహ్మోత్సవాలు, వేడుకలు నిర్వహించుటకు జరుపుకొనుటకు, భక్తుల సౌకర్యార్థం నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు పొట్లు బాబురావు, పడమటి మల్లా రెడ్డి, నరేందర్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, ఉప్పల వినోద్ కుమార్, జి. సత్యనారాయణను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కృష్ణమాచార్యులు, మాజీ కార్పొరేటర్ ధనపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజేందర్, మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగేష్, చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త అంజిరెడ్డి, సీతారామ్ రెడ్డి, కొబ్బనూరి నాగరాజు, పి పవన్ కుమార్, టి. శ్రీహరి, సంతోష్ చారి, గుణశేఖర్, మురళి, కె. రాజు, సతీష్ యాదవ్, జగదీష్, షాబుద్దీన్, రాజన్, ఆకుల సంతోష్, డివిజన్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అరుణ్ కిరణ్, ఆలయ ప్రధానార్చకులు రవి మూర్తి శర్మ, ఆలయ సిబ్బంది శ్రీనివాస్ గౌడ్, స్థానిక నాయకులు పరంధోడ్ శ్రీనివాస్, లక్ష్మణ్, మోతిలాల్, భక్తులు పాల్గొన్నారు.

## ఎండుగంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



**సంగారెడ్డి, ఆగస్టు 20 (జనం సాక్షి) :** కర్ణాటక ఆర్టీసీ బస్ లో ఎండు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఎన్ఫోర్సెమెంట్ అధికారుల ఆదేశాల మేరకు బుధవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించగా కరీంనగర్ కు చెందిన తాజ్ మహమ్మద్ అక్రమంగా బీదర్ లో గంజాయి కొనుగోలు చేసి కర్ణాటక ఆర్టీసీ బస్సులో హైదరాబాద్ తరలిస్తుండగా టోల్ ప్లాజా వద్ద ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేయగా 440 గ్రాముల గంజాయి లభించింది. అతని పై కేసు నమోదు చేసి అతని వద్ద ఉన్న మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ కి తరలించారు. దాడులలో ఎన్ఫోర్సెమెంట్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై అనిల్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ అలీం, కానిస్టేబుల్స్ యాదయ్య, కరీం తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు..
- ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం
- ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**దోమ, ఆగస్టు 20 (జనం సాక్షి) :** దోమ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది మహిళలకు ఉచిత కుట్టుమిషన్లను మరియు సర్టిఫికెట్లను స్థానిక నాయకులు,అధికారులతో కలిసి పరిగి ఎమ్మెల్యే%డ్% డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం దోమ గ్రామానికి చెందిన మరియు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 99మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల (ప్రొసీడింగ్స్) ను ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని,మహిళలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు, మహాలక్ష్మి పథకం, అమ్మ ఆదర్శ కమిటీ, మహిళల ఆర్థిక రంగాల్లో ద్వారా సంఘాల రుణాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లు, వంటి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను మహిళల పేరు మీదనే ఇస్తున్నామని తెలియజేశారు.ప్రభుత్వం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని అన్నారు.ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలిపారు. పరిగి నియోజకవర్గానికి ఫస్ట్ ఫేజ్ 3500 ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.రాబోయే 3 సంవత్సరాలలో నియోజకవర్గంలో 20వేల ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదవారికి కట్టించి ఇస్తామని ఆయన తెలిపారు. పేదవాడు బలోపేతం అయ్యేందుకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. పూర్తి పారదర్శకంగా ఇల్లు లేని, కనీసం గోడ కూడా కట్టుకోలేని వారికి మొదటి విడతలో ఇండ్లను కేటాయిస్తున్నామని చెప్పారు.రాబోయే నాలుగు సంవత్సరాలలో విడతలవారీగా అర్హులైన పేదవారందరికీ ఇండ్లు ఇస్తామని ఎమ్మెల్యే గారు తెలిపారు ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునే వారికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని తెలిపారు.ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని,మారుమూల ప్రాంతాలలోని చిన్న చిన్న తండాల అనుసంధానం కోసం లింక్ రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ యాదవ రెడ్డి, డైరెక్టర్లు ప్రభాకర్ రెడ్డి,శాంత్ కుమార్,కాంగ్రెస్ నాయకులు శివకుమార్ రెడ్డి,రాములు నాయక్,రాఘవేందర్ రెడ్డి,బంగ్లా యాదయ్య, జాకటి వెంకటయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,బల్ రెడ్డి,వెంకట్ రెడ్డి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు..మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
21 ఆగస్టు 2025

# నల్లవాగు ప్రాజెక్టు కెనాల్ పనులు పూర్తి చేయిస్తాం

● జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య

**నారాయణఖేడ్, ఆగస్టు 20 (జనం సాక్షి) :** నారాయణఖేడ్ నియోజకవర్గం, సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య ,నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి బుధవారం నల్లవాగు మధ్యతరహా ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నీటి నిలువ సామర్థ్యం, ప్రాజెక్టుకు వస్తున్న ఇన్ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను అధికారులను అడిగితెలుసుకున్నారు. ప్రాజెక్టు కుడి ,ఎడమ కాలువల ద్వారా ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు వివరాలు నీటిపారుదల శాఖ అధికారులు కలెక్టర్కు వివరించారు. ప్రాజెక్టు ద్వారా కుడి కాలువ కింద 4080, ఎడమకాల ద్వారా ఎడమకాల ద్వారా 1980 ఎకరాలకు సాగునీరు అందుతుందని అధికారులు కలెక్టర్ కు తెలిపారు.ప్రాజెక్టు కుడి కాలువ ఎడమ కాలువలలో జరుగుతున్న పూడికతీత చెట్ల తొలగింపు పనులకు జెసిబిలను ఉపయోగించి త్వరగా పూర్తీ అయ్యేలా చూడాలని ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రాజెక్టు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సిర్గాపూర్ మండల కేంద్రంలోని శ్రీవెంకటసాయి ఫర్టిలైజర్స్ దుకాణంలో



ఎరువుల విక్రయాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా ఉందని, యూరియాను పంట సాగుకు మాత్రమే వినియోగించాలని అన్నారు. జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల సమన్వయంతో ఏర్పాటుచేసిన టాస్క్ ఫోర్స్ టీం ద్వారా యూరియా అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. యూరియా విక్రయ దుకాణదారులు తమ దుకాణంలో యూరియా నిల్వలు, ధరల పట్టికను ప్రదర్శించాలని, వ్యవసాయ శాఖ అధికారులు యూరియా సంబంధిత వివరాలతో ప్రతిరోజు నివేదిక అందించాలని మండల వ్యవసాయ అధికారిని ఆదేశించారు.

**రెసిడెన్షియల్ పాఠశాల సందర్శించిన కలెక్టర్..**

సిర్గాపూర్ మండల పరిధిలో భాగంగా కలెక్టర్ పి. ప్రవీణ్య నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతిలు నల్లవాగులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో శానిటేషన్ పరిస్థితి పై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో సానిటేషన్పై ప్రత్యేక దృష్టి సారించి మెరుగుపరచాలని పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బందిని ఆదేశించారు. అంటువ్యాధులు విష జ్వరాలు డెంగ్యూ మలేరియా చికెన్ గున్యా లాంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే ముందుగా సానిటేషన్ సమస్యను మెరుగు పరచాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఇరిగేషన్ డివిజన్ ఈ ఈ సుందర్, డిఈ పవన్ కుమార్, ఏఈ శ్రీ వర్ధన్ రెడ్డి, సిర్గాపూర్ తాసిల్దార్ హేమంత్ కుమార్, రెవెన్యూ శాఖ అధికారులు పంచాయతీరాజ్ శాఖ అధికారులు ,ఇరిగేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందొద్దు

● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**టేక్మాల్, ఆగస్టు 20 (జనం సాక్షి) :** యూరియా కొరత లేకుండా చూస్తామని రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.జిల్లా లో ఎక్కడ యూరియా కొరత లేకుండా అధికారులు ప్రతీ రోజూ క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేయాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం టేక్మాల్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. విక్రయ దారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు స్టాకు నమోదును అధికారులతో కలిసి పరిశీలించారు. కేవలం యూరియా నే కాకుండా నత్రజని ఆధారిత కాంప్లెక్స్ ఎరువులను, నానో యూరియాను కూడా వాడాలని సమృద్ధిగా నిలువలు ఉన్నట్లు తెలియజేశారు. కొద్దిమంది కావాలని వదంతులు సృష్టించడం ద్వారా రైతులు సెప్టెంబర్లో కొనవలసిన యూరియా కూడా ఇప్పుడే కొనడానికి షాపులు దగ్గర రావడంతో రద్దీ పెరుగుతుందని వదంతులు నమ్మవద్దని వచ్చే పది రోజుల్లో ఇంకా 1500 మెట్రిక్ టన్నుల యూరియా మన జిల్లాకు రావడానికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని తెలిపారు. సెప్టెంబర్లో కూడా మన అవసరానికి తగ్గట్టు 4000 మెట్రిక్ టన్నుల యూరియా వ్యవసాయ శాఖ నుండి మన జిల్లాకు తప్పకుండా పంపడం జరుగుతుందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ తెలిపారని కలెక్టర్ చెప్పారు.యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యూరియా రెండు రోజులకోసారి వస్తుందని వారి విస్తీర్ణాన్ని బట్టి మళ్ళీ తీసుకోవచ్చు అని కలెక్టర్ రైతులకు తెలియజేశారు.ప్రతి రైతు అవసరాలను బట్టి కొనుగోలు చేయాలన్నారు. ఒకే షాప్ దగ్గర క్రౌడ్ కాకుండా.... రైతులు ఇబ్బంది పడకుండా యూరియా కొనుగోలు చేసుకునేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సాగుకి సరిపడా యూరియా అమ్మకం పూర్తి అయ్యే వరకు వ్యవసాయ, స్పెషల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాంప్రసాద్, తహసిల్దార్ తులసీరామ్, ఎంపీడీవో రియాజుద్దీన్, పంచాయతీ సెక్రెటరీ రాకేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# లక్ష్మి నరసింహస్వామీ కొనేరుకు పూర్వవైభవం తెస్తాం

● ఆర్కిటెక్చర్ కల్పన



**మాగనూర్, ఆగస్టు 20 (జనం సాక్షి) :** మాగనూర్ మండల కేంద్రంలోని సుప్రసిద్ధ లక్ష్మి నరసింహ స్వామీ ఆలయ కోనేరుకు పూర్వ వైభవం తీసుకు వస్తామని హైద్రాబాద్ ఆర్కి టెక్చర్ కల్పన తెలిపారు. తెలంగాణలోని పురాతన బావులు కోనేరులు సుంద రీకరణ కోసం తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. బుధ వారం స్థానిక లక్ష్మీనర సింహ స్వామి దేవాలయం వద్ద ఉన్న కోనేరును సందర్శించి వివరాలు అడిగి తెలుసుకు న్నారు గతంలో ఎలా ఉండేదో అలా తిరిగి అభివృద్ధి చేసేం దుకు ఔత్సాహికుల సహ యంతో తన వంతు కృషి చేస్తామన్నారు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సూచన మేరకు ఇక్కడికి వచ్చి పరిశీలించి నట్లు తెలిపారు కార్యక్ర మంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్ మక్తల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టా సురేష్ రవికుమార్ ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్ గౌడ్ పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప పెద్దలు దేవేంద్రప్ప ఆలయ పూజారి ప్రభు తదితరులు పాల్గొన్నారు,

# గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**నంగునూరు, ఆగస్టు 20 (జనం సాక్షి) :** నంగునూరు మండలంలోని వినాయక చవితి ప్రశాంతంగా సంతోషంగా జరుపుకోవాలని రాజగోపాల్పేట ఎస్ఐ టి. వివేక్ తెలిపారు.భక్తి శ్రద్ధలతో పండగను జరుపుకోవాలన్నారు, ఇతరులు ఎవ్వరు ఇబ్బంది పడకుండా ముందుగా జగ్రత్త పడాలని అందుకు పోలీసులకు ప్రజలకు మండపం నిర్వాహకులు సహకరించాలన్నారు, పోలీస్ సూచనలు ప్రతి ఒక్కరు ముఖ్యంగా మండపాల నిర్వాహకులు పాటిస్తూ శాంతి భద్రతలను కాపాడే విషయంలో సహకరించాలన్నారు. మండపాల నిర్వాహకులు మండపాలను వేసే ముందు దాని ఎత్తు పొడవు వెడల్పు మరియు విగ్రహాల పూర్తి సైజ్ ముందుగానే పోలీస్ వారికి తప్పకుండా తెలియజేయాలి. మండపాల ఏర్పాటు గురించి ఏ రోజు ఎక్కడ నిమజ్జనం నిర్వహించుచున్నారు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి ట్రాఫిక్ అంతరాయం కలిగే ప్రాంతాల్లో మండపాలు వేయకూడదు. హారతి, లైటింగ్ లాంప్స్,విద్యుత్ ఉపకరణాలు కారణంగా అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా జాగ్రత్తపడాలి. విద్యుత్ ట్రాంఫార్మర్ల వద్ద మండపాలు ఏర్పాటు శ్రేయస్కరం కాదు. మండపాల వద్ద డీజెలకు అనుమతి లేదు. మైకులు స్పీకర్లు మాత్రమే పెట్టుకోవాలి రాత్రివేళ 10 గంటలు దాటాక సౌండ్ పెట్టకూడదు,స్కూల్, కాలేజీ వద్ద అవి పని చేసే సమయంలో సౌండ్ బాక్స్ పెట్టకూడదు మండపాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చెలసుకోవాలి. డిజెలకు అనుమతి లేదు. కమిటీ సభ్యులు మండపాల వద్ద ప్రతిరోజు ఇద్దరైన అందుబాటులో ఉండాలి అసాంగిక కార్యక్రమలు చేయకూడదు, మద్యం సేవించారాదు,జూదం ఆడకూడదు ఉదయం సాయంత్రం



పోలీస్ సిబ్బంది వస్తు పర్యవేక్షణ చేస్తారు,వారికి సహకరించాలి. నిమజ్జనంతో మద్యం సెవిందచకూడదు.డిజెలు పెట్టకూడదు.మండపాల వద్ద అగ్నిప్రమాదల నివారణ కోసం ఫైర్ సేఫ్టీలో భాగంగా ఇసుక బాకీట్లు, డ్రమ్ముల్లో నీళ్ల అందుబాటులో ఉంచుకోవాలి. నిమజ్జనం చేసేందుకు ఉపయోగించే వాహనాల పత్రాలు అన్ని సరిగ్గా ఉండాలి.డ్రైవర్ మద్యం సేవించి ఉండకూడదు.శోభాయాత్ర మధ్యలో బ్రీత్ ఎనైజర్ తో పోలీసులు చెక్ చేయడం జరుగుతుంది. నిమజ్జనం చేసే వాహనాన్ని మాత్రమే గోదావరి,చెరువుల వద్దకు అనుమతి ఇవ్వడం జరుగుతుంది.వేరే వాహనాలు దూరంగా పార్కింగ్ చేసుకోవాలి. మండపాల వద్ద పూజ జరిగే సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు,కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలి.మండపాలను కట్టెలు,ప్లాస్టిక్ పివిసి పైపులతో మాత్రమే వేసుకోవాలి.ఎట్టి పరిస్థితుల్లో ఇనుప పైపులు వాడకూడదని తెలిపారు.

# పండుగలు విద్యార్థుల్లో ఐక్యత, స్నేహ భావాన్ని పెంచుతాయి

● గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రజిని రాగలత



**జడ్చర్ల, ఆగస్టు 20 (జనంసాక్షి) :** తీజ్ వంటి సాంప్రదాయ పండుగలు విద్యార్థుల్లో సాంప్రదాయ చైతన్యాన్ని, ఐక్యత, స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని కోడుగల్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రజిని రాగలత అన్నారు. మండల పరిధిలోని కోడుగల్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థినిలు ప్రిన్సిపాల్ రజిని రాగలత ఆధ్వర్యంలో గురువారం తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. గిరిజన సాంప్రదాయంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రజిని రాగలత మాట్లాడుతూ సంస్కృతి మూలాలను యువతరం మరువకుండా ఉండేందుకు ఇలాంటి వేడుకలు తప్పనిసరిగా నిర్వహించాలని, 9 రోజులు ముందు అత్యంత నిష్ఠతో మొలకల తొట్లను పోసి, దీక్షలో ఉంటూ తీజ్ పండగను వైభవంగా జరుపుకోవడం జరిగిందన్నారు. అనంతరం మొలకల తొట్లను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అనిత, రాజ్యలక్ష్మి, స్వాతి, పార్వతి, సాయి ప్రియ, రాజశ్రీ, అవంతి, సరిత, తాహెర్, మల్లికార్జున్, శశిధర్, అమరేందర్ రెడ్డి, శరణప్ప, కృష్ణయ్య, రవికుమార్, షాహినా పర్వీన్, అనసూయ, ఉమాదేవి గ్రామస్తులు నవీన్ రెడ్డి, సాయి రెడ్డి పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**నంగునూరు, ఆగస్టు 20 (జనం సాక్షి) :** భారీ వర్షాల నేపథ్యంలో వాగుల వద్ద,చెక్ డ్యాం ల వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఇలా కలెక్టర్ కేమావతి అధికారులకి సూచించారు. నంగునూర్ మండలం లో మోయ తుమ్మెద వాగు ఘనపురం గ్రామం, ఖాతా గ్రామంలోని పలు చెక్ డ్యామ్ మరియు లో లెవెల్ వంతెనలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.10 రోజుల నుండి నిరంతరాయంగా నీరు చెక్ డ్యామ్ నుండి ప్రవహిస్తున్నట్లు ఇక్కడ నుండి కోహెడ మండలం మీదుగా లోయర్ మానేరు డ్యామ్లో నీరు చేరుతుందని రెవెన్యూ సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. వర్షపాతం పెరిగితే లోలెవెల్ వంతెన పైనుండి నీరు వెళతాయని ఆ సమయం రాకపోకలు నిలిపివేయాలని ఎల్లపుడు మానిటర్ చెయ్యాలని రెవెన్యూ సిబ్బందికి తెలిపారు. అలాగే వంతెన కింది భాగంలో పైప్లలో గడ్డి తుంగ తొలగించాలని చెత్త చెదారం చేరకుండా చూసుకోవాలని తెలిపారు.

# జ్యోతిబాఫూలే గురుకులం ముందు ధర్నా

● ప్రిన్సిపల్, పీఈటీలను తొలగించాలని డిమాండ్

● ప్రిన్సిపల్ అక్రమాలపై విచారణ జరపాలని విజ్ఞప్తి

**నారాయణఖేడ్, ఆగస్టు 20 (జనం సాక్షి) :** విద్యార్థుల ఆరోగ్యాలు, జీవితాలతో చలగాటమాడుతూ గురుకులాన్ని భ్రష్టుపట్టించిన ఖేడ్ మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ గురుకులం ప్రిన్సిపల్ శ్రీనివాస్ను వెంటనే సస్పెండ్ చేసి అతని అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని బీజేపీ, ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురుకులం ముందు బుధవారం ధర్నా, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ఖేడ్ మండలశాఖ అధ్యక్షులు సిందోల్ దశరత్, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్గౌడ్, ఏబీవీపీ నగర కార్యదర్శి శంకర్లు మాట్లాడుతూ గురుకులం విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టడంలేదని అన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, విద్యార్థులు వ్యాధుల బారిన పడ్డా వారికి చికిత్సలు కూడా అందించడం లేదని అన్నారు. పత్రికల్లో వచ్చాక ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్పందించి విచారణ జరిపి ప్రిన్సిపల్ శ్రీనివాస్ను వెంటనే విధుల్లోంచి తొలగించాలని ఆర్సీవో గౌతంరెడ్డిని ఆదేశించినా ఆర్సీవో ప్రిన్సిపల్తో కుమ్మక్కై చర్యలు తీసుకోకుండా అతణ్ణే విధుల్లో కొనసాగిస్తున్నాడని ఆరోపించారు. ప్రిన్సిపల్ను వెంటనే విధుల్లోంచి తొలగించి అతని అక్రమాలపై



పూర్తిస్థాయిలో విచారణ జరపని పక్షంలో బీజేపీ, ఏబీవీపీ పక్షాన ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని, ఆర్సీవో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల వద్ద డబ్బులు తీసుకుంటూ వారిని కొడుతూ వేధిస్తున్న పీఈటీ పరశురాంను కూడా విధుల్లోంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపల్కు పీఈటీ వత్తాసు పలుకుతూ గురుకులంలోని కొందరు విద్యార్థులతో గ్రూపులుగా తయారు చేస్తూ ఇతర విద్యార్థులపై దాడులకు పురిగొల్పుతున్నాడని అన్నారు. విద్యార్థులందరికీ నాణ్యమైన వైద్యం, భోజనం, విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి సకాలంలో స్పందించి విద్యార్థులకు అండగా నిలవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్, పీఈటీలను వెంటనే విధుల్లోంచి తొలగించాలని కోరారు. బీజేపీ మండల ఉపాధ్యక్షులు అశోక్, నాయకులు భూంరాజ్, రామకృష్ణ, అంజి, ఏబీవీపీ నాయకులు విజయ్, గోవింద్, సిద్ధు, పండరినాథ్, నాని, కిట్టు పాల్గొన్నారు.

# యూరియా కోసం ఆందోళన వద్దు

● జిల్లా కలెక్టర్



**పాపన్నపేట, ఆగస్టు 20 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా లోని రైతులెవరూ యూరియా కోసం ఆందోళన చెందవద్దని కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. బుధవారం పాపన్నపేట మండలం లక్ష్మీనగర్లోని ప్రధానమంత్రి కిసాన్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంటలకు సరిపడ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, సెప్టెంబర్ నెలలో కొనాల్సిన యూరియా ఇప్పుడే కొనడంతో ఆ కేంద్రాల వద్ద రద్దీ ఉంటుందన్నారు. వదంతులను నమ్మవద్దని,అవసరం మేరకు యూరియా కొనాలని రైతులకు సూచించారు. అ కేంద్రాన్ని పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సతీష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి నాగమాధురి, ఏఈవోలు జనార్దన్, రజిత, నాగరాజు, అసిఫ్ తదితరులు ఉన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ విజయేందిరబోయి

**మహబూబ్నగర్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** వర్షకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని,పి.హెచ్.సి.కి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ నవాబ్పేట్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్మన్ గండ్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పి. ఎం. ఏ.వై సర్వే ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పి.హెచ్ సి.లో నిన్న రాత్రి ప్రసవించిన మహిళతో కలెక్టర్ మాట్లాడారు.పి.హెచ్.సిలో వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. పి.హెచ్.సిలో ప్రసవాల గురించి, ఓపి గురించి, మందుల లభ్యత గురించి, సిబ్బంది గురించిన మెడికల్ ఆఫీసర్,వైద్య సిబ్బంది తో మాట్లాడి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మండలంలో డెంగ్యూ కేసులు, సీజనల్ వ్యాధుల గురించి కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ, సీజనల్ వ్యాధులు వర్షాకాలంలో ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో వైద్య సిబ్బంది



అప్రమత్తంగా ఉండాలని గ్రామంలో ఇక ఫీవర్ సర్వే కొనసాగించాలని ఆదేశించారు. నవాబ్ పేట్ మండల కేంద్రంలో నిన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణమంతా తిరిగి పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో వర్షం నీరు నిలిచి ఉండడం గమనించి వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులను పాఠశాలలో బోధన, సబ్జెక్ట్ లలో ఏదైనా ఇబ్బంది ఉందా, సమస్యలు ఉన్నాయా ? అడిగారు.పాఠ్యాంశాలలో ఎటువంటి సందేహాలు ఉన్నా సంబంధిత ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు.ప్రణాళికాబద్ధంగా చదివి వార్షిక పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. గత సంవత్సరం ఎస్.ఎస్.సి లో ఉత్తీర్ణత శాతం,విద్యార్థుల సంఖ్య గురించి అడిగారు. గత సంవత్సరం 86 శాతం ఉత్తీర్ణత సాధించారని, మొత్తం 123 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణ శాతం పెంచాలని, నూరు శాతం ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు పాఠశాలలో విద్యార్థులకు అదనపు టాయిలెట్ లు కావాలని హెడ్ మాస్టర్ కలెక్టర్ ను కోరారు. నవాబ్ పేట్ మండలంలో ఎన్మన్ గండ్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను పి. ఎం. ఏ.వై సర్వే ఏ విధంగా చేస్తున్నారు ప్రత్యక్షంగా పరిశీలించారు. అప్లోఫోటో క్యాప్చరింగ్ చేయటం, ఫేస్ ఆథేంటిఫికేషన్లో చేయటంలో టెక్నికల్ ఇబ్బందులు గమనించారు. సర్వే గురించి తెలుసుకుని త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఎం.పి.డి.ఓ జయరాం నాయక్, తహశీల్దార్ శ్రీనివాస్,మెడికల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, మండల,గ్రామ అధికారులు ఉన్నారు.

# పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**మల్దకల్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** మండల కేంద్రం చెందిన నరసింహ అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. మంగళవారం రాత్రిఇంట్లో భార్యతో గొడవపడి తన అవసరాలు నిమిత్తం అప్పులు చేసుకుని అప్పులఎలా తీర్చాలో మనస్థాపం చెంది మందు తాగాడని గ్రామస్తులు తెలిపారు.చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో తరలించారు.కొంతమంది స్నేహితులు కలిసి దావత్ చేసుకొని అక్కడ మందులోని పురుగుల మందు పోసుకుని తాగినట్లు తెలుస్తుంది.

# అమ్మో..కేబుల్ వైర్లు!

- విద్యుత్ స్తంభాలపై ఇష్టారాజ్యంగా కేబుల్ తీగలు
- అనుమతులు తీసుకోకుండా ఇండ్లపై నుంచి కనెక్షన్లు



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : ఆదిలాబాద్ జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో ఇటూ పట్టణ ప్రాంతాల్లో దారి వెంట ఉన్న కరెంట్ విద్యుత్ స్తంభాలకు ఇప్పుడు కొత్త సమస్య వచ్చి పడింది. స్తంభం కింది నుంచి పై వరకు కుప్పలు తెప్పలుగా పలు రకాల కేబుల్ తీగలు వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఇంట్లో కనెక్షన్ ఇచ్చిన తరువాత మిగిలిన వైర్ ను అలాగే వదిలేసి పోతుండడం కారణంగా ఆ వైర్ స్తంభం కింది వరకు వేలాడుతూ ప్రమాదకరంగా మారింది. కనీసం దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా అంతటా ఇప్పుడు ఎక్కడ పడితే అక్కడ ఈ దృశ్యాలు కనిపిస్తాయి. వాటిలో పలు రకాల ఇంటర్ నెట్ కనెక్షన్ ల పేరుతో కనెక్షన్ లు పెట్టి కేబుల్ వైర్లను స్తంభంకు చుట్టేసి పోవడం, వేలాడదీసి ఉన్న ఆ వైర్లు రోజుల తరబడి అలాగే ఉండడం కారణంగా ఇప్పుడు అవి ప్రమాదకరంగా మారుతున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో స్తంభాలకు తీగలు ఎక్కడ పడితే అక్కడ వెలాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వాటిని చూసి ప్రజలు భయ పడి పోతున్నారు. కేబుల్ తీగలే కాకుండా వాటికి సంబంధించిన సామాగ్రి డబ్బాలను కూడా స్తంభంకు కట్టేసి ఉంచేస్తున్నారు. దీంతో విద్యుత్ స్తంబాలు ఈ కేబుల్ వైర్లతో నిండిపోయి ప్రమాదంగా మారుతుంది. జిల్లాలో వందల కొద్ది స్తంభాలపై ఈ కేబుల్ తీగలు వేలాడుతు దర్శనం ఇస్తున్నాయి. అంతేకాదు కొన్ని రకాల ప్రైవేట్ కంపెనీల ఇంటర్ నెట్ కేబుల్ కనెక్షన్లు కుప్పలు తెప్పలుగా వచ్చి పలు కాలనీల్లో ఇంటి యజమానుల ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే వారి ఇళ్లకు వైర్లు తగిలిస్తూ, ఇళ్ల పైనుంచి కొన్ని కిలో మీటర్ల మేర ఈ కేబుల్ తీగలను వేలాడదీసి రోజుల తరబడి ఉంచేస్తున్నారు. కారణంగా ఈ తీగలను చూసి ప్రజలు భయ పడి పోతున్నారు. ఈ తీగలను ఎవరు పెడుతున్నారో ఎప్పుడూ వచ్చి పెడుతున్నారో అర్థం కాకుండా ఉంది. కనీసం ఈ సమస్య ఎవరికీ చెప్పుకోవాలో కూడా అర్థం కాకుండా పోతుంది. రోజు రోజుకు ఈ సమస్య మరింత ఎక్కువైపోతోంది. అయినప్పటికీని ఈ సమస్యను ఇంతవరకు ఎవరూ గుర్తించక పోవడం గమనార్హం. ఏ ప్రమాదం జరగక ముందే జిల్లా సంబంధిత అదికారులు ప్రజలకు ముప్పు కల్గించే విదంగా ఉండే కుప్పలు తెప్పలుగా వేలాడదీసి ఉన్న ఈ కేబుల్ నెట్ కనెక్షన్ తీగల పట్ల దృష్టి సారించి వాటిని విద్యుత్ స్తంభాలకు అమర్చకుండా తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## శాంతియుత వాతావరణంలో
# గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ బ్యూరో, ఆగస్టు20 (జనంసాక్షి) : నిర్మల్ జిల్లాలో గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాల పై పీస్ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణ పై హిందూ, ముస్లిం ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలు సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలవాలని, ప్రతి ఒక్కరు స్నేహపూర్వకంగా జరుపుకోవాలని కోరారు. ప్రజల ఆచార సంప్రదాయాలకు భంగం కలగకుండా ఉత్సవాలు జరగాలని సూచించారు. ప్రతిష్ఠాపనలు, నిమజ్జనం సహా అన్ని కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ముగియాలని తెలిపారు. జిల్లా, డివిజన్ స్థాయిలో అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మల్, బైంసా, ఖానాపూర్ పట్టణాల్లో రూట్‌ల వారీగా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ మండపం వద్ద సీసీ కెమెరాలు అమర్చాలని, శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగాలని సూచించారు. కేబుల్ వైర్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. నిమజ్జనం జరిగే రూట్లలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట్ల క్రేన్‌లను సిద్ధం చేయాలని సూచించారు. నిర్మల్, బైంసా, ఖానాపూర్ పట్టణాల్లో నిమజ్జన ప్రాంతాలను అధికారులు ముందుగానే పరిశీలించాలని, అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీ, వైద్య ఆరోగ్య, విద్యుత్ తదితర విభాగాలు పరస్పర సమన్వయంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల విషయంలో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడతారని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక బందోబస్తు ఉంటుందని స్పష్టం చేశారు. ఉత్సవాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఉత్సవాలు మరింత సాఫీగా జరిగేలా ప్రజలందరూ పోలీసులకు సకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఏఎస్పీ అవినాష్ కుమార్, రాజేష్ మీనా, బైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ అనంతరావు పటేల్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

- అధికార యంత్రాంగం, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



కాళేశ్వరం , ఆగస్టు 21 (జనం సాక్షి) : కాళేశ్వరం వద్ద గోదావరి నది నీటి మట్టం పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాళేశ్వరం లో గోదావరి, సరస్వతి ఘాట్ల వద్ద వరద ఉధృతిని ఎస్పి కిరణ్ ఖరే తో కలిసి పరిశీలించారు. బుధవారం ఉదయం 7 గంటలకు సిడబ్ల్యూసి నివేదిక ప్రకారం 12.220 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజల ప్రాణ రక్షణలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నది పరివాహక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ముందుగానే సమాచారం అందించడంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులలో సేవలు అందించడానికి ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అత్యవసర సేవలకు కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన 9030632608 నంబర్ కు కాల్ చేయాలని ఆయన సూచించారు. వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. నదీతీర ప్రాంతాలకు వెళ్లరాదని, వరద నీటిలో వాహన ప్రయాణాలు చేయరాదన్నారు. ఎగువ ప్రాజెక్టు ల నుండి వరద వస్తున్నందున ఎప్పటికప్పుడు వరద సమాచారం ప్రజలకు చేరవేస్తూ అప్రమత్తం చేయాలని, ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం అన్నారం వెళ్ళు రహదారిలో చంద్రుపల్లి వద్ద కాజ్ వే పై నీళ్లు చేరిన ప్రాంతాన్ని పరిశీలించారు. పూర్తిగా నీరు తగ్గే వరకు ప్రజలు ప్రయాణాలు చేయకుండా బారికేడ్లను కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- మంచిర్యాల ట్రాన్స్ కో ఎస్ఈ ఉత్తమ్



బెల్లంపల్లి, ఆగష్టు 20 (జనంసాక్షి) : వినాయక చవితి సందర్బంగా విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల ట్రాన్స్ కో ఎస్ఈ ఉత్తమ్ ఆదేశించారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని కాంపౌండ్ లో బెల్లంపల్లి డివిజన్ విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న వినాయక చవితి పండుగ సందర్భముగా గణేష్ విగ్రహాల తరలింపు మమ్మురంగా జరుగుతుందని విద్యుత్ అధికారులు అప్రమమతంగా ఉండాలని ఆదేశించారు. విగ్రహాలు తరలించే రహదారుల్లో విద్యుత్ నెట్వర్క్ పరంగా ఎలాంటి లోపం లేకుండా చూడాలన్నారు. వినాయక విగ్రహాల తయారీ కేంద్రాలను సందర్శించాలని, ప్రమాదభరితంగా ఉన్న లైన్ ల ఎత్తు పెంచాలని అన్నారు. ఎత్తుగల విగ్రహాల తరలింపు సమయంలో లైన్లకు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గణేష్ విగ్రహాల తరలింపులో, మండపాల్లో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని మండప నిర్వాహకులకు, భక్తులకు సూచించారు. భక్తులు, మండప నిర్వాహకులు మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలని కోరారు. విగ్రహాల తరలింపులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విగ్రహాల ఎత్తుని బట్టి రూట్ ని నిర్ణయించుకోవాలని, ఒకవేళ ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలపాలన్నారు. విద్యుత్ లైన్ల నుంచి కనీసం రెండు అడుగుల దూరం పాటించాలన్నారు. లైన్ లో ప్రవహించే విద్యుత్ సరఫరా ప్రభావం / ఇండక్షన్ ఉంటుందన్నారు. ఎత్తైన మెటల్ విగ్రహాల తరలింపులో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. మెటల్ ఫ్రేమ్ లతో కూడిన డెకొరేషన్ లను వీలైనంత మేరకు తగ్గించాలన్నారు. గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాలకు విద్యుత్ సరఫరా కనెక్షన్ కోసం సామాన్యులు స్తంభాలు ఎక్కవద్దన్నారు. సంస్థ సిబ్బంది ద్వారానే విద్యుత్ కనెక్షన్ పొందాలన్నారు. ఐఎస్ఐ మార్క్ కలిగిన ప్రామాణిక విద్యుత్ వైర్లను మాత్రమే వాడాలన్నారు. జాయింట్ ఉన్న వైర్లు వాడవద్దన్నారు. తగినంత కెపాసిటీ కలిగిన ఎంసీబీ తప్పనిసరిగా వాడాలని సూచించారు. పోల్ ల పైన ఉన్న టివి కేబుల్ వైర్లు , ఇంటర్నెట్ కేబుల్ వైర్లు తొలగించమని కేబుల్ ఆపరేటర్లకు, ఇంటర్నెట్ ఆపరేటర్లకు సమావేశాలు నిర్వహించి ఆదేశాలు ఇచ్చామని, అవి అత్యంత ప్రమాదభరితంగా ఉన్నాయని, వాటివల్ల విద్యుత్ ప్రమాదాల జరుగుతున్నాయని, విద్యుత్ అధికారులతో సమన్వయం చేసుకొని అందుకు అనుగుణంగా కేబుల్ వైర్లను రీఅలైన్మెంట్ చేసుకోవాలని కోరారు. రీఅలైన్మెంట్ చేసుకోకుంటే తొలగించాలని ఆదేశించారు. చిందరవందరగా ఉన్న కేబుల్ వైర్లు ఉండటం చేత విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, మొదట ప్రజల భద్రత, ప్రాణాలు ముఖ్యమని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించే పరిస్థితి లేదని, చక్కగా ఒక పద్ధతి ప్రకారం కేబుల్ వైర్లు అమర్చుకోవాలని సూచించారు. విద్యుత్ లైన్స్ ఎక్కడైనా తెగి పడ్డా, ఇతర అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు వెంటనే 1912 కు గాని సమీప ఫ్యూజ్ ఆఫ్ కాల్ కు కాల్ చేసి విద్యుత్ సిబ్బందికి తెలపాలన్నారు. అనంతరం పట్టణంలోని గాంధీ నగర్‌లో గల వినాయక తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈకార్యక్రమంలో బెల్లంపల్లి ట్రాన్స్ కో డీఈ రాజన్న, ఎడిఈలు, ఏఈ లు, సబ్ ఇంజినీర్ లు పాల్గొన్నారు.



# కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- టోల్ ఫ్రీ నెంబర్ల ఏర్పాటు...

వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 20 (జనంసాక్షి): జిల్లాలో యూరియా కొనుగోలు, ఇతర సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన కాల్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సౌకర్యం ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ 18004253424 టోల్ ఫ్రీ నెంబర్, 0870-2530812 , 9154252936 ఫోన్ నెంబర్లు జిల్లాలోని ప్రతి ఎరువుల విక్రయ దుకాణాల వద్ద ప్రదర్శిస్తామని, యూరియా కొనుగోలు ప్రక్రియ, ఇతర సమస్యలను పై నంబర్లకు సంప్రదించి పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.

# హిమాలయన్ ట్రయల్ పర్వతం అధిరోహణే లక్ష్యం

- రాష్ట్ర ప్రభుత్వ సహకారం బాగుంది
- మౌంటైనర్ హరీశ్



మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 20 (జనం సాక్షి): దిగ్రేట్ హిమాలయన్ ట్రయల్ పర్వతాన్ని హరీష్ మౌంటైనర్ అధిరోహించనున్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని పిల్లిగుండ్ల తండా వాసి నిరుపేద గిరిజన కులానికి చెందిన గూగులోతు విజయ కిషన్ దంపతుల కుమారుడు హరీష్ మౌంటైనర్ దామరవంచ గిరిజన గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తరుణంలో రాక్ క్లైంబింగ్ సాహస క్రీడల గురించి వార్తాపత్రికల్లో చదివి టివి ఛానల్స్ ద్వారా ఆకర్షితుడయ్యాడు. శిక్షణ కోసం భువనగిరిలోని రాక్ క్లైంబింగ్ స్కూల్‌లో ట్రైనింగ్ తీసుకున్నాడు. ప్రాథమిక రాక్ క్లైంబింగ్ కోర్సు పూర్తిచేసి ఇంటర్మీడియట్ రాక్ క్లైంబింగ్ కోర్సు చేసి మొదటి స్థానం సాధించాడు. పర్వతారోహణ శిక్షణ కోసం సిక్కింలోని ఇండియన్ హిమాలయన్ టూరిజం సెంటర్ అకాడమీలో శిక్షణ తీసుకున్నాడు. పర్వతారోహణ కోర్సు పూర్తి చేసి బెస్ట్ రోప్ లో గోల్డ్ మెడల్ అవార్డును సాధించారు. గుజరాత్ ప్రభుత్వ ఇన్స్టిట్యూట్, స్వామి వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ రాక్ క్లైంబింగ్ కోర్సు ను పూర్తి చేశాడు. అడ్వాన్స్‌డ్ రాక్ క్లైంబింగ్ కోర్సులో 3 బంగారు పతకం తో పాటు 3 కాంస్య పతకాలు సాధించాడు. ఉత్తమ ట్రైనీ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా గుగులోత్ హరీష్ మౌంటైనర్ మాట్లాడుతూ నేపాల్ దేశంలోని మౌంట్ చ్చుకుంగిరి, మౌంట్ కాలపత్తర్, మౌంట్ ఆమదబ్లం, మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంపు శిఖరాలను అధిరోహించి నామ్చే నుండి నామ్చే వారు మూడు దేశాల సరిహద్దు ప్రాంతం 4 పర్వతాలను అధిరోహించి ప్రపంచం లోని భారత దేశ గౌరవాన్ని చాటాలని నేపాల్ దేశంలోని అత్యంత పొడువైన ధి గ్రేట్ హిమాలయన్ ట్రయిల్ 1700 కిలో మీటర్లు పర్వతంను ఎక్కే రికార్డు సృష్టించే తొలి తొలి భారతీయుడిగా చరిత్రలో నిలిచిపోవాలని మౌంటైనర్ హరీష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మౌంటైనర్ లను సహాయ సహకారాలు అందించాలని దేశంలోనే రాష్ట్ర ఖ్యాతిని నిలిపే విధంగా కృషి చేస్తామని వారు అన్నారు.

# దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 20 (జనం సాక్షి) : జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల పనులు త్వరగా చేపట్టి పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని భీమారం మండలం పరిధిలో గల బూరుగుపల్లి నుండి దాంపూర్ కు వెళ్లే దారిలో గర్రెపల్లి సమీపంలో దెబ్బతిన్న రహదారిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, ఉపతహసిల్దార్ అంజమ్మ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులను పరిశీలించి పనులు చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్ష పరిస్థితుల నేపథ్యంలో ప్రజారక్షణ దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, నది తీరాలకు ఎవరు వెళ్లకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించడం జరిగిందని తెలిపారు. అత్యవసర సేవలకు నిమిత్తం 90 మంది సభ్యులతో కూడిన 3 ఎస్‌డిఆర్ఎఫ్. బృందాలు, రక్షణ పరికరాలతో సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారంతో పాటు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు, ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులు వినియోగించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జూనియర్ కళాశాల వరకు నవీకరించిన నేపథ్యంలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ ప్రతినిధి,ఆగష్టు 19 (జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లాలో డీలర్లు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని ఇందిరాగాంధీ సెంటర్ వెంకటేశ్వరఎరువులు దుకాణం సాలార్ తండ ప్రాంతాలలోని ఫర్టిలైజర్ షాపులను, మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజి, కురవి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను, గోడౌన్ ల లోని ఎరువుల నిల్వలను జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా పంపిణీపై రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేయాలని రైతులను ఇబ్బంది పెడితే లైసెన్సులను రద్దు చేసి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు, స్టాకు నమోదును అధికారులతో కలిసి పరిశీలించారు. ఎరువుల రైతులతో మాట్లాడారు ఎరువుల గురించి ఆందోళన చెందరాదని సమృద్ధిగా నిలువలు ఉన్నట్లు తెలియజేశారు. యూరియాను కొనుగోలు చేసేటప్పుడు రైతులు భూమి వివరాలు ఆధార్ కార్డును పరిశీలించి ఇవ్వవలసిందిగా వ్యాపారస్తులకు సూచించారు ఆన్లైన్ విధానం ఓపి ఎంఎస్ ద్వారా మాత్రమే యూరియాను పంపిణీ చేయాలన్నారు. అనవసరంగా కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే అధిక ధరలకు విక్రయించిన అక్రమ నిలువలు చేసిన శాఖపరమైన చర్యలు తీసుకొని లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని వారు హెచ్చరించారు.

# 3వ రోజు కొనసాగిన ఎమ్మెల్యే నిరాహార దీక్ష




కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 20 ( జనం సాక్షి) : కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వయ హరీష్ బాబు చేస్తున్న నిరవధిక నిరాహార దీక్ష బుధవారం నాటికి 3 వ రోజుకు చేరుకుంది. జీవో నెంబర్ 49 రద్దు చేయాలని, బోర్ రైతుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. ఎమ్మెల్యే చేస్తున్న దీక్షకు పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా హాజరై మద్దతు తెలిపారు. వీరిలో మంచిర్యాల జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు వెరవెల్లి రఘునాథ్, ఆసిఫాబాద్ నియోజవర్గ నాయకులు కేసరి ఆంజనేయులు గౌడ్ ఉన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 21 ఆగస్టు 2025

## నాణ్యతా ప్రమాణాలు లేని వాటర్‌ప్లాంట్‌లపై కఠిన చర్యలు తీసుకుంటాం..

- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్



**జమ్మికుంట, ఆగస్టు 20 (జనం సాక్షి) :** ప్రజలకు అనువుగా ఉండేందుకు మున్సిపాలిటీ పరిధిలో వాటర్ ప్లాంట్ లను ఏర్పాటు చేసుకున్నారని, కాని వాటర్ ప్లాంట్ యజమానులు నాణ్యత ప్రమాణాలు లేకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అట్టి వాటర్ ప్లాంట్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. బుధవారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని జయశ్రీ వాటర్ ప్లాంట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.డబ్బులు ఇచ్చి రోగాలను తెచ్చుకుంటున్నామని ఇటువంటి వాటిపై కటిన చర్యలు తీసుకుంటామని మున్సిపాలిటీ పరిధిలో 25 వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయని వాటిని తనిఖీ చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ లు మహేష్, సదానందం, ఈఈ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పేదవారి సొంత ఇంటి కలను నెరవేర్చాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 20 (జనంసాక్షి) :** పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చువిధంగా హౌజింగ్ సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.బుధవారం కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హత గల పేదవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరై ప్రొసీడింగ్ అందుకున్న వారు 45 రోజులలో గ్రౌండింగ్ పూర్తి చేయాలని అన్నారు.అలా ప్రారంభం చేయకపోతే వారి ఇండ్లను రద్దు చేసి అవసరం ఉన్న వారికి కేటాయించాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి ఆసక్తి లేని వారిని గుర్తించి, అట్టి వాటిని వేరే వారికి కేటాయించాలని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సిద్ధార్థ, హెడ్ ఆఫీస్ ఎస్సీ బలరాం, డిఈలు జబ్బర్, జంగయ్య, ఏఈలు మూర్తి, సాయిరాంరెడ్డి,రాంబాబు, హౌసింగ్ ఇన్స్పెక్టర్ అబ్దుల్లా, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రతలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

- తక్షణ సహాయంగా 50 వేలు



**మునగాల, ఆగస్టు 20 (జనంసాక్షి) :** పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతలకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే వ్యాధులను అరికట్టవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తాడ్వాయి గ్రామంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామంలోని వీధులను, మురికి కాలువలు, ఇంటి ముందు ఇంకుడు గుంట లేకుండా వాడుకున్న నీరు రోడ్లపై ప్రవహించటం కలియ తిరిగి పరిశీలించారు. జ్వరంతో ఇబ్బంది పడి తగ్గిన వ్యక్తితో.. ఆరోగ్యం ఎలా ఉంది..? ఏ హాస్పిటల్‌లో చూపించుకున్నావు..? అని అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మంది గ్రామ పంచాయతీ సిబ్బందిని ఉపయోగించుకొని ప్రతి బజారులో జేసిబిల ద్వారా పిచ్చి మొక్కలను తొలగించాలని, ప్రతి బజారులో డెమోపాస్ స్ప్రే, బ్లీచింగ్ వెదజల్లాలని, ఫాగింగ్ చేయాలని ఎంపిడిఓను ఆదేశించి తక్షణ సహాయం కొరకు 50వేల రూపాయల చెక్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ రమేష్ దీన్ దయాల్, వైద్యులు శ్రీశైలం, వినయ్, వైష్ణవి, పంచాయతీ కార్యదర్శి రాము, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరక్షరాస్యులను విద్యావంతులుగా చేయడమే లక్ష్యం




**షాబాద్, ఆగస్టు 20 (జనం సాక్షి) :** గ్రామాలలో 15 సంవత్సరాలు నిండి విద్య అభ్యసించని వారిని గుర్తించి వారికి విద్య ను అందించడమే ముఖ్య ఉద్దేశమని మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ అన్నారు. బుధవారం నవభారత్ సాక్షారాత కార్యక్రమంలో భాగంగా విలేజ్ రిసోర్స్ పర్సన్స్ లకు మండల స్థాయి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... గ్రామంలో 15 సంవత్సరాలు దాటిన నిరక్షరాశులను గుర్తించి వారి పేర్లను ఆన్లైన్లో చేర్చడం జరిగిందని అన్నారు. ప్రతి పదిమంది నిరక్షరాశులకు ఒక స్వచ్ఛంద విద్యా వాలంటరీని నియమిస్తామన్నారు. ప్రతి నెల 25 తేదీన గ్రామస్థాయిలో విద్యా వాలంటరీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఇప్పటివరకు మండలంలో 1600 మంది నిరక్షరాశులను గుర్తించామన్నారు. ఆరు నెలల లోపు వీరందరికీ చదవటం, రాయటం, అంకెలు గుర్తించడం నేర్పిస్తామని అన్నారు. సాయంత్రం సమయంలో పాఠశాల, అంగన్వాడి, డ్వాక్రా భవనం, లేదా గుడి, గ్రామపంచాయతీ భవనాలలో విద్యను బోధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం కు సంబంధించిన మాడుల్స్ బోధన సామాగ్రిని గ్రామస్థాయికి పంపించడం జరిగిందన్నారు. రంగారెడ్డి జిల్లా వయోజన విద్యా డైరెక్టర్ నాగలక్ష్మి సందర్శించి శిక్షణ తీరు పట్ల సంతృప్తి వ్యక్త పరిచారు. జిల్లాలో 70000 వేల మంది నిరక్షరాశులను గుర్తించి 40000 మందిని ఈరోజు వరకు ఆన్లైన్లో చేర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ కోఆర్డినేటర్ ఆనందకుమార్, రిసోర్స్ పర్సన్స్ సింహాద్రి నాయుడు, ఆంజనేయులు మరియు ఉపాధ్యాయులు, విద్య వాలంటరీలు పాల్గొన్నారు.

# అభివృద్ధి ఒకవైపు..నిర్వాసితుల భవిష్యత్తు మరోవైపు..

- నగదు పరిహారం సరిపోదు..సమగ్ర పునరావాసమే సరైన పరిష్కారం
- సింగరేణి ఏరియాలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలి
- ఇండస్ట్రియల్ ఏరియాలో ఉచిత విద్య వైద్యం అందించాలి
- యువతకు స్వయం ఉపాధి కోసం శిక్షణ ఇచ్చి రుణాలు అందించాలి



**మణుగూరు, ఆగస్టు 20 (జనంసాక్షి) :** అభివృద్ధి పేరిట ఉపరితల గనులు, పరిశ్రమలు ఏర్పడుతున్నాయి. అయితే వాటి కోసం వేలాది కుటుంబాలు తమ పుట్టినిల్లులు, పచ్చని పంట పొలాలు, పండించే భూములు కోల్పోతున్నారు. భూమి కోల్పోయి నిర్వాసితులైన వారి జీవితాలు చీకటిలో మునిగిపోతున్నాయి. సరైన నష్టపరిహారం లభించకపోతే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది. అభివృద్ధి మాటున అనారోగ్యానికి స్థానిక ప్రజలు గురవుతున్నారు ఉపరితల గని ఏర్పాటు చేయటం వల్ల రాష్ట్రానికి ,దేశానికి సంపద పెరగవచ్చు కానీ స్థానికులకు తక్కువ నష్టపరిహారం చెల్లించి జీవితాంతం ఆర్థికంగా ,ఆరోగ్యపరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు..

### రైతులకు తీవ్ర నష్టం

ఈ ప్రాంతంలో ఉపరిత గాని విస్తరించటం వల్ల పచ్చని పంట పొలాలు కనుమరుగవుతున్నాయి పక్కన ఉన్న భూములు సారం తగ్గిపోతుంది పంట దిగుబడి తగ్గి రైతన్నకు నష్టం వాటిల్లుతుంది నీటి నిల్వలు తగ్గిపోతాయి చెట్లు కొండలు, గుట్టలు అడవులు నాశనం అవుతున్నాయి వాయు, గాలి, నీరు కాలుష్యంతో నిండిపోతుంది ఉపరితల గనుల చుట్టుపక్కల ఉన్న మనుషులకు జంతువులు కాలుష్య కోరల్లో చిక్కుకొని అనారోగ్యానికి గురవుతున్నారు. అభివృద్ధి అనేది కేవలం ఆదాయాన్ని పెంచవచ్చేమో కానీ ఆరోగ్యాన్ని తెచ్చి పెట్టలేదు. జీవితకాలం ఆదాయాన్నిచ్చే సాగుభూమి కోల్పోవడం వల్ల నిర్వాసితులకు తీవ్ర నష్టం వాటిని వాటిల్లుతుంది. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయి అది ఆచరణలోకి వచ్చేసరికి అధికారులు పట్టించుకోని పరిస్థితి ఏర్పడుతుంది.

### కాలుష్యం కోరల్లో ప్రజాజీవనం

ఉపరితల గని వల్ల పర్యావరణం ఆరోగ్యం రెండింటి పై ప్రభావం చూపుతుంది. దుమ్ము, ధూళి కాలుష్యం వల్ల శ్వాసకోస సమస్యలు ఊపిరితిత్తుల వ్యాధి, క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కలుషిత నీరు తాగడం వల్ల అజీర్ణం కడుపు నొప్పులు విరోచనాలు చర్మవ్యాధులు కిడ్నీ సంబంధిత వ్యాధులు వస్తాయి. శబ్ద కాలుష్యం వల్ల వినికిడి లోపం తగ్గటం రక్తపోటు నిద్రలేమి మానసిక ఒత్తిడి లాంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వీటితోపాటు గుండె సంబంధిత వ్యాధులు నరాల బలహీనత క్యాన్సర్ లాంటి దీర్ఘకాలిక జబ్బులతో ప్రాణం నష్టం జరుగుతోంది.

### పరిష్కార మార్గాలు

భూ నిర్వాసితులకు నష్టపరిహారాన్ని నగదు రూపంలో కాకుండా సాగు భూమి కోల్పోయిన వారికి సార వంతమైన భూమి ఇవ్వాలి. నగదు ఇస్తే ఖర్చువుతుంది భవిష్యత్తు కు ఉపయోగం ఉండదు. నిర్వాసితులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి (కనీసం ఒక్కరికి). స్వయం ఉపాధి కోసం శిక్షణ ఇచ్చి రుణాలు అందించాలి.

### ఉచిత విద్య వైద్యం స్కాలర్షిప్ అందించాలి

నష్టపరిహారం నగదు రూపేనా కాకుండా ఇన్సూరెన్స్ లేదా నెలవారి భృతి ఇవ్వటం వల్ల జీవితకాలం ఆర్థిక భద్రత ఉంటుంది. వైరా రిజర్వాయర్ ను పర్యాటకంలో ఉన్నతంగా తీర్చిదిద్దాలి. పర్యటకుల అవసరాలు, బోటింగ్, వసతుల కల్పనలకు చర్యలు. మత్స్యకారుల జీవనోపాధికి చేపలు అందించేందుకు చర్యలు చేపట్టాలి.

## జిల్లాను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



**వైరా, ఆగస్టు 20 (జనంసాక్షి) :** పర్యాటక ప్రాంతాలలో మౌళిక వసతుల ఏర్పాటుతో, పర్యాటకంలో జిల్లాను ఉన్నతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం వైరా కేంద్రంలోని రిజర్వాయర్ పర్యాటక ప్రాంతాన్ని కలెక్టర్ సందర్శించారు. రిజర్వాయర్ ఆనకట్ట సమీపంలోని పర్యాటక ప్రాంతం గుట్టలను, బోటింగ్ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. కావాల్సిన మౌళిక వసతుల ఏర్పాటు గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆనకట్ట సమీపంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మత్స్య విత్తన క్షేత్రం ను కలెక్టర్ అనుదీప్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మత్స్య శాఖ విత్తన కేంద్రంలో మౌళిక వసతులను పరిశీలించారు. మత్స్యశాఖ విత్తన కేంద్రంలో పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట మత్స్య శాఖ ఏడీ శివప్రసాద్, జిల్లా టూరిజం శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, వైరా తహసిల్దార్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ వేణు, అధికారులు, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 20 (జనంసాక్షి) :** విద్యార్థులకు ఇంటరాక్టివ్ డిజిటల్ లెర్నింగ్ కు దోహదపడే ఖాన్ అకాడమీ పోర్టల్ లోని విషయాన్ని జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరూ భాగస్వామ్యం అయ్యేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. గణిత, భౌతిక శాస్త్రం,జీవశాస్త్ర కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్‌లకు టిఎస్ఎంఎస్ ఇమాంపేట నందు నిర్వహించబడిన కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం ఆన్ లెర్నింగ్ అవుట్ కమ్స్ మీద నిర్వహించబడిన శిక్షణ కార్యక్రమంని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. మోడల్ స్కూల్ విద్యార్థులతో సమావేశమై గత సంవత్సర ఎస్ఎస్సీ,ఇంటర్ ఫలితాలలో విజయం సాధించి నగదు బహుమతి పొందిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు తెలిపి, మోడల్ స్కూల్ ను జిల్లా రాష్ట్రస్థాయిలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి అశోక్, క్వాలిటీ కోఆర్డినేటర్ జనార్ధన్,జిల్లా రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

## మానేరు జలాలకు పూజలు నిర్వహించిన జిల్లా కలెక్టర్



**గంభీరావుపేట, ఆగస్టు 20 (జనం సాక్షి) :** గంభీరావుపేట మండలంలోని నర్మాల వద్ద ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్ట్ పూర్తిగా నిండడంతో బుధవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి మానేరు జలాలకు పుష్పాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్, డీఈ నర్సింగం, డి.వి.హెచ్.ఓ. రవీందర్ రెడ్డి, తహసిల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు అరికట్టాలి



**హాలియా, ఆగస్టు 20 (జనం సాక్షి) :** ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు వారి పరిధిలోని పాఠశాలలు, హాస్టళ్లను రెగ్యులర్‌గా సందర్శించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా, హాలియా 30 పడకల ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన ఆసుపత్రి భవన నిర్మాణం పనులు పరిశీలించారు. అనంతరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఛాంబర్ లో ఓపి, ఏఎన్ సి, మందులు, ఇతర రిజిస్టర్ లను పరిశీలించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృనాయక్, డిప్యూటీ డిఎంహెచ్ఓ రవి, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామకృష్ణ, తహసిల్దార్ ,ఎంపీడీవో, ఇతర మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



**భద్రాచలం, ఆగష్టు 20 (జనంసాక్షి) :** భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తున్నది. భద్రాచలం లకు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉపనదులు పొంగి ప్రవహించటం అదేవిధంగా కాళేశ్వరం వద్ద కూడా ప్రమాద స్థాయి దాటి గోదావరి నది ప్రవహించడంతో మరోసారి గోదావరి నదికి భారీ స్థాయిలో వరద చేరుకుంటుంది. మంగళవారం సాయంత్రం 36. 30 అడుగులకు తగ్గిన గోదావరి తిరిగి రాత్రి ఉదృతంగా పెరుగుతూ బుధవారం 8 గంటల 15 నిమిషాలకు 43 అడుగులకు చేరుకోవటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమై మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసి సహాయ కార్యక్రమాల్లో నిమగ్నలైంది.

## ఆలూరులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 20 (జనం సాక్షి) :** నిజామాబాద్ జిల్లా ఆలూరు మండలంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా పరిషత్ హై స్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సహకార సంఘం ఎరువుల గోడౌన్, తహసీల్దార్ కార్యాలయాలను కలెక్టర్ సందర్శించారు. ముందుగా కల్లడి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పీ.హెచ్.సీ ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను, అందుబాటులో ఉన్న ఔషధ నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. ఆలూరులో నూతనంగా చేపడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం పనులను కలెక్టర్ పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ ఎం.గంగాధర్, స్థానిక అధికారులు ఉన్నారు.

# కారు దొంగల అరెస్ట్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (జనం సాక్షి) :** 2025 జూలై 18 న ఉప్పల్వాయి ప్రశాంత్ గౌడ్ తండ్రి వెంకటేష్ గౌడ్,, కామారెడ్డి పిఎస్ మాచారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసిందేమిటంటే ఇయాజ్ అను వ్యక్తి అతని అనుచరులైన మరో ఆరుగురు వ్యక్తులతో కలిసి ఫేస్బుక్ ఆన్లైన్ అప్లికేషన్ ద్వారా కార్లు అమ్ముతామని నమ్మించారు. సెల్ఫ్ డ్రైవింగ్ కోసం కార్లను కిరాయికిచ్చే వ్యక్తుల నుండి కార్లు కిరాయికి తీసుకుని వాటి నెంబర్ ప్లేట్ మార్చి ఫేక్ నెంబర్ ప్లేట్ పెట్టి కార్ల ఓనర్ల పేరుతో డూప్లికేట్ ఆర్‌సి, డూప్లికేట్ ఆధార్ మరియు ఇతర కార్డులు తయారు చేశారు. కార్లను అమ్మి లక్షలలో డబ్బులు తీసుకుని మరల ఆ కార్లను దొంగిలించి తిరిగి ఆ కార్లను ఓనర్లకు ఇచ్చివేసి అమాయక ప్రజలను మోసం చేస్తూ ఫోన్ నెంబర్‌లను మారుస్తూ తప్పించుకు తిరుగుతున్న ఏడుగురు వ్యక్తులు కలిగిన గ్యాంగ్‌ను ఛేదించారు. ఈ కేసులో ఎస్పీ కామారెడ్డి ఉత్తర్వుల మేరకు ఏఎస్‌పి. కామారెడ్డి టీమ్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతంగా చేసి పరారీలో ఉన్న ఆరుగురు నిందితులను పట్టుకొని కేసును ఛేదించారు.

### నిందితుల వివరాలు

ఏ1 మహమ్మద్ ఇయాజ్, తండ్రి మహమ్మద్ ఇంహజ్, వయస్సు: 26 నివాసం:గోపినగర్, శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డి జిల్లా, ఏ2 మహమ్మద్ జాహీద్ అలీ, తండ్రి : గౌసుద్దీన్, వయస్సు : 40 నివాసం : శాంతినగర్ కాలనీ, హైదర్ షా కోటె, రంగారెడ్డి జిల్లా ప్రస్తుత నివాసం ఇంటి.నెం. 2బి3బి590/ఏసి, వేంకటేశ్వర కాలనీ, అలంపల్లి, వికారాబాద్, ఏ3 పృథ్వీ జగదీష్,తండ్రి:మదన్ మోహన్రావు, వయస్సు : 21నివాసం: రామచంద్రాపురం, సంగారెడ్డి, ఏ4 రాచర్ల శివకృష్ణ, తండ్రి:రవీంద్రనాథ్, వయస్సు:22 నివాసం:కొత్తవాడ, హనుమకొండ మండలం, వరంగల్ జిల్లా, ప్రస్తుతం: బీరంగూడ, రామచంద్రపురం, పటాన్ చెరువు, సంగారెడ్డి జిల్లా, ఏ5 కర్ణకోట సాకేత్,తండ్రి:బుచ్చిరాములు, వయస్సు: 21 నివాసం: శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డి, ఏ7 వేములమాడ వివేక్, తండ్రి: శ్రీనివాస్, వయస్సు:24, నివాసం:రామచంద్రపురం మండలం, సంగారెడ్డి, ఏ6. ఆలీ పరారీలో ఉన్నాడు.

### స్వాధీనపరచుకున్న సొత్తు వివరాలు


ఇనోవా కారు ఒక ల్యాప్ టాప్ ఎర్టిగా కారు మైక్రో సిమ్ కార్డులు, బాలెనో కారుఏం టి చిప్ కార్డ్ లు మొబైల్ ఫోన్‌లు ఫోర్జరీ చేసిన ఆర్‌సిలు కారు జిపిఎస్ పరికరము పై తెలిపిన వాటిని స్వాధీన పరచుకుని ఆరుగురు నిందితులను అరెస్ట్ చేయనైనది.

ఈ నేరస్తులు ఇంతకు ముందు శంకర్పల్లి మంచాల ,అంబార్ పేట్ రామచంద్రపురం, చందానగర్, మియాపూర్, అత్తాపూర్ పోలీసు స్టేషన్ కేసులలో నేరస్తులుగా ఉన్నారు. ఈ కేసు దర్యాప్తులో పాల్గొని కేసుని చేధించిన కామారెడ్డి రూరల్ సీ.ఐ. రామన్, మాచారెడ్డి ఎస్సై అనిల్, పిసిఎస్ 'సుభాష్ రెడ్డి ,సిద్దిరాములు, శ్రీకాంత్, ఐటీ సెల్ హెచ్ సి శ్రీనివాస్ మరియు పిఎస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.




# లాభాల్లో స్టాక్‌మార్కెట్లు..

## • నిఫ్టీ మళ్లీ 25000 మార్క్



**జనంసాక్షి:**దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశా యి. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 ఇండెక్స్ దాదాపు నెల రోజుల విరామం తర్వాత 25,000 మార్కును తిరిగి పొందగలిగింది.ఈ సూచీ చివరిసారిగా జూలై 24న 25,000 మార్క్ పైన ముగిసింది. నేడు ఐటీ షేర్లలో బలమైన లాభాలతో ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 ఇండెక్స్ ఇంట్రాడే గరిష్ట స్థాయి 25,089కు ఎగబాకి, చివరకు 70 పాయింట్లు లేదా 0.3 శాతం లాభంతో 25,050 స్థాయిల వద్ద స్థిరపడింది. ఈ క్రమంలోనే నిఫ్టీ వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్లలో 563 పాయింట్లు లాభపడింది.బీఎస్ఈ సెన్సెక్స్ 213 పాయింట్లు (0.3 శాతం) లాభపడి 81,858 వద్ద స్థిరపడింది. ఇన్ఫోసిస్ దాదాపు 4 శాతం లాభపడి రూ.1,495 స్థాయికి చేరుకోగా, ఒక్క ఇన్ఫోసిస్ మాత్రమే 165 పాయింట్లు లాభపడింది. టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కూడా 1-3 శాతం మధ్య లాభాల్లో ముగిశాయి. ఈ క్యాలెండర్ ఇయర్ లో ఇప్పటివరకు దీర్ఘకాలంగా పనితీరు కనబరచకపోవడంతో విలువ కొనుగోళ్లు లాభపడటానికి కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు.బీఎస్ఈ సెన్సెక్స్‌లో హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభాల్లో ముగిశాయి. మరోవైపు భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్) 2 శాతం నష్టపోయింది. బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్ కూడా 1 శాతానికి పైగా క్షీణించాయి. విస్తృత సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం, స్మాల్‌క్యాప్ 0.3 శాతం పెరిగాయి. రంగాలవారీగా చూస్తే బీఎస్ఈ ఐటీ ఇండెక్స్ 2.6 శాతం, రియల్టీ ఇండెక్స్ 1 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 1,718 షేర్లు క్షీణించగా, 2,347 షేర్లు లాభపడ్డాయి. అన్ని రకాల ఆన్లైన్ రియల్ మనీ గేమింగ్ (ఆర్ఎంజీ)ను నిషేధించే ముసాయిదా బిల్లును ప్రభుత్వం ప్రతిపాదించడంతో వ్యక్తిగత షేర్లలో నజారా టెక్నాలజీస్ 13 శాతం నష్టపోయింది.

# బోనస్ వస్తుందోచ్..

## • ఇన్ఫీ ఉద్యోగులకు శుభవార్త

**జనంసాక్షి:**దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తమ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రథమ త్రైమాసికానికి (%ు1 ఖీ%2025-26) సంబంధించిన పనితీరు బోనస్ లెటర్లను జారీ చేసింది.ఈ త్రైమాసికంలో కంపెనీ ఆర్థిక పనితీరు బలంగా ఉండటంతో ఉద్యోగులకు కూడా మెరుగైన బోనస్‌ను ప్రకటించింది.2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి సంబంధించి ఉద్యోగులకు సగటున 80% పనితీరు బోనస్ ప్రకటించినట్లుగా తెలుస్తోంది. గత త్రైమాసికంలో ఇచ్చిన 65% సగటు బోనస్ చెల్లింపుతో పోలిస్తే ఇది గణనీయమైన వృద్ధి. దీంతో ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రకటించిన ఈ బోనస్ ఆగస్టు నెల జీతంతో పాటు ఉద్యోగులకు అందనుంది.ఉద్యోగులు తమ పనితీరు రేటింగ్ ఆధారంగా 75% నుండి 89%వరకు బోనస్ పొందారు. ఈ బోనస్ చెల్లింపు లెవెల్ 4, 5, 6 స్థాయిల్లో ఉన్న (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, టీమ్ లీడర్లు, సీనియర్ మేనేజర్లు) 3.23 లక్షల మందికి పైగా ఉద్యోగులను కవర్ చేస్తుంది. పనితీరు విషయంలో ఉద్యోగులను మూడు కేటగిరీలుగా వర్గీకరించి బోనస్ నిర్ణయించినట్లు తెలుస్తోంది.ఇన్ఫోసిస్ 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి బలమైన ఆర్థిక ఫలితాలు సాధించింది. రూ.6,921 కోట్ల నికర లాభం (వార్షిక ప్రాతిపదికన 8.7% వృద్ధి), రూ.42,279 కోట్ల ఆదాయం (వార్షిక ప్రాతిపదికన 7.5% వృద్ధి) నమోదు చేసి, విశ్లేషకుల అంచనాలను అధిగమించింది.

రైతుకు చేదోడుగా

# మార్కెట్‌లోకి కొత్త ప్రొడక్ట్

**జనంసాక్షి:**పంటసాగులో రైతన్నకు కలుపు సవాలుగా మారుతున్న నేపథ్యంలో ఈ సమస్యను కట్టడి చేసేందుకు కొన్ని కంపెనీలు కలుపు మందులు తయారు చేస్తున్నాయి. పంటపొలాల్లో కలుపు తొలగించేందుకు కూలీల ఖర్చులు పెరుగుతున్న తరుణంలో గోద్రేజ్ కంపెనీ అశితాకా పేరుతో కలుపు మందును ఆవిష్కరించింది.ఇది మొక్కజొన్న సాగులో పంట నష్టం వాటిల్లకుండా కలుపు నివారణకు ఎంతో ఉపయోగపడుతుందని గోద్రేజ్ ఆగ్రోవెట్ సీఈఓఎన్‌కే రాజావేలు తెలిపారు.'మొక్కజొన్న పంటలో గడ్డి, పెద్ద ఆకులతో ఉన్న కలుపు మొక్కలను నివారించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా గడ్డి జాతి మొక్కలు 2-4 ఆకుల వచ్చిన దశలో ఉన్నప్పుడు మరింత సమర్థంగా పని చేస్తుంది. ఈ మందును నేరుగా పంటపై స్ప్రే చేసుకోవచ్చు. నిబంధనలకు తగినట్లు తగిన మోతాదులో దీన్ని ఉపయోగించి కలుపు నివారించుకోవచ్చు. స్ప్రే చేసే క్రమంలో గాలికి పంటపై మందు పడినా మొక్కజొన్నకు నష్టం జరగదు. ఎ?క్కువకాలం జీవించి, తిరిగి పెరిగే కలుపు జాతులపై ఇది ఎంతో ప్రభావం చూపుతుంది. 400 ఎంఎల్ సర్ఫక్టెంట్‌తోపాటు 50 ఎంఎల్ అశితాకా కలిపి ఎకరాకు పిచికారి చేసుకోవాలి' అని రాజావేలు చెప్పారు.వర్షాభావ ప్రాంతాల్లో హెచ్చుతగ్గులకు లోనయ్యే రైతుల ఆదాయాన్ని స్థిరంగా వృద్ధి చెందించేందుకు ఇది ఎంతో తోడ్పడుతుందని తెలిపారు.




# గూగుల్ పే, ఫోన్‌పేలో ఆ ఫీచర్ బంద్

## • యాప్‌లలో కీలక మార్పు

**జనంసాక్షి:**యూపీఐ మోసాలను అరికట్టేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 1 'పేమెంట్ రిక్వెస్ట్' ఫీచర్‌ను నిలిపివేయాలని నిర్ణయించింది.గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌లలో ఈ మార్పు అమలులోకి రానుంది.'పేమెంట్ రిక్వెస్ట్' అనే ఫీచర్‌ను మోసగాళ్లు దుర్వినియోగం చేస్తూ, డబ్బు పంపుతున్నట్టు చూపించి, వినియోగదారుల నుంచి డబ్బు తీసుకుంటున్నారు.ఓఎల్ఎక్స్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో వాడుక వస్తువుల కొనుగోలు సందర్భాల్లో ఈ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వినియోగదారులు డబ్బు వస్తుందనుకుని, రిక్వెస్ట్‌ను అంగీకరించడం వల్ల వారి ఖాతాల్లోని డబ్బు మోసగాళ్లకు చేరుతోంది.ఎన్‌పీసీఐ ఆదేశాల మేరకు, అక్టోబర్ 2 నుంచి ఈ ఫీచర్‌ను పూర్తిగా నిలిపివేయాల్సి ఉంటుంది. ఇందుకు అనుగుణంగా యూపీఐ యాప్‌లు తమ సిస్టమ్‌లను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఈ మార్పులు డిజిటల్ లావాదేవీల భద్రతను పెంచే దిశగా కీలక అడుగులుగా ఎన్‌పీసీఐ భావిస్తోంది.

# మొబైళ్లను 5% జీఎస్‌టీ శ్లాబ్‌లో చేర్చాలి

## • కేంద్రానికి ఐసీఈఏ విజ్ఞప్తి


**జనంసాక్షి:**మొబైల్ ఫోన్లు, పరికరాలను, నిత్యావసర ఉత్పత్తుల కోసం ఉద్దేశించిన 5 శాతం జీఎస్‌టీ శ్లాబ్‌లో చేర్చాలని కేంద్రానికి ఇండియా సెల్యూలార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) విజ్ఞప్తి చేసింది.ప్రస్తుతం అమలు చేస్తున్న 18 శాతం జీఎస్‌టీ తిరోగమన విధానమని పేర్కొంది. నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్‌టీ రేట్లను రెండింటికి తగ్గించేలా కేంద్రం ప్రతిపాదనలు చేసిన నేపథ్యంలో ఐసీఈఏ విజ్ఞప్తి ప్రాధాన్యం సంతరించుకుంది.ప్రస్తుతం మొబైల్ ఫోన్లనేవి విలాస వస్తువులుగా గాకుండా విద్య, వైద్యం, ఆర్థిక సమ్మిళితత్వం, గవర్నెన్స్‌కి సంబంధించి అత్యవసర డిజిటల్ మౌలిక సదుపాయాలకు కీలకంగా మారాయని ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మహీంద్రు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రానిక్స్ వ్యవస్థను 500 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలన్న లక్ష్యానికి అనుగుణంగా మొబైల్స్‌ను అయిదు శాతం జీఎస్‌టీలో చేర్చాలని కోరారు.జీఎస్‌టీ ప్రవేశపెట్టడానికి ముందు చాలా రాష్ట్రాలు మొబైల్ ఫోన్లను నిత్యావసర ఉత్పత్తులుగా గుర్తించి, వాటిపై 5 శాతం వ్యాట్ (విలువ ఆధారిత పన్ను) మాత్రమే విధించాయని మహీంద్రూ చెప్పారు.అయితే, జీఎస్‌టీని ప్రవేశపెట్టాక ముందు 12 శాతం శ్లాబ్‌లో ఉంచి ఆ తర్వాత 2020లో 18 శాతానికి మార్చారని మహీంద్రూ గుర్తు చేశారు.



# జీఎస్‌టీ తగ్గింపుతో వినియోగం జోరు


## • ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక

**జనంసాక్షి:**వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)లో రెండే పన్ను శ్లాబులతో కూడిన ప్రతిపాదిత సంస్కరణలతో ఆదాయ నష్టం ఏర్పడినప్పటికీ.. అంతిమంగా వినియోగానికి, జీడీపీకి ఊతమిస్తుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విభాగం అంచనా వేసింది.జీఎస్‌టీ 5, 12, 18, 28 శాతం శ్లాబులు ఉండగా.. 5, 18 శాతంతోపాటు లగ్జరీ, సిన్ (పొగాకు తదితర) గూడ్స్‌పై 40 శాతం పన్నును కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదించింది. దీనిపై మంత్రుల బృందం అధ్యయనం తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నారు. రేట్ల తగ్గింపు ఫలితంగా ఆదాయం రూ.85,000 కోట్లు తగ్గుతుందని, అదే సమయంలో వినియోగం రూ.1.98 లక్షల కోట్లు పెరుగుతుందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక అంచనా వేసింది.జీడీపీ కూడా 0.6 శాతం పెరుగుతుందని నివేదిక పేర్కొంది. జీఎస్‌టీ ఆరంభంలో సగటు రేటు 14.4 శాతంగా ఉంటే, 2019 సెప్టెంబర్ నాటికి 11.6 శాతానికి తగ్గిందని.. అది ఇప్పుడు 9.5 శాతానికి దిగిరావచ్చని తెలిపింది. వినియోగం పెరుగుతుండడం ద్రవ్యోల్బణాన్ని ఎగిసేలా చేయదని వివరించింది. నిత్యావసరాలైన ఆహారం, వస్త్రాలపై 12 శాతం రేటు కాస్తా 5 శాతానికి దిగొస్తుం దని.. ఈ విభాగంలో రిటైల్ ద్రవ్యోల్బణం 10-15 బేసిస్ పాయింట్లు తగ్గుతుందని తెలిపింది. సేవలకు సంబంధించి ద్రవ్యోల్బణం 5-10 బేసిస్ పాయింట్లు తగ్గుతుందని అంచనా కట్టింది. దీంతో మొత్తం మీద రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) 0.20-0.25 శాతం తగ్గుతుందని తెలిపింది.




# రద్దు వద్దు.. నియంత్రణ ముద్దు

- ఆన్‌లైన్ బెట్టింగులను రద్దు చేస్తే చాలా నష్టపోతాం
- పూర్తిగా రద్దు కంటే.. నియంత్రణ చర్యలు చేపట్టండి
- ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుపై కేంద్ర హోం మంత్రికి లేఖ



**జనంసాక్షి:**రియల్ మనీ గేమ్స్‌పై నిషేధం విధించే విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ భారత ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశాయి.ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్లు-2025ను బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో ఈమేరకు లేఖ రాయడం గమనార్హం. ఇప్పటికే ఈ బిల్లును కేంద్ర మంత్రివర్గం మంగళవారం ఆమోదించింది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న ఈ బిల్లులో ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని నియంత్రించడానికి ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేశారు.

ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ (ఏఐజీఎఫ్), ఈ-గేమింగ్ ఫెడరేషన్ (ఈజీఎఫ్), ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫాంటసీ స్పోర్ట్స్ (ఎఫ్ఐఎఫ్ఎస్) సంయుక్తంగా కేంద్రం హోం మంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో ఆసక్తికర అంశాలు తెలిపారు. ఆన్‌లైన్ స్కిల్ గేమింగ్ విభాగం ఒక ట్రిలియన్ డాలర్ల డిజిటల్ ఎకానమీని సృష్టిస్తుందని చెప్పారు. 'భారతదేశపు డిజిటల్ గేమింగ్ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది యువ పారిశ్రామికవేత్తలు, డెవలపర్లు, నిపుణులు కొత్త ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు వల్ల తీవ్రంగా ప్రభావితం చెందుతారు. ఇందులోని నిషేధ నియమాలు చట్టబద్ధమైన, ఉద్యోగాలను సృష్టించే పరిశ్రమను దెబ్బ తీస్తుంది' అని తెలిపారు.ప్రస్తుతం ఈ పరిశ్రమ రూ.2 లక్షల కోట్లకు పైగా ఎంటర్‌ప్రైజ్ వాల్యుయేషన్‌ను, రూ.31,000 కోట్ల వార్షిక ఆదాయం, ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రూపంలో రూ.20,000 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూరుస్తోందని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. 20 శాతం సీఏజీఆర్‌తో వృద్ధి చెందుతున్న ఈ రంగం 2028 నాటికి రెట్టింపు అవుతుందని అంచనా. భారతదేశంలో ఆన్‌లైన్ గేమర్లు 2020లో 36 కోట్ల నుంచి 2024లో 50 కోట్లకు పెరిగారు. జూన్ 2022 వరకు రూ.25,000 కోట్లకు పైగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆ రంగం ఆకర్షించింది. ఈ పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. గేమింగ్, టెక్నాలజీ, డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో ప్రపంచానికి నాయకత్వం వహించే అవకాశం భారత్‌కు ఉందని, నిషేధానికి బదులు ప్రగతిశీల నియంత్రణను అవలంబించాలని లేఖలో ప్రభుత్వాన్ని కోరారు.ఈ-స్పోర్ట్స్, ఎడ్యుకేషనల్ గేమ్స్, సోషల్ గేమింగ్‌తో సహా ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని ప్రోత్సహించడానికి, కొన్ని అంశాల్లో నియంత్రించడానికి, వ్యూహాత్మక అభివృద్ధి, నిరంతర పర్యవేక్షణ కోసం ఒక అథారిటీని ఏర్పాటు చేసేలా వీలు కల్పించే బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఆన్‌లైన్ గేమ్స్, ఈ-స్పోర్ట్స్ మధ్య స్పష్టమైన విభజన సూచించేలా బిల్లును రూపొందించారు. నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్నవారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, లేదా రూ.కోటి వరకు జరిమానా, లేదా ఆ రెండూ విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. సంబంధిత అడ్వర్టయిజ్‌మెంట్లలో భాగం పంచుకున్నవారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ.కోటి వరకు జరిమానా వేస్తారు.

# బ్రిటిష్ రాయల్ నేవీలో తొలి హిందూ గురువుగా భాను అత్రి

**లండన్‌జనంసాక్షి:** బ్రిటిష్ రాయల్ నేవీ తొలిసారిగా హిందూ గురువును నియమించింది. హిందూ ధర్మ సిద్ధాంతాల ద్వారా నావికా సిబ్బందికి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం చేసేందుకు ఈ నియామకం చేపట్టారు.క్రైస్తవుడు కాని వ్యక్తిని ఈ విధంగా ఎంపిక చేసిన తొలి సందర్భం ఇది. బ్రిటిష్ రాయల్ నేవీలో నియమితులైన 148 మంది కొత్త అధికారులలో భాను అత్రి ఒకరు. భాను అత్రి (39) భారత్‌లోని హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన యువకుడు. ప్రస్తుతం బ్రిటన్‌లోని ఎసెక్స్‌లో నివసిస్తున్నారు. లండన్‌లో ఒక ఆలయ నిర్వహణలో ఆయనకు దీర్ఘకాల అనుభవం ఉంది. భాను అత్రి తాజా నియామకం కోసం ఆరు వారాల అధికారిక శిక్షణ పొందారు. ఇందులో భాగంగా నాలుగు వారాల యుద్ధనౌక హెచ్ఎంఎస్ ఐరన్ డ్యూక్‌లో సముద్ర మనుగడ శిక్షణ, మూడు వారాలపాటు హిందూ గురువుగా శిక్షణ పొందారు తాను నౌకాదళంలో మొదటి హిందూ గురువుగా ఎంపిక కావడం కావడం ఆనందంగా ఉందని అత్రి అన్నారు.భాను అత్రిని హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు అభినందించారు. బ్రిటన్ రాయల్ నేవీలో హిందూ గురువుగా ఎంపికైనందుకు భాను అత్రికి సీఎం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భాను అత్రి హిమాచల్‌తో పాటు దేశం గర్వించే స్థాయికి ఎదిగారన్నారు. 1986 సెప్టెంబర్‌లో జన్మించిన భాను అత్రి.. నల్వాలోని సరస్వతి నికేతన్ సీనియర్ సెకండరీ స్కూల్ నుండి ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత, సోలన్‌లోని సంస్కృత కళాశాల నుండి శాస్త్రి విద్యను పూర్తి చేసి, ఢిల్లీలో జ్యోతిష్య పట్టా పొందారు. 2009లో లండన్ చేరుకున్న అత్రి అక్కడ ఆలయ పూజారిగా బాధ్యతలు చేపట్టారు. భాను అత్రి తండ్రి రామ్ గోపాల్ అత్రి రిటైర్డ్ ఉపాధ్యాయుడు. భాను అత్రి తల్లి లీనా అత్రి గృహిణి. భాను అత్రి తన భార్య, పిల్లలతో పాటు లండన్‌లో ఉంటున్నారు.

# స్టూడెంట్‌ను హత్య చేసిన మరో స్టూడెంట్

## ప్రజాగ్రహంతో స్కూలు ధ్వంసం

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో దారుణం చోటుచేసుకుంది. ఏదో వివాదంలో ఎనిమిదో తరగతి.. విద్యార్థి పదో తరగతి విద్యార్థిని కత్తితో పొడవగా, బాధిత విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.విషయం బయటకు పొక్కినంతనే ప్రజాగ్రహం పెల్లుబికి పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. ఆగ్రహంతో రగిలిపోతూ కొందరు ఆందోళనకారులు పాఠశాలను ధ్వంసం చేశారు.మణినగర్ ఈస్ట్‌లోని సెవెంత్ డే అడ్వాంటేజ్ చర్చి స్కూల్‌లో ఎనిమిదవ తరగతి విద్యార్థి 10వ తరగతి విద్యార్థిని కత్తితో పొడిచాడు. చికిత్స పొందుతున్న సమయంలో ఆ విద్యార్థి మరణించాడు. అనంతరం బాధిత కుటుంబంతో పాటు సింధీ వర్గానికి చెందినవారంతా ఆందోళనకు దిగారు. పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించిన నిరసనకారులు పాఠశాల సిబ్బందిపై దాడి చేశారు. సమీపంలో పార్క్ చేసిన పాఠశాల బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. ఈ దాడులతో పాఠశాల ఆస్తులకు భారీ నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులు పోలీసు వాహనంపై కూడా దాడి చేశారు. పాఠశాల వెలుపల రోడ్డును దిగ్బంధించారు.మణినగర్ ఎమ్మెల్యే, డీపీపీ బల్దేవ్ దేశాయ్, ఏసీపీ పరిస్థితిని చక్కదిద్దడాని ప్రయత్నించారు. బజరంగ్ దళ్, బీహెచ్‌పీ, అఖిల భారత విద్యార్థి పరిషత్ సభ్యులు 'జై శ్రీ రామ్' నినాదాలు చేస్తూ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. చివరికి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చింది.

# 'ఆపరేషన్ సిందూర్'కు తోక ముడిచిన పాక్..

## శాటిలైట్ చిత్రాలివే..

**న్యూఢిల్లీ,జనంసాక్షి:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో చొటుచేసుకున్న ఉగ్రదాడి అనంతరం భారత్ ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌లోని లక్షిత ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసింది.ఈ దాడులకు పాక్ వణికి పోయిందనడానికి నిదర్శనంగా కొన్ని శాటిలైట్ చిత్రాలు వెలువడ్డాయి.ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ నావికాదళం భయంతో ఇరానియన్ సరిహద్దుకు తరలిపోవడాన్ని కొత్త ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. పాకిస్తాన్ యుద్ధనౌకలు ప్రధాన నావికా స్థావరాల నుండి తరలించడాన్ని ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. కొన్ని నౌకలను కరాచీ వాణిజ్య రేవులకు తరలించారు. మరికొన్నింటిని ఇరాన్ సరిహద్దుకు సమీపంలో పశ్చిమ సరిహద్దుకు తరలించారు.పాకిస్తాన్‌పై భారత్ చేపట్టిన సైనిక చర్యలలో ఆపరేషన్ సింధూర్ ప్రముఖమైనదిగా నిలుస్తుంది. ఈ ఆపరేషన్ సమయంలో పాకిస్తాన్ తనను తాను రక్షించుకునేందుకు చేసిన ప్రయత్నాలపై ప్రతి రోజూ కొత్త నివేదికలు అందుతున్నాయి. తాజాగా వెలువడిన ఉపగ్రహ చిత్రాలు పాకిస్తాన్ నావికాదళం ఇరానియన్ సరిహద్దుకు తరలిపోవడాన్ని చూపిస్తున్నాయి.మే 7- మే 10 మధ్య భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. అ సమయంలో భారత్‌కు తగిన సమాధానం ఇచ్చామని పాకిస్తాన్ గతంలో వాదనకు దిగింది.అయితే ఇప్పుడు ప్రత్యక్షమైన శాటిలైట్ చిత్రాలు దీనికి భిన్నమైన తీరును చూపిస్తున్నాయి. పాకిస్తాన్ తన నావికాదళాన్ని సురక్షితంగా ఉంచేందుకు వెనక్కి తగ్గినట్లు ఈ దృశ్యాలు వెల్లడిస్తున్నాయి. మే 8న భారత్ దాడుల తరువాత రోజున పాక్ యుద్ధనౌకలు వాటి సాధారణ ప్రదేశాలలో కనిపించలేదు. మూడు యుద్ధనౌకలు కరాచీ వాణిజ్య నౌకాశ్రయంలో కనిపించాయి.

# కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై సంచలన ఆరోపణలు



పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజుపై తృణమూల్ కాంగ్రెస్ మహిళా ఎంపీలు సంచలన ఆరోపణలకు దిగారు. లోక్‌సభలో.. ఆయన, మరో కేంద్ర మంత్రి కలిసి తమపై దాడి చేశారని మీడియా ముందుకు వచ్చారు.తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే మూడు బిల్లులను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నేడు(బుధవారం) లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా.. లోక్‌సభలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతమంది ప్రతిపక్ష ఎంపీలు బిల్లు ప్రతులను చించి విసిరారు. వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు.ఆ సమయంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు కలుగు జేసుకున్నారు. "సభా కార్యకలాపాలకు అడ్డు తగలడం.. ప్రతిపక్షాలకే మంచిది కాదు. ప్రత్యేకించి కొత్తగా ఎన్నికైన ఎంపీలకు. మీరెంత రచ్చ చేస్తే.. ప్రజలు మిమ్మల్ని అంతగా తిరస్కరిస్తారు. కాబట్టి.. చర్చలో పాల్గొనండి అని కోరారాయన. అయినా విపక్ష ఎంపీలు వినలేదు.అయితే నిరసన కొనసాగుతున్న టైంలో.. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, రవనీత్ సింగ్ బిట్టూ తమపై దాడి చేశారని టీఎంసీ ఎంపీలు మిథాలీ బాగ్, శతాబ్ది రాయ్ ఆరోపించారు. " ఆ ఇద్దరూ మమ్మల్ని తోసేశారు.. దాడి చేశారు.. ఇది సిగ్గు పడాల్సిన విషయం" మిథాలీ బాగ్ మీడియాతో అన్నారు. అయితే..దాడి ఆరోపణల నేపథ్యంలో స్పీకర్ కార్యాలయం స్పందించింది. ఎవరిపై అలాంటి దాడేం జరగలేదని ఓ ప్రకటన చేసింది. మరోవైపు.. అమిత్ షా ప్రసంగిస్తున్న టైంలో బిల్లుల ప్రతులను కొందరు విపక్ష ఎంపీలు చించేసి ఆయనపై విసిరేశారు. ఆ ఎంపీలను సస్పెండ్ చేయాలంటూ బీజేపీ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు

# ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్ నామినేషన్

## ప్రధాని మోడీ, అమిత్ షా, రాజ్‌నాథ్ తదితరుల హాజరు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ బుధవారంనాడు తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు మంత్రుల సమక్షంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను రాధాకృష్ణన్ సమర్పించారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా నాలుగు సెట్ల పేపర్లు దాఖలు చేశారు. తొలి సెట్‌కు చీఫ్ ప్రపోజర్‌గా ప్రధాని ఉన్నారు. నామినేషన్ పత్రాల దాఖలుకు ముందు సీపీ రాధాకృష్ణన్ ప్రేరణా స్థల్ వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. నామినేషన్ పత్రాల దాఖలు అనంతరం సీపీ రాధాకృష్ణన్ విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేసారు. నామినేషన్ పత్రాల దాఖలుకు మంత్రులు, ఎన్డీయే నేతలతో కలిసి వెళ్లామని, ఉపరాష్ట్రపతి పదవికి రాధాకృష్ణన్ వన్నెతెస్తారని, దేశం మరింత ప్రగతి పథంలోకి వెళ్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నికల జరగనుండగా, విపక్ష అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని నిలిపారు. ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీఏ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీపీ రాధాకృష్ణన్‌ను టీడీపీ ఎంపీలు అభినందించారు. ఆయన నామినేషన్ పత్రాలపై కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, తెన్నేటి కృష్ణప్రసాద్ సంతకాలు చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్‌కే తాము మద్దతిస్తామని వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మూడ్రోజుల క్రితమే తమ పార్టీ అధినేత జగన్‌కు ఫోన్ చేసి మద్దతు కోరారని.. జగన్ ఆ మేరకు హామీ ఇచ్చారని తెలిపారు. ఒకసారి హామీ ఇచ్చిన తర్వాత తమ వైఖరి మార్చుకోబోమని స్పష్టంచేశారు.

# కీచక టీచర్.. బ్యాడ్ టచ్



- ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో చట్టం కేసు
- బాన్సువాడ మండలంలోనే ఇది రెండవ కేసు

**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 20 (జనం సాక్షి) :** పాఠశాలకు ఉపాధ్యాయులే తల్లిదండ్రులుగా భావించి వచ్చే విద్యార్థినులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు కీచకులుగా మారుతున్నారు. అభం శుభం తెలియని విద్యార్థినులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ అంటే తెలిపి, వారు జీవితంలో అదుపు తప్పకుండా చూడాల్సింది పోయి వారిపైనే అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. వారి అకృత్యాలను బయటకు ఎలా చెప్పాలో తెలియక బాలిక లు సతమతమవుతున్నారనే చెప్పాలి. ఈ మధ్య కాలంలో పోలీసులు, అధికారులు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో విద్యార్థినులు తమకు జరుగుతున్న అన్యాయాలను ఒక్కొక్కటిగా బయటకు వెల్లడిస్తున్నారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తాడ్కోల్ జిల్లా పరిషత్ పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడిపై బాన్సువాడలో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు, గణిత ఉపాధ్యాయుడు గణపతిపై పోక్సో కేసు నమోదైనట్లు ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు. ఉపాధ్యాయుడు తరగతి గదిలోనే పలువురు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించాడని తల్లి దండ్రులు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజావాణిలో పిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల విద్యా శాఖాధికారి నాగేశ్వర్ రావు, చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ అధికారిణి స్రవంతి విచారణ చేపట్టారు. అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తేలడంతో ఉపాధ్యాయుడిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదైంది.

**బాన్సువాడ మండలంలో.. ఇది రెండవ ఘటన :**
బాన్సువాడ మండలంలోని దేశాయ్ పేట్ గ్రామంలో గత ఏడాది ఇలాంటి ఘటన చోటు చేసుకోగా పాఠశాల ఉపాధ్యాయుడిపై ఫోక్సో కేసు నమోదు కావడం జరిగింది. అదే మాదిరిగా అదే మండలంలోని తాడ్కోల్ జిల్లా పరిషత్ పాఠశాలలో కూడా ఇంచార్జి ప్రధానోపాధ్యాయునిపై ఫోక్సో కేసు నమోదు కావడం గమనార్హం.

# ఐటీ సాంకేతిక విప్లవ యోధుడు రాజీవ్ గాంధీ

- సుడా నిధులతో నూతన కాంస్య విగ్రహ ఏర్పాటు, కూడలి సుందరీకరణ కోసం టెండర్లు పూర్తి.
- నగర కాంగ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి
- ఆర్థిక సంస్కరణల సృష్టికర్త ...18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన రాజీవ్ గాంధీ.
- డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి) :**
మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బుదవారం రోజు కరీంనగర్ డిసిసి కార్యాలయంతో పాటు నగరంలోని రాజీవ్ చౌక్ వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నగర కాంగ్రెస్ అధ్యక్షులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తో పాటు పలువురు నాయకులు హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. అనంతరం రాజీవ్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాచర్ల ప్రసాద్, తదితర నాయకులు హాజరై రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి మాట్లాడుతూ... 1944 ఆగస్టు 20న ముంబైలో జన్మించిన రాజీవ్ గాంధీ వారసత్వ లక్షణాలను అందిపుచ్చుకొని, తన తల్లి మరణానంతరం రాజకీయాలలోకి వచ్చి ఈ దేశం కోసం ఏమైనా చేయాలని ఎంతో పరితపించి, 1984లో దేశవ్యాప్తంగా 400కు పైగా లోక్ సభ స్థానాలను గెలుచుకొని ప్రధానమంత్రి పదవి చేపట్టడం జరిగిందని, 73, 74 ఆర్థిక సంస్కరణలతో పాటు గ్రామపంచాయతీలకు నేరుగా నిధుల కేటాయింపు విషయంలో వారు చేసిన కృషి ఎంతో గొప్పది, సాంకేతిక విప్లవ యోధునిగా అకుంఠిత దీక్షతో పని చేసి, ఈ దేశంలో ఐటీ, టెలికాం రంగాన్ని స్థాపించి ఈ దేశాన్ని ప్రపంచ దేశాలతో పాటు అభివృద్ధి పథంలో ముందుకు నడిపించిన మహనీయులు, 18 సంవత్సరాలకే యువతకు ఓటు హక్కు కల్పించి యువతకు, మహిళలకు రాజకీయంలో భాగస్వామ్యం కల్పించడం జరిగిందని, ఈ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహా నేతను స్మరించుకుంటూ నేడు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమక్షంలో వారు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని, సూర్య చంద్రులు ఉన్నంత వరకు దేశప్రజల మనస్సులో వారి పేరు నిలిచి ఉంటుందని, వారి ఆశయ. లక్ష్య సాధన కోసం మేమంతా కలిసి పని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమాలలో నాయకుల యం.డి.తాజుద్దీన్, కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్, కృపా సాగర్, నిహాల్ అహ్మద్, కంకణాల అనిల్ కుమార్, కుర్ర పోషయ్య, వంగల విద్యాసాగర్, దన్న సింగ్, జీడీ రమేష్, రజిత రెడ్డి, యనమల మంజుల, షబానా మహమ్మద్, జ్యోతి, ముల్కల కవిత, శిల్ప, మాదాసు శ్రీనివాస్, కట్ల సతీష్, మంద మహేష్, జొన్నల రమేష్, దిండిగాల మధు, సుంకరి గణపతి, మూల జయపాల్, కుంభాల రాజకుమార్, కర్ర రాజశేఖర్, షహెన్షా, పడిశెట్టి భూమయ్య, కళీం, నూనె గోపాల్ రెడ్డి, అహ్మద్ అలీ, మేరాజ్, అబ్దుల్ రహ్మాన్, మహమ్మద్ ఆమెర్, శ్రీనివాసు, అజయ్, గడప శ్రీను, తోట అంజయ్య, ఓరుగంటి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తరలింపు సబబు కాదు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- తిరోగమనంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలని మండిపాటు

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 20 (జనం సాక్షి):** సమీకృత భవనాల నిర్మాణం పేరిట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించడం సమంజసం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను ప్రజలకు దూరం చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఇబ్రహీంపట్నంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంఖాల్‌కు తరలించే నిర్ణయంపై జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో చర్చించినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి బీఆర్ఎస్ పాలనలో నిధులు మంజూరు చేసి, కొంత నిర్మాణం కూడా జరిగిందని, దాన్ని పూర్తి చేయకుండా తరలించడం సరికాదని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ శాఖ ఐజీతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. కోహెడలో సమీకృత భవన నిర్మాణం కోసం ఇబ్రహీంపట్నం కార్యాలయాన్ని మంఖాల్‌కు తరలించడం స్థానిక ఎమ్మెల్యే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో లక్డీకపూల్ నుండి కలెక్టర్ కార్యాలయాన్ని కొంగరకలాన్‌కు, గోషామహల్ నుండి ఆర్డీవో కార్యాలయాన్ని ఇబ్రహీంపట్నంకు, ఆర్టీఏ కార్యాలయాన్ని హస్తినాపురం నుండి మన్నెగూడకు తీసుకొచ్చి పాలనను ప్రజలకు చేరువ చేసినట్లు ఆయన గుర్తు చేశారు. అద్భుతమైన భవనాలు నిర్మించి మెరుగైన సేవలు అందించామని, కాంగ్రెస్ ప్రభుత్వం తిరోగమన నిర్ణయాలను విడనాడకపోతే ప్రజా పోరాటాలు తప్పవని హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తరలింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా రెండు చోట్ల చెక్ పోస్టుల ఏర్పాటు

## మంథని అగ్రికల్చర్ ఏడిఏ అంజని మిశ్రా

**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మండల కేంద్రంలో సొసైటీ ప్రైవేట్ దుకాణాలలో కలుపుకొని యూరియా నిల్వలు రైతులకు సరిపడా అందుబాటులో ఉన్నాయని మంథని అగ్రికల్చర్ ఏడిఏ అంజని మిశ్రా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంథని మండలంలో ప్రస్తుత యూరియా నిల్వలు 90.31 టన్నులు ఉన్నాయని, అలాగే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎరువులు బ్లాక్ మార్కెట్ కు తరలి వెళ్లకుండా మంథని మండలంలో రెండు చెక్ పోస్టులు అడవి సోమనపల్లి, సుందిళ్లలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు యూరియా వాడాలని సూచించారు.



# కరీంనగర్‌లో పోలీస్‌ల నేర సమీక్ష

## గణేష్ నవరాత్రి భద్రతపై పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం కీలక ఆదేశాలు



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 20 (జనం సాక్షి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించి, అధికారులకు పలు కీలక సూచనలు జారీ చేశారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాంతియుత వాతావరణంలో విగ్రహాల ప్రతిష్ఠాపన, నిమజ్జనం సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను ముందస్తు పరిశీలన చేయాలని ఆదేశించారు. ఉత్సవ కమిటీలతో సమన్వయం చేసి ట్రాఫిక్ సమస్యలను నివారించాలని, శాంతి, సంక్షేమ కమిటీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పోలీస్ స్టేషన్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, డివిజన్ల వారీగా నెలవారీ నేర సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సీసీసీ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని, ఆకస్మిక శాంతిభద్రతా సమస్యల కోసం బారికేడ్లు, లాఠీలు, హెల్మెట్‌లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఎస్‌హెచ్‌ఓలు పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాలు నమోదు చేయాలని, పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని, స్వాధీనం చేసుకున్న వాహనాలను రికార్డు చేసి, వదిలివేయబడిన వాహనాలను వేలం వేయాలని సూచించారు. రికార్డు నిర్వహణ, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, సమన్ల జారీ వంటి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, డివిజన్‌ను సెక్టార్లుగా విభజించి, ఏఎస్సై లేదా హెడ్ కానిస్టేబుల్‌ను ఇన్‌ఛార్జ్‌గా నియమించి, సబ్-సెక్టార్లను రెండు-మూడు గ్రామాలతో కలిపి పోలీస్ కానిస్టేబుళ్లను కేటాయించాలని, దీనివల్ల క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. రౌడీ, హిస్టరీ షీటర్లపై నిఘా ఉంచాలని, గంజాయి, అక్రమ ఇసుక, పీడీఎస్ బియ్యం రవాణా, పేకాట స్థావరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, స్థానిక పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ (ఏ.ఆర్.) భీంరావు, ఏసీపీలు వెంకటస్వామి (టౌన్), వి. మాధవి (హుజురాబాద్), యాదగిరి స్వామి (ట్రాఫిక్), శ్రీనివాస్ (ఎస్బి), వేణుగోపాల్ (సీటీసీ), సతీష్, విజయకుమార్ (రూరల్), శ్రీనివాస్ జి (సీసీఆర్బి), నర్సింహులు (సీసీఎస్), రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నానో యూరియా వాడకంతో

# రైతులకు అధిక ఫలితాలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (జనం సాక్షి):**
తాడ్వాయి మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. వరి పంటపై డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీని పరిశీలించిన కలెక్టర్, సాంప్రదాయ యూరియా అధిక వాడకం వల్ల భూసారం కోల్పోవడం, పర్యావరణ కాలుష్యం, చీడపీడల సమస్యలు తలెత్తుతున్నాయని, నానో యూరియా ద్రవ రూపంలో పిచికారీ చేయడం ద్వారా ఈ సమస్యలు తగ్గి, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాలకు తక్కువ సమయంలో పిచికారీ చేయవచ్చని తెలిపారు. సాధారణంగా రైతు రోజుకు 5-7 ఎకరాలకు మాత్రమే యూరియా వెదజల్లగలరు, కానీ డ్రోన్ ద్వారా 50-70 ఎకరాలకు నానో యూరియా పిచికారీ సాధ్యమన్నారు. 500 మిల్లీలీటర్ల నానో యూరియా బాటిల్ ఒక ఎకరానికి సరిపోతుందని, ఇది 45 కిలోల యూరియా బస్తాకు సమానమని వివరించారు. ఈ విధానం సమయం, ఖర్చు, చీడపీడల సమస్యను తగ్గిస్తుందని, మొక్కజొన్న పంటలో రెండవ దఫాలో ఎత్తు పెరిగినప్పుడు సాంప్రదాయ పిచికారీ కష్టం కాగా, డ్రోన్ ద్వారా సులభంగా పిచికారీ చేయవచ్చని రైతులు తెలిపారు. తాడ్వాయి మండలంలో మొక్కజొన్నపై 7,258 ఎకరాలకు నానో యూరియా పిచికారీ చేసినందుకు కలెక్టర్ రైతులను అభినందించారు. నానో యూరియా వాడిన రైతుల నుండి అభిప్రాయాలు సేకరించగా, కత్తెర పురుగు సమస్య తగ్గినట్లు వారు గమనించినట్లు తెలిపారు. 500 మిల్లీలీటర్ల నానో యూరియా బాటిల్ కొనుగోలు చేసిన రైతులకు ఒక సంవత్సరం పాటు 10,000 రూపాయల ఉచిత ప్రమాద బీమా, గరిష్టంగా 20 బాటిళ్లు కొనుగోలు చేస్తే 2 లక్షల రూపాయల బీమా అందుతుందని కలెక్టర్ వివరించారు. జిల్లాలోని ఇతర మండల రైతులు కూడా నానో యూరియాను డ్రోన్ ద్వారా వాడి సత్ఫలితాలు పొందాలని, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు నానో యూరియా ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ విక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, తాడ్వాయి మండల వ్యవసాయ అధికారి శనిగరం నరసింహులు, తాసిల్దార్ శ్వేత, ఎంపీడీవో సాజిద్, ఏఈవోలు, ఇఫ్కో జిల్లా మేనేజర్ డి. నరేష్, వారి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# కామారెడ్డిలో కారు దొంగల గ్యాంగ్ అరెస్ట్

## దొంగల అరెస్ట్ వివరాలు వెల్లడించిన ఎస్పీ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (జనం సాక్షి):** జూలై 18న ఉప్పల్వాయి ప్రశాంత్ గౌడ్ తండ్రి వెంకటేష్ గౌడ్, కామారెడ్డి పిఎస్ మాచారెడ్డి ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో, మహమ్మద్ ఇయాజ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల గ్యాంగ్ ఫేస్‌బుక్ ఆన్‌లైన్ యాప్ ద్వారా కార్లు అమ్ముతామని నమ్మించి, సెల్ఫ్ డ్రైవింగ్ కోసం కిరాయికి తీసుకున్న కార్ల నంబర్ ప్లేట్లను మార్చి, నకిలీ ఆర్సీ, ఆధార్, ఇతర డాక్యుమెంట్లు తయారు చేసి అమ్మకాలు చేస్తూ, లక్షల్లో డబ్బు సంపాదించి, మళ్లీ ఆ కార్లను దొంగిలించి యజమానులకు తిరిగి ఇచ్చేస్తూ అమాయకులను మోసం చేస్తున్నట్లు గుర్తించారు. ఈ గ్యాంగ్‌ను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ నేతృత్వంలో ఏర్పాటైన బృందం వేగవంతమైన దర్యాప్తుతో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి కేసును ఛేదించింది. అరెస్టయిన నిందితులు: మహమ్మద్ ఇయాజ్ (26, గోపినగర్, శేరిలింగంపల్లి, రంగారెడ్డి), మహమ్మద్ జాహిద్ అలీ (40, శాంతినగర్ కాలనీ, హైదర్ షా కోటె, రంగారెడ్డి, ప్రస్తుతం వికారాబాద్), పృథ్వీ జగదీష్ (21, రామచంద్రాపురం, సంగారెడ్డి), రాచర్ల శివకృష్ణ (22, కొత్తవాడ, హనుమకొండ, ప్రస్తుతం బీరంగూడ, సంగారెడ్డి), కర్ణకోట సాకేత్ (21, శేరిలింగంపల్లి, రంగారెడ్డి), వేములమాడ వివేక్ (24, రామచంద్రాపురం, సంగారెడ్డి). ఒక నిందితుడు అలీ పరారీలో ఉన్నాడు. స్వాధీనం చేసుకున్న వస్తువులు: ఇనోవా కారు, బాలెనో కారు, ల్యాప్‌టాప్, ఎర్టిగా కారు, మైక్రో సిమ్ కార్డులు, ఎంటీ చిప్ కార్డులు, మొబైల్ ఫోన్లు, నకిలీ ఆర్సీలు, జీపీఎస్ పరికరం. ఈ నేరస్థులు గతంలో శంకర్పల్లి, మంచాల, అంబార్‌పేట, రామచంద్రాపురం, చందానగర్, మియాపూర్, అత్తాపూర్ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో నిందితులుగా ఉన్నారు. కేసు ఛేదనలో పాల్గొన్న కామారెడ్డి రూరల్ సీఐ ఎస్. రామన్, మాచారెడ్డి ఎస్సై ఎస్. అనిల్, పీసీలు సుభాష్ రెడ్డి, సిద్దిరాములు, శ్రీకాంత్, ఐటీ సెల్ హెచ్‌సీ శ్రీనివాస్, పీఎస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.


# అక్రమ ఇసుక తరలిస్తున్న ఆటోలను పట్టుకున్న ఎడపల్లి పోలీసులు

**ఎడపల్లి, ఆగస్టు 20 ( జనంసాక్షి ) :**
ఎడపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా బోధన్ నిజాంబాద్ రహదారిపై అక్రమంగా ఎలాంటి అనుమతి లేకుండా ఆటలలో ఇసుక తరలిస్తున్న ఐదు ఆటోలను బుధవారం పట్టుకున్నట్లు ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపారు. ఇసుక తరలిస్తున్న ఆటోలకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పాటు కనీసం కొన్ని ఆటోలకు నంబర్ ప్లేట్లు సైతం లేవని ఈ మేరకు అక్రమ ఇసుక తరలిస్తున్న ఆటో యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముత్యాల రమ వివరించారు.



# డాక్టర్ బాలు, గంప ప్రసాద్‌లకు జాతీయ రక్తవీర్ పురస్కారం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (జనం సాక్షి) :**
న్యూఢిల్లీలోని అశోక హోటల్‌లో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ రక్తవీర్ పురస్కారాల కార్యక్రమంలో కామారెడ్డి జిల్లాకు చెందిన డాక్టర్ బాలు, గంప ప్రసాద్‌లు జాతీయ రక్తవీర్ పురస్కారాలను అందుకున్నారు. ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త అయిన డాక్టర్ బాలు వ్యక్తిగతంగా 77 సార్లు రక్తదానం చేసి, తలసేమియా చిన్నారుల కోసం 4,000 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించి అందజేశారు. 18 సంవత్సరాలుగా రక్త దాన కార్యక్రమాలు నిర్వహిస్తూ 25,000 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించినట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహించి, ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తం అందించేం దుకు కృషి చేస్తానని డాక్టర్ బాలు పేర్కొన్నారు. అదేవిధంగా, కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షుడు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు గంప ప్రసాద్ వ్యక్తిగతంగా 26 సార్లు రక్తదానం చేసి, తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ అవార్డులను లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్త, ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అందజేశారు. గంప ప్రసాద్‌ను ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు అభినందించారు. ఈ అవార్డులు సాధించడంలో సహకరించిన వారందరికీ డాక్టర్ బాలు కృతజ్ఞతలు తెలియజేశారు.



# లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను త్వరగా నిర్మించుకోవాలి





- పారిశుద్ధ్య కార్యక్రమాలను పగడ్బందీగా నిర్వహించాలి
- విత్తన బంతుల వివరణ కార్యక్రమ నిర్వహణ
- చెక్ డ్యాం పై ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (జనం సాక్షి) :**
కామారెడ్డి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, పర్యావరణ కార్యక్రమాలు బుధవారం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తాడ్వాయి మండలం చిట్యాల, సంతాయిపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, పర్యావరణ కార్యక్రమాలను పరిశీలించారు. చిట్యాల గ్రామంలో లబ్ధిదారు మమత నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించి, నిర్మాణం త్వరగా పూర్తి చేసి గృహప్రవేశం చేయాలని సూచించారు. ఈ గ్రామంలో 32 ఇండ్లు మంజూరు కాగా, 12 ఇండ్లకు మార్కౌట్ ఇవ్వగా, మూడు ఇండ్లు బేస్‌మెంట్, ఒక ఇల్లు రూఫ్ స్థాయి వరకు నిర్మాణం జరిగిందని, మిగిలిన లబ్ధిదారులు త్వరగా నిర్మాణం ప్రారంభించాలని, స్థానికంగా ఇసుక సరఫరా, నిర్మాణ సామగ్రి ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. సంతాయిపేటలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించి, సమస్యలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అదే గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించి, డెంగ్యూ, డయేరియా వ్యాధుల నివారణకు నీటి నిల్వలను తొలగించాలని, ఆయిల్ బాల్స్ వాడాలని, ఫాగింగ్, డ్రైనేజీ శుభ్రత చేపట్టాలని, గ్రామ పంచాయతీల్లో పకడ్బందీగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు వ్యక్తిగత, పరిసర పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సంతాయిపేట భీమేశ్వరాలయ పరిసర అటవీ ప్రాంతంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన బంతుల విసరణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం ద్వారా కాలుష్య రహిత వాతావరణం నెలకొల్పాలని, జిల్లాలో లక్షకు పైగా విత్తన బంతులు తయారు చేసినందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. ప్రతి సంవత్సరం 2 లక్షల విత్తన బంతులు తయారు చేసి, వర్షాకాలంలో అడవుల్లో విసరణ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని, ఇది వన్యప్రాణులకు ఆహారం అందించడంతో పాటు పర్యావరణ అవగాహన కల్పిస్తుందని తెలిపారు. అలాగే, సంతాయిపేటలోని భీమేశ్వర చెక్ డ్యామ్‌ను పరిశీలించి, అధిక వర్షాల వల్ల ఓవర్‌ఫ్లో అవుతున్నందున రైతులు దాటకుండా బ్యారికేడ్స్ ఏర్పాటు చేసి నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో హౌసింగ్ పిడి విజయపాల్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, ఎంపీడీవో సాజిద్ అలీ, తాసిల్దార్ శ్వేత, ఎంపీవో సరిత రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఇరిగేషన్ ఈఈ మల్లేష్, జేఈ మధు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డాక్టర్ల నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

- ఆక్సిజన్ పెట్టమంటే పెరుగన్నం తినమని సలహా
- ఆందోళన చేపట్టిన మృతురాలి కుటుంబ సభ్యులు
- రీల్స్ చూస్తూ, మైదాకు పెట్టుకుంటూ నిర్లక్ష్యం.
- ప్రశ్నించిన మాజీ ఎంపీపీ అనంతరాజు గౌడ్




**మఠ్రిగూడ, ఆగస్టు 20(జనం సాక్షి):** ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యంతో నిండుప్రాణం బలైపోయిన సంఘటన, మఠ్రిగూడ 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం చోటుచేసుకుంది. ఇక వివరాల్లోకి వెళితే.. రాజపేటతండా గ్రామానికి చెందిన జింకల సత్తెమ్మ(65), స్వల్ప అనారోగ్యానికి గురై మఠ్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన సత్తమ్మ ఆరోగ్యం, మెల్లమెల్లగా క్షీణిస్తూ వచ్చింది. పరిస్థితి బాలేదు తన తల్లిని చూడండి డాక్టర్ గారు అని, సత్తమ్మ బంధువులు బ్రతిమిలాడిన వైద్యులు పట్టించుకోలేదని ఆరోపించారు. చివరికి శ్వాస తీసుకోవడానికి కూడా, సత్తన్న బాధపడుతున్న సమయంలో బంధువులు డాక్టర్లను బ్రతిమిలాడారు. ఆక్సిజన్ పెట్టమని అడగగా, పెరుగన్నం పెట్టండి తగ్గిపోతుందని వైద్య అధికారులు చెప్పారని ఆరోపించారు. తన తల్లి ప్రాణాలు పోయిన తరువాతే ఈసిజీ సిపిఆర్ అంటూ, అప్పుడు హంగామా చేసి, చివరికి డాక్టర్లు తన తల్లి ప్రాణాలు తీశారని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఆసుపత్రిలో రీల్స్ చూడటం, మైదాకులు పెట్టుకోవడం తప్ప, వైద్యం అందించటం లేదని వైద్యులపై దుమ్మెత్తి పోసారు స్థానికులు. మృతదేహంతో ఆసుపత్రి నందు ఆందోళనకు దిగారు కుటుంబ సభ్యులు. ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి ఆయన సిబ్బందితో కలిసి ఎలాంటి గొడవలు జరగకుండా చూసారు.

**ప్రజల ప్రాణాలు మీకు లెక్కలేదా..**

**మాజీ ఎంపిపి అనంత రాజు గౌడ్.**

ప్రజల ప్రాణాలంటే మీకు లెక్కలేదా అంటూ మఠ్రిగూడ మాజీ ఎంపీపీ, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు అనంతరాజు గౌడ్ వైద్యులను ప్రశ్నించారు. ప్రాణాలు పోసే వైద్యులే నిర్లక్ష్యం వహిస్తూ, ప్రజల ప్రాణాలు తీస్తున్నారన్నారు. మృతురాలిని చూసిన ఆయన, జరిగిన సంఘటన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తన చరవాణి ద్వారా, ఉన్నత వైద్య అధికారులకు జరిగిన విషయం చెబుతూ, డాక్టర్ల నిర్లక్ష్యంపై పిర్యాదు చేశారు.

# పత్తి దిగుమతులపై సుంకాల రద్దు రైతులకు మరణశాసనమే

- తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి సుంకెట



**హైదరాబాద్, ఆగస్ట్ 20 (జనంసాక్షి) :** పత్తి దిగుమతులపై సుంకం ఎత్తివేత నిర్ణయం రైతుల పాలిట మరణ శాసనమే అని తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి సుంకెట అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో దేశ రైతాంగం కునారిల్లుతోంద న్నారు. అధికారంలోకి వస్తే డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తామని 2014లో ప్రకటించిన మోదీ.. ఇప్పుడు ఆ మాటలను తుంగలొతొక్కుతున్నారు. రైతులకు ఆదాయం పెంచు తామని చెబుతూనే తాజాగా పత్తి దిగుమతులపై సుంకాలను ఎత్తేయడం రైతులను నిట్టనిలువునా ముంచేయడమేనన్నారు. 'ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 30 వరకూ పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాలను రద్దు చేయడం దేశ పత్తి రైతులకు మరణశాసనం రాయడమే అవుతుంది. దిగుమతి సుంకం తొలగించడం వల్ల దేశీయ పత్తి ధరలపై నేరుగా ప్రభావం పడుతుంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల దేశంలోని పత్తి వ్యాపారస్తులు విదేశాల నుంచి తక్కువ ధరకు పత్తిని పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకోవడంతో పాటుగా.. భారీగా నిల్వ చేసుకుంటారు' అని చెప్పారు. రాష్ట్రంలో అక్టోబర్ నెలలో పత్తి పంట మార్కెట్‌కు వస్తుందని, ఈ సమయంలో వ్యాపారులు సిండికేట్‌గా మారి పత్తి రైతుల కష్టాన్ని దోపిడీ చేసే అవకాశం ఉందన్నారు. మోదీ ప్రభుత్వ నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా చిన్న, సన్నకారు పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలు పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తంచేశారు. రైతాంగం సంక్షోభంలో కూరుకుపోకుండా ఉండాలనే కేంద్రప్రభుత్వం పత్తి రైతులకు డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు(సి2 ప్లస్ 50శాతం) ప్రకారం కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఖర్చుల, ధరల ప్రకారం ఈయేడు పత్తికి క్వింటాలకు రూ.10075 ప్రకటించాలన్నారు. దేశంలో పత్తి సాగు విస్తీర్ణం సుమారు 120.55 లక్షల హెక్టార్లు అని, ఇది ప్రపంచంలో మొత్తం పత్తి సాగు విస్తీర్ణంలో సుమారు 36 శాతమని తెలిపారు. రాష్ట్రాలవారీగా చూస్తే మహారాష్ట్రలో పత్తి సాగు అత్యధికంగా తర్వాత గుజరాత్, తెలంగాణ (40 లక్షల ఎకరాల సాగు) ఉన్నాయన్నారు. పత్తి రైతులకు నష్టం జరగకుండా మోదీ ప్రభుత్వం తీసుకున్న సుంకాల ఎత్తివేత నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్వేష్‌రెడ్డి కోరారు.

# డ్యామ్ కొట్టుకుపోయినట్టు నిరూపిస్తావా..?

**కేటీఆర్ఎస్‌కు ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సవాల్**



**మహబూబ్‌నగర్ బ్యూరో ఆగస్టు 20 (జనంసాక్షి) :** రాచాల వద్ద చెక్ డ్యామ్ కొట్టుకుపోయినట్లు కేటీఆర్ వాస్తవాలు తెలుసుకోకుండా, ప్రభుత్వంపై బురద జల్లే ఉద్దేశంతో తప్పుడు సమాచారాన్ని, అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాడని ఎమ్మెల్యే జియంఆర్ మండిపడ్డారు. దమ్ముకుంటే చెక్ డ్యామ్ కొట్టుకు పోయినట్లు నిరూపించాలని, లేనిపక్షంలో ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాచాల వద్ద చెక్ డ్యామ్ తెగిపోలేదని, గతంలో వరద నీటిని మున్‌గల్‌చెడ్ చెరువు నింపడానికి నాటి ప్రభుత్వం గైడ్‌వాల్‌ను నిర్మించిందని, భారీ వరద ఉధృతికి ఆ గైడ్‌వాల్ తెగి పంట పొలాల్లోకి నీరు వెళ్లిందని తెలిపారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామన్నారు. అనామకులు ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లో కూర్చొని, ట్విట్టర్‌లో పెట్టేవాడిని దద్దమ్మ అంటారని కేటీఆర్‌ని ఉద్దేశించి తీవ్రంగా విరుచుకుపడ్డారు. మొన్న ఇరిగేషన్ శాఖ ఈఈ రాచాల వద్ద చెక్ డ్యాంను పరిశీలించి, వరద ఉధృతితో చెక్ డ్యామ్‌కు ఎలాంటి ముప్పు వాటిల్లలేదని నివేదిక ఇచ్చినట్టు వివరించారు. అధికారుల రిపోర్టులను కూడా తెలుసుకోకుండా ట్విట్టర్లో తప్పుడు ప్రచారం చేస్తూ కేటీఆర్ శునకానందం పొందుతున్నాడని విమర్శించారు. తప్పుడు సమాచారంతో సీఎంను, ప్రభుత్వాన్ని విమర్శిస్తే సంస్కారం అనిపించుకోరని హితవుపలికారు.

# తెలంగాణలో ఐఐఎం ఏర్పాటు చేయాలి

**రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు డిమాండ్**



**ఢిల్లీ (జనంసాక్షి) :** పదేళ్ల బీఆరెస్ పాలనలో ఐటీ,ఫార్మా, వైద్యారోగ్య రంగాలలో గొప్పగా ఎదిగిన తెలంగాణలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఐఐఎం) ఏర్పాటు చేయాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఐఐఎం సవరణ -2025 బిల్లును బుధవారం రాజ్యసభలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఎంపీ రవిచంద్ర పాల్గొని మాట్లాడుతూ, అస్సాంలోని గౌహతిలో 550 కోట్లతో ఐఐఎం నెలకొల్పాలనే బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందన్నారు. దేశ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ తెలంగాణలోని 33 జిల్లాలలో మెడికల్,నర్సింగ్ కాలేజీలు,పెద్ద సంఖ్యలో గురుకుల పాఠశాలలు నెలకొల్పి ఉన్నత విద్యను అన్ని వర్గాల వారికి అందుబాటులోకి తెచ్చారన్నారు. ఫార్మా,లైఫ్ సైన్సెస్ రంగానికి హైదరాబాద్ సమీపాన ఉన్న జీనోమ్ వ్యాలీ,ఐటీ రంగానికి హైటెక్ సిటీ,స్టార్టప్ లకు టి-హబ్,వి.హబ్ వంటివి కేంద్రాలుగా పేరుగడించాయని ఎంపీ రవిచంద్ర తెలిపారు. ఐఐఎం ఏర్పాటుకు హైదరాబాద్ అన్ని విధాలా అనువైనదని చెప్పారు. తెలంగాణలో ఐఐఎం నెలకొల్పేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఎంపీ రవిచంద్ర ప్రధాని నరేంద్రమోడీ, మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లను కోరుతూ ఈ బిల్లు కు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందని చెప్పారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోసం

# ప్రత్యేక సమ్మరీ రివిజన్

- భారత ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి కర్ణన్



**హైదరాబాద్, ఆగస్టు 20 (జనం సాక్షి) :** భారత ఎన్నికల కమిషన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల కోసం స్పెషల్ సమ్మరీ రివిజన్ కు షెడ్యూల్ విడుదల చేసినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి కర్ణన్ తెలిపారు. బుధవారం జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల కమిషన్ సూచించిన స్పెషల్ సమ్మరీ రివిజన్ ను ఎన్నికల అధికారి వివరించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమం సెప్టెంబర్ 2 నుండి సెప్టెంబర్ 17 వరకు నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో జూలై 1నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు తప్పని సరిగా ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 2 నుండి 17 వరకు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్ అవకాశం ఉందన్నారు. సెప్టెంబర్ 25 వరకు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్ డిస్పోజల్ చేస్తామన్నారు. సెప్టెంబర్ 30 వరకు ఓటరు జాబితా ఫైనల్ పబ్లికేషన్ చేస్తామని కమిషనర్ వారికి వివరించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ లో రాజకీయ ప్రతినిధులు సహకరించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. వివిధ పార్టీల ప్రతినిధులు సందేహాలను నివృత్తి చేయడమే కాకుండా సూచనలు స్వీకరించి సమగ్ర ఓటరు జాబితా తయారీ చేస్తామన్నారు. అందుకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. బీజేపీ ప్రతినిధులు మఠ్రి శశిధర్ రెడ్డి, కొల్లూరి ప్రవీణ్ కుమార్, పి.వెంకటరమణ, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి కె.సందేశ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి మల్లంగి విజయ్, సిపిఎం ప్రతినిధి ఎం.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు రాజేష్ కుమార్, మహ్మద్ వాజిద్ హుస్సేన్, తెలుగు దేశం పార్టీ ప్రతినిధి ప్రశాంత్ రాజు యాదవ్, ఎం.ఐ.ఎం నుండి సయ్యద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవేర్నెస్.**




**ఖమ్మం ఆగస్టు 20 (జనం సాక్షి) :** సైబర్ క్రైమ్ నేరాల పట్ల అప్రమత్తత ఎంతో అవసరం..అని సైబర్ క్రైమ్ డీఎస్పీ సిహెచ్ఆర్వి. ఫణిధర్ అన్నారు.. బుధవారం ఖమ్మంలోని ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో ఎస్‌బిఐ బ్యాంకు టౌన్ సమావేశంలో భాగంగా ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణ పట్ల అవగాహన కార్యక్రమంలో ఎస్‌బిఐ ఖమ్మం రీజియన్, రీజినల్ మేనేజర్ బి. రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ఫణిదర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైమ్ ఘటనలు ఎలా జరుగుచున్నవి, వాటి పట్ల అప్రమత్తత ఎంతో అవసరం అని అన్నారు. ఎస్బిఐ వినియోగదారులకు అవగాహణ కల్పించారు. అనంతరం ఎస్‌బిఐ రీజనల్ మెనేజర్ బి రాజశేఖర్ మాట్లాడుతూ... సైబర్ క్రైమ్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని, బ్యాంక్ సేవలను విరివిగా ఉంయోగిం చుకోవాలని వినియోగదారులను ఉద్దేశించి మాట్లాడారు. తోలుత భువన చంద్రిక కూచిపూడి నృత్యం సభికులను ఆధ్యతం ఆఖరించింది. అనంతరం స్పోర్ట్స్ కేటగిరిలో క్రికెట్ కోచ్ మహమ్మద్ మతీన్, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, వ్యవసాయ అధికారిని వాణి, నాట్యకారిని భువన చంద్రిక లను వారు శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ వినియోగదారులు వారి అనుభవా లు, సందేహాలు బ్యాంక్ అధికారులతో పంచుకున్నారు. వారీ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# బతుకమ్మకుంట సుందరంగా మారాలి

**త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్న హైడ్రా కమిషనర్**

**హైదరాబాద్, ఆగస్టు 20 (జనం సాక్షి) :** దసరా పండగ దగ్గరపడుతోంది. బతుకమ్మ ఉత్సవాలకు సమయం ఆసన్నమౌతోంది. అంతకుముందే బతుకమ్మకుంట సర్వాంగా సుందరంగా సిద్ధం కావాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. బతుకమ్మ కుంట చెరువు నిర్మాణం పూర్తయ్యిందని, ఆ పరిసరాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాల్సినవసరం ఉందన్నారు. బతుకమ్మకుంట చెరువు అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా అనుకున్నట్టు చెరువు చుట్టూ పాత్‌వే.. నీడనిచ్చే చెట్ల పెంపకం.. ప్రజలు సేదదీరేలా కూర్చునేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. చెరువు ఇన్‌లెట్ - ఔట్‌లెట్‌లు సరిగ్గా ఉండేలా చూడాలని సూచించారు. ఇటీవల వర్షాలు పడినప్పుడు వరద నీరు అక్కడ ఉన్న కాలనీలు, బస్తీలను ముంచెత్తకుండా.. నేరుగా బతుకమ్మ కుంటలోకి చేరడాన్ని ప్రత్యక్షంగా చూశామని, చెరువు నిండిన తర్వాత కిందకు వెళ్లేందుకు కూడా ఎక్కడా ఆటంకాలు లేకుండా చూడాలన్నారు.

**బతుకమ్మకుంట ఓ నమూనా కావాలి**

వరద నివారణతో పాటు.. భూగర్భ జలాలు పెంపొందించడం.. పర్యావరణ పరిరక్షణకు బతుకమ్మ కుంట ఒక నమూనా కావాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. ఇటీవల కేంద్ర బృందాలు వచ్చి చెరువును సందర్శించిన సందర్భంగా జాతీయ స్థాయిలో ఇది ఒక నమూనా అంటూ కితాబివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. అందరి అంచానాలకు అనుగుణంగా దీనిని తీర్చిదిద్దాలని, అక్కడ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులకు సూచించారు. బతుకమ్మను ప్రతిబింభించేలా చెరువు మధ్యలో ఏర్పాటు చేయాలన్నారు. చెరువు చుట్టూ అందమైన మొక్కలతో పాటు ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలి. పెద్దలు వచ్చి సేదదీరే విధంగా గుమ్మటాలు నిర్మించాలని, అలాగే హైజెనిక్‌గా రెస్టు రూంలుండేలా చూడాలన్నారు. బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. చెరువును కాపాలాకాసే సెక్యూరిటీ అక్కడ ఉండేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# మట్టిలో తెలుగు మాణిక్యం పోలె అశ్విని

- ఉస్మానియా యూనివర్సిటీ ఎం. ఎ. తెలుగు గోల్డ్ మెడల్ ఎంపిక
- తెలంగాణ గవర్నర్, ఇస్రో ఛైర్మెన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ బహుకరణ



**ఉస్మానియా యూనివర్సిటీ :** హైదరాబాద్ నందు ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ బిష్ణుదేవ్ శర్మ మరియు ఇస్రో చైర్మన్ నారాయణ్ మరియు యూనివర్శిటీ అధ్యాపక బృందం పాల్గొన్నారు. 2023-24 సంవత్సరానికి ఎం. ఎ తెలుగు డిపార్ట్ మెంట్ లో అత్యధిక మార్కులతో ప్రతిభను గుర్తించిన మారుమూల గ్రామీణ విద్యార్థిని మరియు ప్రభుత్వ టీచర్ పోలె అశ్వినికి ఉస్మానియా యూనివర్సిటీ ఎం. ఎ తెలుగులో గోల్డ్ మెడల్ బహుకరించిది. తెలంగాణ గవర్నర్, ఇస్రో చైర్మన్ చేతుల మీదుగా పోలె అశ్వినికి గోల్డ్ మెడల్ ను అందించారు. పోలె అశ్విని చదువులలోనే కాదు మంచి రచయిత, తన రచనలతో సామాజిక చైతన్యాన్ని మేలుకొలుపుతూ తన కళం సహాని ద్వారా అక్షరవెలుగులను అందిస్తుంది. ఆమె గోల్డ్ మెడల్ సాధించడం పట్ల తనకు విద్యను అందించిన గురువులను కొనయాడింది. మారు మూల గ్రామములో అత్యంత పేదరిక కుటుంబం నుండి ఎన్నో అవవరోదాలను, అవమానల్ని ఎదురుకొని తన తల్లీ తండ్రుల సహకారంతో ఉన్నత విద్యను అభ్యశించానని, ఆడ పిల్లకు చదువు వద్దని చెప్పే ఈ కాలంలో నాకూ అవకాశం కలిపించిన తల్లీ తండ్రులకు, చదువుకునే హక్కును కలిపించిన రాజ్యాంగ పితమహుడు అంబెడ్కర్ కు నా గోల్డ్ మెడల్ అకింతమిస్తున్నాని ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, త్వరలోనే తను రచించిన సిరార్చి పుస్తకాన్ని ఆవిష్కరిస్తానని తెలియజేశారు. మట్టిలోని తెలుగు మాణిక్యం పోలె అశ్విని ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని తనకుంటుంబ సభ్యులు, గురువులు అభినదించారు.

*కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం 2004 తర్వాత ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం దక్కలేదు. వరుసగా మూడు ఎన్నికల్లోనూ మూడో స్థానానికే పరిమితమైంది. గత ఎన్నికల వరకు కరీంనగర్ అసెంబ్లీకి పెద్ద దిక్కుగా ఉన్న పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ వెళ్లడంతో ఇక్కడ నాయకత్వ కొరత ఏర్పడింది. గత ఎన్నికల్లో పోటీచేసిన పురుమల్ల శ్రీనివాస్‌ను క్రమశిక్షణా చర్యల్లో భాగంగా పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఇక తర్వాతి నుంచి నగరంలో పార్టీకి నాయకుడంటూ లేక పార్టీ శ్రేణులు దిక్కులు చూస్తున్నారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కరీంనగర్ మేయర్ పీఠాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని సీఎం రేవంత్ ఆదేశించినట్టు తెలిసింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఆశాజనకంగా లేదని సొంత పార్టీలోనే గుసగుసలు వినబడుతున్నాయి. ప్రధానంగా కరీంనగర్ కాంగ్రెస్‌లో సేనాధిపతి కరువయ్యాడనే చర్చ ముమ్మరంగా సాగుతోంది.*




## కరీంగనర్ మేయర్ సీటుపై

# కాంగ్రెస్ నజర్

## ఎలాగైనా ప్రాతినిధ్యం దక్కించుకోవాలని వ్యూహాలు

- సమన్వయం కొరవడిన స్థానిక 'హస్తం' నాయకులు
- ముగ్గురు.. ఎవరికి వారే అన్నట్టుగా సొంత కార్యకలాపాలు
- ఉన్న పట్టు కోల్పోకుండా పట్టుబడుతున్న బీజేపీ, బీఆర్ఎస్
- అంతిమ పోరులో అధికార పార్టీ గట్టెక్కేనా..?

**కరీంనగర్ జిల్లా బ్యూరో (జనంసాక్షి) :** కరీంనగర్‌లో బీఆర్ఎస్, బీజేపీకి సైతం మంచి పట్టుండటం, ఈ పార్టీలకు ధీటుగా కాంగ్రెస్ నాయకత్వాన్ని తయారు చేయలేకపోవడం వంటి సమస్యలున్నట్టు స్పష్టమవు తోంది. ఇన్నేళ్లుగా సంప్రదాయ కార్యకర్తలు తప్ప కొత్త వారు పార్టీలోకి రాలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్‌కు మంచి ఫలితాలు వచ్చాయి. ముగ్గురు మంత్రులు ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయినప్పటికీ కరీంనగర్ నగరంలో పరిస్థితి మాత్రం ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్టు మారిందని లోకల్ లీడర్స్ వాపోతున్నారు. సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినా ఇప్పటికిప్పుడు కదలిక వచ్చే అవకాశం లేదంటు న్నారు. అయితే, కరీంనగర్‌లో 66 డివిజన్లు ఉండగా దాదాపు మూడున్నర లక్షల ఓట్లు ఉండగా.. గత మున్సిపల్ ఎన్నికల్లో హస్తం పార్టీకి రిక్త హస్తమే మిగిలింది. ఇప్పుడు మేయర్ పీఠం దక్కించుకోవాలంటే సున్నా నుంచి మొదలెట్టాల్సి ఉంది. క్షేత్ర స్థాయిలో భారీ కసరత్తే జరగాలని పార్టీలో నిత్యం చర్చ జరుగుతోంది.

**జంకుతున్న నాయకులు**

ప్రజల్లోకి వెళ్లేందుకు అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు జంకుతున్నట్టు టాక్. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కరీంనగర్‌లో ఇంకా ప్రారంభం కాలేదు. ఓవైపు ప్రభుత్వ పథకాలు అందకపోవడం, మరోవైపు ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే, ఎంపీలు ఉండటం వల్ల కాంగ్రెస్ నేతలు తర్జనభర్జన పడుతున్నారు. ఇంకోవైపు కాంగ్రెస్ పార్టీలో సమన్వయం కొరవడటం మరింత ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికే నియోజకవర్గ ఇన్చార్జ్ పదవి ఖాళీగా ఉంది. దీనిపై ముగ్గురు నాయకులు కన్నేయడంతో గందరగోళం నెలకొన్నట్టు కార్యకర్తలు చెబుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన వెలిచాల రాజేందర్ రావు, ఇటీవల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీచేసిన ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముగ్గురూ మూడు గ్రూపులు నడుపుతున్నారని తెలుస్తోంది. ఈ అస్తవ్యస్త పరిణామాలు ఇలాగే కొనసాగితే మేయర్ పీఠం ఎలా దక్కుతుందని పార్టీవర్గాల్లో అంతర్మథనం మొదలైంది.

**లెక్క ఎవరిదీ..!**

కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో 90 శాతం ఓట్లు కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయి. ఇక్కడ బలం పెంచుకోకుండా అసెంబ్లీ ఇన్‌చార్జి పదవి కష్టం. ఈ నేపథ్యంలో ముగ్గురూ మూడువైపులా గట్టిగానే కష్టపడుతున్నా అది వర్గపోరనే చర్చకు దారితీస్తోంది. ప్రతి రెండువారాలకోసారి రిపోర్ట్ పంపాలని సీఎం ఆదేశించడాన్ని అడ్వాంటేజ్‌గా తీసుకున్న వెలిచాల.. తానే లీడర్ అంటూ చెప్పుకుంటున్నారు. ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి సైతం కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం మీద దృష్టిసారించి బేస్ రెడీ చేసుకుంటున్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో తన మనుషులకు టికెట్లు వస్తాయని కూడా హామీ ఇస్తున్నట్టు సమాచారం. ఈ ఇద్దరు కాకుండా గత 15 ఏళ్ల నుంచి పార్టీకి సేవలందిస్తున్న నగర పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కూడా ఇన్చార్జ్ పదవిని ఆశిస్తున్నారు. పార్టీ అధికారంలోకి రాగానే ఆయనకు శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటీ ఛైర్మన్ పదవి దక్కింది. ఎనిమిదేళ్లుగా నగర అధ్యక్షుడిగా కొనసాగడం కలిసొస్తుందనే ఆశాభావంలో ఉన్నారు. పాత కాంగ్రెస్ కార్యకర్తలు సహా మంత్రి శ్రీధర్ బాబు మద్దతు ఉన్నట్టు దీమా వ్యక్తమవుతోంది. అయితే ఎన్నో బలహీనతలున్నచోట కలిసి పనిచేస్తేనే మెరుగైన ఫలితం ఉంటుందని కేడర్ ఆశిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలను ఎదుర్కొని కరీంనగర్‌లో 35 సీట్లు సాధించే దమ్మున్న లీడర్ ఎవరో మరి..!

**THE SUNSTONE MACT SOCIETY LTD**

(The Sunstone Mutually Aided CO-op Thrift & Credit Society)
Regd. No.: TSMC/DCO/RR-3889/2019 (TMACS-1995)
PlotNo.2, Engineers Colony, Chinthalakunta, LB Nagar, Ranga Reddy, Telangana-500074. Ph: 9492601010 Email: smaccsheadoffice@gmail.com

SMACCS

**NOTICE**

Notice is hereby given to the Members that the 6th Annual General Body Meeting of the society will be held on 14-09-2025 (Sunday) at 11.00 A.M, at Khaja Mansion, Masab Tank, Hyderabad. Contact: to transact the following business.

**AGENDA**

1. To receive, consider and adopt the Audited Balance sheet as on 31st March 2025, Profit & Loss Account
2. To consider and approve appropriation of the net profit for the Financial Year.
3. To Elect Directors in place of Directors, who are retiring on the rotation of Geetha Dubba (Election notice by Election Officer is displayed in the Notice Board of all Branches
4. To appoint Auditors for the Financial Year 2025-26 and fix remuneration.
5. To consider any other subject with the permission of the chair.
6. To appoint a new Director in Vacant post.

(BY ORDER OF THE BOARD OF DIRECTORS)

Place: Hyderabad.
Date: 14.9.2025.
**Sd/- D. ALIVELU MANGA (Secretary)**

**LUNCH FOLLOWS :**
All the Members are requested to attend the meeting and make it grand success.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
21 ఆగస్టు 2025

# మహిళా పోలీస్ శక్తికి తెలంగాణ ప్రభుత్వ అండ

- మహిళా పోలీసుల అవసరాలను గుర్తించి ప్రత్యేక వెసలుబాటు కల్పిస్తాం
- కొత్త దిశకు నాంది పలికిన తెలంగాణ మహిళా పోలీసుల తొలి సదస్సు
- సదస్సులో ప్రారంభోపన్యాసం చేసిన మంత్రి సీతక్క





**హైదరాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** మహిళా పోలీస్ శక్తికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని, మహిళా పోలీసుల అవసరాలను గుర్తించి ప్రత్యేక వెసలుబాటు కల్పిస్తామని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. రాజేంద్రనగర్‌లోని రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ ప్రాంగణంలో తెలంగాణ మహిళా పోలీస్ రాష్ట్రస్థాయి తొలి సదస్సు ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మహిళా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డైరెక్టర్ జనరల్ అధికారులు అభిలాష బిష్ట్, చారు సిన్హా, శికా గోయల్, స్వాతి లక్రాతో పాటు కానిస్టేబుల్ నుండి ఎస్పీ స్థాయి వరకు సుమారు 400 మంది మహిళా పోలీస్ అధికారులు ఈ సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో మహిళా పోలీసులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సవాళ్లు, అనుభవాలు, మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై చర్చ జరగనుంది. మహిళా పోలీసుల సంక్షేమం పట్ల ప్రభుత్వ కమిట్‌మెంట్‌ను ఈ సదస్సు ప్రతిబింబిస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోమ్ మినిస్టర్‌గా మహిళా శక్తిని ప్రోత్సహిస్తున్నారని, ఈ సదస్సులో మహిళా పోలీసులు ఇచ్చే సలహాలు, సూచనల ఆధారంగా సంక్షేమానికి సంబంధించిన సానుకూల నిర్ణయాలు తప్పకుండా తీసుకుంటారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. వృత్తి ధర్మం, మాతృత్వం మధ్య మహిళా పోలీసులు ఎదుర్కొనే సంఘర్షణల దృష్ట్యా మెటర్నిటీ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. బొగ్గుబాయిల నుంచి అంతరిక్షం వరకు మహిళలు రాణిస్తున్న ఈ రోజుల్లో మహిళా పోలీసుల ప్రత్యేక అవసరాలను దృష్టిలో పెట్టుకొని పోలీస్ శాఖ అండగా నిలవాలని, సమాజంలో మహిళల పట్ల ఉన్న చిన్నచూపును అరికట్టే బాధ్యత కూడా పోలీసులపైనే ఉందని ఆమె పేర్కొన్నారు. డెడికేషన్, డిసిప్లిన్, డిగ్నిటీతో మహిళా పోలీసులు పనిచేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని, పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులకు భరోసాగా నిలవాలని ఆమె సూచించారు.

ప్రతి ఏడాది జెండర్ సెన్సిటైజేషన్ ట్రైనింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని, మహిళా పోలీసులకు వీక్లీ ఆఫ్, ప్రత్యేక పని వేళల సౌకర్యాలు కల్పించే అంశాన్ని పరిశీలించాలని సీతక్క సూచించారు. మహిళా పోలీసుల అవసరాలను అధ్యయనం చేసి నివేదిక సమర్పిస్తే, వాటి ఆధారంగా చట్టాలు చేయడానికి ప్రభుత్వం ముందుకు వస్తుందని ఆమె స్పష్టం చేశారు. జూనియర్ మహిళా కానిస్టేబుళ్లకు సీనియర్ అధికారులు మెంటర్లుగా మారి మార్గదర్శనం ఇవ్వాలని, సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ హరాస్మెంట్ వంటి కేసులలో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, కౌన్సెలింగ్ కార్యక్రమాలు తప్పనిసరిగా ఉండాలని మంత్రి చెప్పారు. మహిళా పోలీసుల కృషిని గుర్తించేలా ప్రత్యేక అవార్డులు, ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని, మెటర్నిటీ, పోస్ట్ డెలివరీ కాలానికి తగినట్లుగా తమిళనాడు తరహాలో ప్రత్యేక యూనిఫార్ములు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేసి వాటిని తెలంగాణలో అమలు పరచేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మహిళా పోలీసులకు అవసరమైన రెస్ట్ రూములు, వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 80 వేల మంది పోలీసుల్లో మహిళా పోలీసులు కేవలం 7 వేల మంది మాత్రమే ఉన్నారని, వారి సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని సీతక్క గుర్తుచేశారు. మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను అధిగమించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్న నమ్మకాన్ని మంత్రి సీతక్క వ్యక్తం చేశారు. తెలంగాణ మహిళా పోలీస్ రాష్ట్రస్థాయి తొలి సదస్సును ప్రారంభించి ప్రసంగించిన మంత్రి సీతక్కను పోలీసు ఉన్నతాధికారులు సన్మానించారు. తెలంగాణ మహిళా పోలీస్ సదస్సు విచ్చేసిన ఇతర రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులను, పోలీస్ శాఖలో ఉన్నత స్థానంలో ఉన్న మహిళా పోలీసు అధికారులను మంత్రి అభినందించారు.

# తప్పుదోవ పట్టిస్తే కఠిన చర్యలు

- మంత్రి దామోదర్ రాజనర్సింహా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మెడిసిన్ విషయంలో తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఈ మేరకు డ్రగ్ కంట్రోల్ అథారిటీ పనితీరుపై మంగళవారం, వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024-2025లో డీసీఏ వర్క్ ప్రోగ్రెస్‌ను మంత్రికి డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం వివరించారు. 2024లో 25,939 తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 4142 సంస్థలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. 2025లో జనవరి నుంచి జూలై వరకు 16,481 తనిఖీలు చేశామని, నిబంధనలు ఉల్లంఘించిన 2827 సంస్థలపై చర్యలు తీసుకున్నామన్నారు. 2024 జనవరి నుంచి 2025 జూలై వరకు 7200 మెడిసిన్ సాంపిల్స్‌ను టెస్ట్ చేయగా, అందులో 186 నాసిరకం మెడిసిన్‌గా తేలిందని, సంబంధిత సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నామన్నారు. సుమారు 700 కేసులు బుక్ చేశామని వివరించారు. ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జనాలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ, మెడిసిన్ అమ్మకాలు జరుపుతున్న కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్పూరియస్, నాట్ స్టాండర్డ్ డ్రగ్స్ తయారు చేస్తున్న ఫార్మా కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, అమ్మకందారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మెడిసిన్ అనేది ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం అని, ఈ విషయంలోఎలాంటి ఉపేక్ష పనికిరాదన్నారు. పదే పదే నిబంధనలు ఉల్లఘింస్తున్న సంస్థలను చట్టప్రకారం పర్మినెంట్‌గా క్లోజ్ చేయాలని ఆదేశించారు. నకిలీ, నిషేధిత మందుల తయారీ, అమ్మకం దారులపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. మెడిసిన్‌ను ఆహార పదార్థాలుగా చూపిస్తూ, వాటి తయారీ, అమ్మకాలు చేపడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. యాంటిబయాటిక్ రెసిస్టెన్స్ అనేది పెద్ద ముప్పుగా పరిణమిస్తోందని, నిబంధనలు ఉల్లంఘించి యాంటిబయాటిక్స్ అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు ప్రేరేపిత మెడిసిన్ అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీసీఏ డీజీని మంత్రి ఆదేశించారు. డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ అప్‌గ్రేడేషన్ పనులను స్పీడప్ చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు క్వాలిటీ మెడిసిన్, క్వాలిటీ ఫుడ్ అందించే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.



## మోసం కేసులో 'వ్యూహం' నిర్మాత

# దాసరి కిరణ్ అరెస్ట్

**హైదరాబాద్, ఆగష్టు20 (జనంసాక్షి) :** 'వ్యూహం' సినిమా నిర్మాత దాసరి కిరణ్ ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్థిక లావాదేవీల విషయంలో నమోదైన ఫిర్యాదుతో విజయవాడ పటమట పోలీసులు హైదరాబాద్‌లో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం దాసరి కిరణ్‌ను విజయవాడకు తరలించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఉంటు-న్న దాసరి కిరణ్ బంధువు గాజుల మహేశ్ ట్రావెల్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఆయన వద్ద నుంచి కిరణ్ రూ. 4.5కోట్లు అప్పుగా తీసుకున్నారు. తిరిగి ఇవ్వాలని మహేశ్ అనేక సార్లు అడిగినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఈనెల 18న విజయవాడలోని కిరణ్ కార్యాలయానికి మహేశ్, ఆయన భార్య వెళ్లారు. అక్కడ కిరణ్ అనుచరులు దాదాపు 15 మంది వారిపై దాడి చేశారు. దీంతో మహేశ్ విజయవాడ పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# గిరిజన ప్రాంత రైతుల సమస్యలను పరిష్కరించాలి

- వారి సమస్యలపై త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక
- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** గిరిజన ప్రాంత రైతుల సమస్యలను పరిష్కరించేందుకు త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. బీఆర్కే భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో గిరిజన రైతులు- సాగు సమస్యలపై సమావేశం జరిగింది. కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు భూమి సునీల్, రాములు నాయక్, గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, చెవిటి వెంకన్న, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి,ఫారెస్ట్ డీసీఎఫ్ రాజారమణ రెడ్డి, సీసీఎల్ఏ, ఐటీడీఏ, ట్రైబల్ వెల్ఫేర్, వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లు, గిరిజన ప్రాంత రైతులు హాజరయ్యారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతంలోని ఆదివాసీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా హక్కు పత్రాలు ఉన్నా.. బ్యాంకుల నుండి పంట రుణాలు రావడం లేదు. సాగు భూముల్లో బోర్లు, కరెంట్ సౌకర్యం లేకపోవడం, చివరికి పండించిన పంటను సైతం మార్కెట్లో అమ్ముకునే పరిస్థితి లేదని వివరించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2లక్షల 60వేల గిరిజన రైతులకు పోడు పట్టాలున్నాయి. వీరు రుణాలు పొందడంలో ఇబ్బందులు పడ్తున్నట్లు కమిషన్ దృష్టికి తెచ్చారు. మరోవైపు ఇక ఫారెస్టు, రెవెన్యూ సరిహద్దుల వద్ద గెట్టు సమస్య తీవ్రంగా వుంది. కొన్నిఏజెన్సీ ప్రాంతాల్లో ఫారెస్టు ప్రిలిమినరీ నోటిఫికేషన్ వచ్చింది. కానీ ఫైనల్ నోటిఫికేషన్ రాకపోవడంతో..ఆయా ప్రాంతాల్లో గెట్టు సమస్య వల్ల గిరిజన రైతులు తీవ్రంగా ఇబ్బంది పడ్తున్నారు. ఆయా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే.. గిరిజన రైతుల సమస్యలు పరిష్కరించవచ్చని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భూమి సునీల్ సూచించారు. దీంతో అధికారులు పలు సూచనలు కమిషన్ దృష్టికి తెచ్చారు.

ఆర్ఓఎఫ్ఆర్ రికార్డును రెవెన్యూ రికార్డును అనుసంధానం చేయడం ద్వారా చాలా వరకు గిరిజన రైతుల సమస్యలు సాలువ్ అవుతాయన్నారు. భూ భారతి చట్టాన్ని గిరిజన ప్రాంతంలో అమలు చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బ్యాంకర్లు కూడా అటవీ హక్కుల రికార్డు ఆధారంగా లోన్లు ఇచ్చే ఏర్పాటు జరగాలని, ఫారెస్టు సెటిల్మెంట్ ప్రక్రియ త్వరతిగతిన పూర్తి చేయాలని, ఫారెస్టు, రెవెన్యూ గెట్టు సమస్యలు ఉన్నచోట రీసర్వే వెంటనే జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. అయితే ఈ సమావేశంలో వచ్చిన సలహాలు సూచనలు విన్నా.. కమిషన్ త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి ఓ నివేదికను అందజేయనున్నట్లు కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి తెలిపారు. గిరిజన ప్రాంత రైతుల విషయంలో ప్రభుత్వం, సీయం రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని గుర్తు చేశారు.

# బొగ్గుగని కార్మిక సంఘం నేతగా కొప్పుల ఎన్నిక



**హైదరాబాద్, ఆగష్టు 20 (జనంసాక్షి) :** తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడిగా కొప్పుల ఈశ్వర్ నియమితులయ్యారు. సంఘం కార్యవర్గ సమావేశంలో కొప్పుల ఈశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న కవిత స్థానంలో ఈశ్వర్‌ను ఎన్నికోవడం గమనార్హం. కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యకలాపాలను పార్టీ తరఫున ముందుకు తీసుకెళ్లేందుకు భారత రాష్ట్ర సమితి నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు కవిత అధ్యక్షురాలుగా ఉండగా ఇప్పటికే ఆమెను తొలగించారు. దీంతో ఆమె కార్యకలాపాలకు దూరంగా ఉంది.

# రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

### ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలు

**జనగామ, ఆగస్ట్20 (జనంసాక్షి) :** జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతిచెందగా.. ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ-సూర్యాపేట హైవేపై వడ్డిచర్ల వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వడ్లపూడికి చెందిన దద్దోజు సురేశ్, దివ్య దంపతులు తమ పిల్లలు లోక్షణ, మోక్షజ్ఞ లతో కలసి స్వగ్రామంలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్న అనంతరం భార్యపిల్లలతో కలిసి బొలెరో వాహనంలో కరీంనగర్‌కు బయల్దేరారు. మార్గంమధ్యలో లింగాల ఘనపురం మండలం వడ్డిచర్ల నక్షత్ర గార్డెన్ వద్ద వారి వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. సురేశ్ అక్కడికక్కడే మృతిచెందగా.. దివ్య 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయారు. పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కరీంనగర్‌లోని ఓ గ్రానైట్ కంపెనీలో సురేశ్ పనిచేస్తున్నారు.

# బీజేపీ బిల్లులను స్వాగతించిన కాంగ్రెస్ ఎంపీ థరూర్



**న్యూఢిల్లీ, ఆగష్టు 20 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మరోసారి స్వంత పార్టీకి ఝలక్ ఇచ్చారు. కాంగ్రెస్ అగ్రనేతలు వ్యతిరేకిస్తున్నా శశిథరూర్ మాత్రం బీజేపీ సర్కారు కొత్తగా తెచ్చిన బిల్లును స్వాగతించారు. మంచి బిల్లు అంటూ కితాబిచ్చారు. లోక్‌సభలో మోదీ సర్కారు కొత్తగా మూడు బిల్లులను ప్రవేశపెట్టింది. అందులో తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరసగా 30 రోజులపాటు- కస్టడీలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా, ముఖ్యమంత్రులనైనా పదవి నుంచి తొలగించేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. ఈ బిల్లుని విపక్ష పార్టీలన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఈ బిల్లును క్రూరమైందిగా అభివర్ణించారు. అన్యాయంగా ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తే పరిస్థితి ఏంటన్నారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ప్రియాంక వ్యతిరేకిస్తే, అదే పార్టీకి చెందిన శశిథరూర్ మాత్రం ఇది మంచి బిల్లు అంటూ స్వాగతించారు. అంతేకాదు, ఇది ఇంగిత జ్ఞానానికి సంబంధించిన అంశం అన్నారు. ఈ బిల్లును మరింత అధ్యయనం చేసేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపే అంశం మీద కూడా శశిథరూర్ పాజిటివ్‌గా స్పందించారు. అది ఎంతో మంచి విషయమని.. మన ప్రజాస్వామ్యానికి ఎంతో మేలు చేస్తుందని తాను భావిస్తున్నట్లు- తెలిపారు.

# సభలో ప్లకార్డులు, బ్యానర్లు నిషేధం

### సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించొద్దు

### విపక్షాలకు స్పీకర్ ఓం బిర్లా సూచన



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 (జనంసాక్షి) :** జూలై 21న ప్రారంభమైనప్పటి నుంచి ఉభయ సభల్లో బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం చర్చకు అంగీకరించడం లేదు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ హౌస్‌లో, వెలుపల ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నిరసనలు కొనసాగిస్తున్నారు. వారి నిరసనలతో పార్లమెంటు దద్దరిల్లుతోంది. దీంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదాల పర్వం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో హౌస్‌లోకి బ్యానర్లు, ప్లకార్డులను తీసుకురావద్దని ప్రతిపక్ష ఎంపీలను బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కోరారు. చర్చలు సజావుగా సాగేందుకు ప్రతిపక్ష సభ్యులు సహకరించాలని స్పీకర్ కోరారు. ఎస్ఐఆర్‌పై చర్చకు డిమాండ్ చేస్తూ.. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సభకు అంతరాయం కలిగిందని స్పీకర్ తెలిపారు. కాగా, ఈ సందర్భంగా చెక్క కర్రలతో కట్టిన బ్యానర్లు సభలో సముచితం కాదు. మీలో చాలామంది నినాదాలు చేస్తారు, కర్రలు, ప్లకార్డులు, బ్యానర్లు తీసుకువస్తారు. కానీ వీటిని ఇలా సభకు తీసుకురావడం తగిన చర్య కాదు. మీరందరూ రాజకీయ పార్టీలకు చెందినవారు కాబట్టి.. మీరు సభకు సహకరించాలి అని స్పీకర్ ఓంబిర్లా ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి వ్యాఖ్యానించారు.

# బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు



**నిజామాబాద్, ఆగష్టు20 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లాలో ఈ సీజన్‌లో భారీ వర్షాలు కురిశాయి. దాదాపుగా అన్ని చెరువులు నిండాయి. ఎడపల్లి మండలం ధర్మారం గ్రామంలో ఓ బోరుబావి నుంచి ఎలాంటి విద్యుత్ మోటార్ వేయకుండానే నీరు ఉబికి వస్తోంది. గత మూడు రోజుల నుంచి మోటార్ ఆన్ చేయకుండానే తన పంటపొలంలో ఉన్న వ్యవసాయ బోరుబావి నుంచి నీరు వస్తోందని నవీన్ అనే రైతు తెలిపారు. వర్షాలు అధికంగా కురవడంతో భూగర్భంలో నీటి మట్టం పెరిగి బోరు నుంచి నీరు ఉబికి వస్తోందని రైతు చెప్పారు. ఈ ఘటనతో స్థానిక రైతులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. అయితే నీటి నిల్వల కారణంగా ఇలా జరుగుతుందని అధికారులు అన్నారు.

# వివాదంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా

### అటవీ అధికారులపై రాత్రి దాడి

### పోలీస్ స్టేషన్‌లో అటవీ ఉద్యోగుల ఫిర్యాదు



**అమరావతి, ఆగష్టు20 (జనంసాక్షి) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. అధికార పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలపై పలు ఆరోపణలు, విమర్శలు వస్తున్నాయి.. ఇక, టీడీపీ ఎమ్మెల్యేలు వరుసగా వివాదాల్లో చిక్కుకుంటున్నారు.. ఎమ్మెల్యేలకు టీ-డీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు చెబుతున్నా... వార్నింగ్‌లు ఇస్తున్నా.. కొందరి తీరు మారడం లేదట.. అయితే, తాజాగా మరో టీ-డీపీ ఎమ్మెల్యే వివాదంలో చిక్కుకున్నారు.. శ్రీశైలం శిఖరం చెక్ పోస్ట్ వద్ద ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆయన అనుచరుల దాడి చేశారంటూ ఫారెస్ట్ సిబ్బంది ఆరోపిస్తున్నారు.. రాత్రి శిఖరం చెక్ పోస్ట్ దగ్గర తన వాహనాన్ని ఆపి హంగామా చేశారని.. శ్రీశైలం ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, ఆయన అనుచరులు దాడి చేశారంటున్నారు ఫారెస్ట్ బీట్ సిబ్బంది.. ఆత్మకూరు నుంచి వస్తూ శిఖరం చెక్ పోస్ట్ దగ్గర తన వాహనాన్ని ఆపి ఆ రహదారిలో విధులకు వెళ్తున్న అటవీ శాఖ అధికారులను ఎమ్మెల్యే అడ్డుకున్నారని చెబుతున్నారు.. సున్ని పెంటలోని తమ కార్యాలయం నుంచి విధులకు వెళ్తున్న ఫారెస్ట్ డీఆర్‌వో మురళీ నాయక్, ఫారెస్ట్ గార్డులు గురవయ్య, మోహన్ కుమార్, డ్రైవర్ కరిముల్లాలను దుర్భాషలాడారని అన్నారు.. ఆపై ఫారెస్ట్ వాహనాన్ని తానే నడుపుతూ ఫారెస్ట్ సిబ్బందిని కూడా వాహనాల్లో ఎక్కించుకు ఎమ్మెల్యే వెళ్లారని అంటున్నారు.. తెల్లవారుజామున రెండు గంటల వరకూ వారిని ఎమ్మెల్యే, ఆయన అనుచరులు తిప్పినట్టుగా తెలుస్తుండగా.. ఫారెస్ట్ గార్డ్ గురవయ్యపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేశారని చెబుతున్నారు... ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఆయన అనుచరులు తమపై దాడి చేశారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు ఫారెస్ట్ సిబ్బంది.. ఈ వ్యవహారంపై పోలీస్ స్టేషన్ లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు ఫారెస్ట్ సిబ్బంది.. డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి దాడి ఘటనను వివరిస్తామన్నారు. ప్రభుత్వం పరంగా ఆ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని, ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. శరీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆయన అనుచరులు దాడి చేశారని అటవీశాఖ ఉద్యోగులు ఆరోపించారు. శ్రీశైలం ప్రాజెక్టు -టైగర్, మార్కాపురం డివిజన్‌లోని నెక్కంటి రేంజ్ అటవీ ఉద్యోగులపై మంగళవారం రాత్రి శ్రీశైలం సమీపంలోని శిఖరేశ్వరం వద్ద ఎమ్మెల్యే, అనుచరులు దాడి చేశారని శ్రీశైలం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370